




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY | నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 13 బుధవారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 329

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur









## సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం

- సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసు సిట్‌కి బదిలీ
- ఇప్పటివరకు 25 మంది నిందితుల అరెస్ట్
- రూ.15 లక్షల అదనపు డిమాండ్ ఆరోపణ

2



2


## బంగారంపై సుంకాలు ఉండవు.. ట్రంప్ కీలక ప్రకటన

- బంగారం దిగుమతులపై ఎలాంటి సుంకాలు విధించడం లేదన్న ట్రంప్
- కొన్ని రోజులుగా మార్కెట్‌లో కొనసాగుతున్న గందరగోళానికి తెర

# మళ్లీ కాళ్ల బేరానికి..

## సింధు జలాలను పునరుద్ధరించాలని భారత్‌కు పాకిస్థాన్ విన్నపం

- పాక్ సైనిక చీఫ్ అణు బెదిరింపు
- బిలావల్ భుట్టో యుద్ధ హెచ్చరిక
- సింధు జలాల పునరుద్ధరణపై పాక్ డిమాండ్
- ఒప్పంద అమలుపై పాక్ కట్టుబడి వుందని ప్రకటన
- భారత్ రద్దు చేసిన సింధు జలాల ఒప్పందం
- నీటి ఎద్దడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాక్
- కోర్టు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించిన పాక్
- భారత్ తిరస్కరించిన ఆర్బిట్రేషన్ తీర్పు



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 12: జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్ర దాడి కారణంగా భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలతో పాకిస్థాన్ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌పై పాకిస్థాన్ రోజుకు ఒక రీతిగా వ్యవహరిస్తోంది. భారత్‌పై అణు బాంబు వేస్తామంటూ పాకిస్థాన్ సైనిక చీఫ్ అసిమ్ మునీర్ ప్రకటించారు. ఆ మరుసటి రోజే భారత్‌పై యుద్ధానికి దిగుతామంటూ ఆ దేశ విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలా వల్ భుట్టో వెల్లడించారు. ఆ మరునాడే అంటే.. ఈ రోజు మంగళ వారం సింధు జలాలను పునరుద్ధరిం చాలని భారత్‌ను పాకిస్థాన్ కోరింది. ఈ నదీ జలాల విషయంలో కోర్టు ఆర్బిట్రేషన్ వివరణను తాము స్వాగతిస్తామని పాక్ స్పష్టం చేసింది. ఈ ఒప్పందాన్ని పూర్తిగా అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. సింధు జలాల ఒప్పందాన్ని అనుసరించి.. ఈ నదీ జలాలను వెంటనే పునరుద్ధరించాలని భారత్‌ను కోరింది. ఈ ఒప్పందంలో భాగంగా చేసుకున్న హామీలను నమ్మకంగా అమలు చేయాలని భారత్‌ను కోరింది. ఈ మేరకు పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంగళవారం తన ఎక్స్ ఖాతా వేదికగా భారత్‌కు కోరింది. శతాబ్దాల క్రితం చేసుకున్న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడంపై పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో సోమవారం స్పందించారు. భారత్ నిర్ణయం కారణంగా పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ నేపథ్యంలో భారత్ ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పాకిస్థానీయులంతా ఒక తాటిపైకి రావాలంటూ పిలుపు నిచ్చారు. ఈ పిలుపు ఇచ్చిన మరునాడే.. సింధు జలాలను విడుదల చేయాలంటూ భారత్‌ను పాకిస్థాన్ ప్రాధేయపడింది. ఇంతకీ ఏం జరిగిందంటే..

పెహల్గాం ఉగ్రదాడి వెనుక కర్త, కర్మ, క్రియ అంతా పాకిస్థాన్ అని భారత్ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో 1960లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య చేసుకున్న సింధు నది జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు భారత్ ప్రకటించింది. అలాగే పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ మరికొన్ని నిర్ణయాలు తీసుకుంది. ఇక పాక్ సైతం భారత్‌కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకున్నాయి. అయితే సింధు జలాలను భారత్ నిలిపివేసింది. దాంతో పాకిస్థాన్‌లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది.

అందులో భాగంగా నీటిని విడుదల చేయాలంటూ పాకిస్థాన్ కోరినా.. భారత్ మాత్రం కనికరించలేదు. అలాంటి వేళ.. ఈ నదీ జలాలపై భారత్ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ.. కోర్టు ఆర్బిట్రేషన్‌ను పాకిస్థాన్ ఆశ్రయించింది. కోర్టు ఆర్బిట్రేషన్ ఇచ్చిన తీర్పును తాము తిరస్కరిస్తున్నామని భారత్ స్పష్టం చేసింది. ఈ కోర్టు ఆర్బిట్రేషన్ ఆదేశాలను తాము పరిగణలోకి తీసుకోవడం లేదని పాకిస్థాన్‌కు భారత్ కుండ బద్దలు కొట్టిన సంగతి తెలిసిందే. ఈ సింధు జలాల ఒప్పందంలో భాగంగా బియాస్, సట్లెజ్, రావి నదులపై భారత్‌కు హక్కులుంటే.. ఇండస్, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్ హక్కులను కలిగి ఉన్న విషయం విదితమే.

# లోక్‌సభలో కొత్త బిల్లు పాస్

## 60 ఏళ్లనాటి ఆదాయపు పన్ను చట్టానికి స్వస్తి

- ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య లోక్‌సభలో 2 కీలక ఆర్థిక బిల్లులు పాస్
- మూజువాణి ఓటుతో ఆదాయపు పన్ను బిల్లు, పన్నుల చట్టాల సవరణ బిల్లుకు ఆమోదం
- 6 దశాబ్దాల నాటి 1961 ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త చట్టం
- ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణను వ్యతిరేకిస్తూ విపక్షాల ఆందోళన
- సౌదీ అరేబియా పెట్టుబడులకు పన్ను మినహాయింపులు కల్పించే సవరణలు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

ప్రతిపక్ష సభ్యుల తీవ్ర నిరసనలు, నినాదాల మధ్యే కేంద్ర ప్రభుత్వం రెండు కీలక ఆర్థిక బిల్లులను లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. సోమవారం సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నప్పటికీ, ఆదాయపు పన్ను బిల్లు-2025, పన్నుల చట్టాల (సవరణ) బిల్లు-2025 మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ విపక్షాలు ఆందోళనకు దిగాయి.

సోమవారం సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను ప్రవేశపెట్టారు. అదే సమయంలో ప్రతిపక్ష సభ్యులు "ఓట్ల దొంగతనం ఆపండి", "ఎస్ఐఆర్ వాపస్ తీసుకోండి" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళం నడుమనే స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ బిల్లులపై ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

**60 ఏళ్ల చట్టం స్థానంలో కొత్త బిల్లు**

కొత్తగా ఆమోదం పొందిన ఆదాయపు పన్ను బిల్లు,



2025, గత ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 1961 నాటి చట్టం స్థానంలోకి రానుంది. బీజేపీ ఎంపీ బైజయంత్ పండా నేతృత్వంలోని పార్లమెంటరీ సెలెక్ట్ కమిటీ చేసిన 285 సిఫార్సులను ఈ కొత్త బిల్లులో పొందుపరిచారు. ఈ బిల్లు ద్వారా పన్నుల భాషను సరళతరం చేయడం, మినహాయింపులపై స్పష్టత ఇవ్వడం, గృహ రుణంపై వడ్డీ, ప్రామాణిక తగ్గింపులు వంటి విషయాల్లో ఉన్న సందిగ్ధతలను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్

# ముగ్గురుంటే ఏంటీ?

## అన్న మంత్రి అయితే తమ్ముడికి ఇవ్వకూడదా? ఇదేం రూల్

ఎమ్మెల్యే కోమటిరెడ్డి హాట్ కామెంట్స్

- మంత్రి పదవిపై కోమటిరెడ్డి అసంతృప్తి
- ఎన్నికల హామీ నిలబెట్టలేదని ఆరోపణ
- అన్నదమ్ములిద్దరికీ మంత్రి పదవి ఎందుకు ఇవ్వరు?
- మునుగోడు నిధులపై విమర్శ
- ఖమ్మంలో ముగ్గురు మంత్రులు ఉన్నారు



2

**మునుగోడు-నవభూమిబ్యూరో**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో, రేవంత్ సర్కార్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. గత కొంత కాలంగా మంత్రి పదవి కోసం పట్టుపడుతున్న ఆయన.. సీఎం రేవంత్ సహా.. పార్టీపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తనకు ఎన్నికలకు ముందు మంత్రి పదవి ఇస్తామని చెప్పి మాట తప్పుతున్నారని.. తన నియోజకవర్గానికి నిధులు కూడా విడుదల చేయటం లేదని బహిరంగంగానే ఘాటు వాఖ్యలు చేస్తున్నారు. తాజాగా.. మరోసారి రాజగోపాల్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. మునుగోడు నియోజవర్గంలోని ఎలగలగూడెంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రి పదవి ఉంటే తనకు మంత్రి పదవి ఇవ్వకూడదనే రూల్ ఉందా? అని

# ఏపీలో సెమీకండక్టర్ తయారీ యూనిట్

## రాష్ట్రానికి మరో పెట్టుబడి.. కేబినెట్ భేటీలో గ్రీన్‌సిగ్నల్..

- ఏపీలో సెమీకండక్టర్ యూనిట్‌కు కేంద్ర ఆమోదం
- రూ.4600 కోట్లతో 3 రాష్ట్రాల్లో 4 యూనిట్లు
- ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా కొత్త ప్రాజెక్టులు
- దక్షిణ కొరియా ఏపీఎస్‌సీతో టెక్నాలజీ టైఅప్
- వార్షికంగా 96 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం
- మొబైల్, ఆటో, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులలో వినియోగం
- 2034 మంది స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్యోగాలు
- పరోక్షంగా మరింత ఉపాధి అవకాశాలు
- రూ.1.60 లక్షల కోట్లతో దేశవ్యాప్తంగా 10 యూనిట్ల ఆమోదం

2



**అమరావతి-నవభూమి ప్రతినిధి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఏపీలో సెమీకండక్టర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రూ.4600 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో సెమీకండక్టర్ల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో నిర్ణయించారు. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో భాగంగా దేశంలో మరో నాలుగు సెమీకండక్టర్ ప్రాజెక్టులు చేపట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు ఇప్పటికే 6 ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయి. తాజాగా మరో 4 సెమీకండక్టర్ తయారీ యూనిట్లకు ఆమోదం లభించింది. కాంటినెంటల్ డివైస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 3ఙ% గ్లాస్ సొల్యూషన్స్ ఇంక్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ నుంచి సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్లు నెలకొల్పుతామంటూ వచ్చిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఒడిశాలో త్రీడీ గ్లాసెస్ సంస్థలు పెట్టుబడులు

# అమరావతిలో నేడు బసవతారం ఆసుపత్రికి శంకుస్థాపన

- అమరావతిలో బసవతారకం ఆసుపత్రికి 21 ఎకరాల కేటాయింపు
- శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకానున్న బాలకృష్ణ, కుటుంబ సభ్యులు
- తొలి దశలో 300 పడకల సామర్థ్యంలో ఆసుపత్రి నిర్మాణం



2

**అమరావతి-నవభూమి ప్రతినిధి**

అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి రేపు శంకుస్థాపన చేయనున్నారు. తుళ్లూరు - అనంతవరం గ్రామాల మధ్య ఈ ఆసుపత్రిని నిర్మించబోతున్నారు. బసవతారకం ఆసుపత్రి కోసం 21 ఎకరాల భూమిని సీఆర్డీయే కేటాయించింది. రేపు ఉదయం 9.30 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఎమ్మెల్యే, బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. అమరావతి బసవతారకం ఆసుపత్రిని తొలి దశలో 300 పడకల సామర్థ్యంతో నిర్మించనున్నట్టు సమాచారం. ఆ తర్వాత దీన్ని వెయ్యి పడకలకు విస్తరించనున్నారు. వాస్తవానికి 2014-19 మధ్య కాలంలోనే అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు పడ్డాయి. అప్పట్లోనే ప్రభుత్వం ఆసుపత్రికి భూమిని కేటాయించింది. అయితే 2019లో వైసీపీ విజయం సాధించడంతో ఆసుపత్రి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వం స్థలం కేటాయించడంతో... ఆసుపత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని భావిస్తున్నారు.

# బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై నిరాధార ఆరోపణలు చేశారన్న కేటీఆర్
- కేంద్ర మంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మాట్లాడారని ఆగ్రహం
- రాజకీయ ఉనికి కోసం ఇలా దిగజారి మాట్లాడటం సరికాదన్న మాజీ మంత్రి



2

**హైదరాబాద్-నవభూమి బ్యూరో**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఇవాళ (మంగళవారం) లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్ఠను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల(ఆగస్టు) 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరఫు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్ఠను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు మాజీ మంత్రి కేటీఆర్.

# అప్పుల తిప్పలు!

- తెలంగాణ అప్పులు బయటపెట్టిన కేంద్రం
- కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాలు వెల్లడి
- 2024 మార్చి 31 నాటికి ఏకంగా రూ.3,50,520.39 కోట్లకు చేరిన రాష్ట్ర అప్పులు

2



**హైదరాబాద్-నవభూమి ప్రతినిధి**

మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం.. దశాబ్ద కాలంలోనే భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మిగులు బడ్జెట్‌తో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం.. దశాబ్ద కాలంలోనే భారీ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. లోక్‌సభలో వెల్లడైన వివరాల ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి రాష్ట్ర అప్పులు ఏకంగా రూ.3,50,520.39 కోట్లకు చేరుకున్నాయి. ఈ పరిస్థితి రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనలకు దారితీస్తోంది. -పదేళ్లలో ఐదు రెట్లు పెరిగిన అప్పులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి ఆర్థిక సంవత్సరం 2014-15లో రాష్ట్ర అప్పులు కేవలం రూ.69,603.87 కోట్లుగా ఉన్నాయి. కానీ, 2023-24 నాటికి ఈ అప్పులు ఐదు రెట్లు పెరిగి రూ.3,14,545 కోట్లకు చేరుకున్నాయి. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో ఈ అప్పుల పెరుగుదల జరిగిందని, దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాల పేరుతో తీసుకున్న అప్పుల వినియోగం, పారదర్శకతపై ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఆస్తుల

# ఎంపీ అవినాష్ అరెస్టు

**పులివెందుల-నవభూమి ప్రతినిధి**


శాంతిభద్రతల సమస్యను చూపిస్తూ..ఆయన్ను అదుపులోకి తీసుకోవటమే కాదు.. ఆయన్ను పులివెందుల నుంచి తరలిస్తున్నారు. వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డిని పులివెందుల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శాంతిభద్రతల సమస్యను చూపిస్తూ..ఆయన్ను అదుపులోకి తీసుకోవటమే కాదు.. ఆయన్ను పులివెందుల నుంచి తరలిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల.. ఒంటిమిట్టలో ఈ రోజు జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. 2లో

# ఒంగోలు పోలీస్ స్టేషన్‌లో విచారణకు రామ్‌గోపాల్ వర్మ

- 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో చంద్రబాబు, పవన్, లోకేశ్ ఫొటోల మార్ఫింగ్
- గతేడాది నవంబర్ 10న ఆర్జీవీపై మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఒంగోలు రూరల్ పోలీసుల నోటీసులు

2

**అమరావతి-నవభూమి ప్రతినిధి**



ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఇవాళ ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు నోటీసులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోల మార్ఫింగ్ కేసులో ఈ నోటీసులు జారీ అయ్యాయి. 'వ్యూహం' సినిమా ప్రమోషన్‌లో భాగంగా నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి రాంగోపాల్ వర్మ కించపరిచినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయనపై గతేడాది నవంబర్ 10వ తేదీన మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 7న వర్మ విచారణకు వచ్చారు. మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఈ రోజు మళ్లీ ఆయన విచారణకి హాజరయ్యారు. ఆర్జీవీని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు ప్రశ్నిస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2
హైదరాబాద్
బుధవారం
13 ఆగస్టు 2025

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి



అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. విద్యార్థినిని గండిమైసమ్మ ప్రాంతంలోని బాలాజీ నగర్‌కు చెందిన శ్రీను వర్మ కుమార్తె శ్రీజ వర్మ (23)గా గుర్తించారు. శ్రీజ ఉన్నత చదువుల కోసం కొంతకాలం క్రితమే అమెరికాకు వెళ్లింది. అక్కడ చికాగోలో నివసిస్తోంది. సోమవారం రాత్రి తాను ఉంటున్న అపార్ట్‌మెంట్ నుంచి దగ్గర్లోని రెస్టారెంట్‌కు డిన్నర్ చేసేందుకు నడుచుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో ఓ ట్రక్కు శ్రీజను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీజ.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.కాగా, సిద్దిపేట జిల్లాకు చెందిన శ్రీను వర్మ ఫ్యామిలీ కొంతకాలం కిందటే హైదరాబాద్‌కు షిఫ్ట్ అయినట్లు తెలిసింది.


శ్రీను వర్మ డ్రైవర్‌గా పనిచేస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. పై చదువులకని వెళ్లిన తన కుమార్తె ఇలా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

కాగా, శ్రీను వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లినట్లు బంధువులు తెలిపారు.

## నవ వార్త





# సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం



**హైదరాబాద్-నవభూమి:**సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసును సిట్‌కు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారం)ఈ కేసుకు సంబంధించిన విషయాలను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. సృష్టి కేసును సీసీఎస్ సిట్‌కి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. సృష్టి కేసులో నమోదు చేశామని వివరించారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించారని చెప్పుకొచ్చారు. మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని సృష్టి యాజమాన్యం డిమాండ్ చేసిందని తెలిపారు డీసీపీ రష్మీ పెరుమాళ్.విశాఖపట్నంలో కూడా సరోగసీ పేరుతో మోసం చేశారని డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డీఎన్ఏ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలామంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్లు విద్యులత, రవిను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వైజాగ్‌కి చెందిన డాక్టర్ విద్యులతతో పాటు డాక్టర్ రవి, డాక్టర్ ఉషను అరెస్ట్ చేశామని వివరించారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా మాత్రమే వాడుకున్నారని గుర్తుచేశారు. ఇక్కడ పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారని చెప్పారు. మిగతా సరోగసీ ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు డీసీపీ రష్మీ పెరుమాళ్.

వీరిలో చాలామంది మహిళలు ఉన్నారని... మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారు ఉన్నారని, సరోగసీ తల్లులుగా నటించిన వాళ్లు ఉన్నారని తెలిపారు. ఎవరైనా దంపతులు సరోగసీ కోసం అప్రోచ్ అవగానే.. వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపుతారని చెప్పుకొచ్చారు. సరోగసీ పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని చెబుతారని అన్నారు. అదే సమయంలో డాక్టర్ నమ్రత ఏజెంట్లు ఓ గర్భిణిని వెతికిపెడతారని తెలిపారు. 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి.. ఆ శిశువును సరోగసీ ద్వారా పుట్టిన పాప అని చెప్పి దంపతులకు అప్పగిస్తారని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

# బంగారంపై సుంకాలు ఉండవు.. ట్రంప్ కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:**అంతర్జాతీయ మార్కెట్లను కొన్ని రోజులుగా కలవరపెడుతున్న ఊహాగానాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరదించారు. బంగారం దిగుమతులపై తమ ప్రభుత్వం ఎలాంటి సుంకాలు (టారిఫ్‌లు) విధించడం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో ఒకే ఒక్క వాక్యంతో "బంగారంపై సుంకాలు ఉండవు!" అని పోస్ట్ చేశారు. దీంతో పసిడి వాణిజ్యంపై నెలకొన్న గందరగోళానికి తెరపడినట్లయింది.ఇటీవల స్విట్జర్లాండ్ నుంచి దిగుమతి అయ్యే 1 కిలోగ్రాము, 100 ఔన్సుల గోల్డ్ బార్స్‌పై అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం సుంకాలు విధించవచ్చని ఒక వార్త హల్‌చల్ చేసింది. ఈ వార్తలతో బంగారంపై దేశాలవారీగా సుంకాలు విధిస్తారేమోనన్న ఆందోళనలు మొదలయ్యాయి. ఈ రకం గోల్డ్ బార్స్‌ను కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఫ్యూచర్స్ కాంట్రాక్టుల కోసం, అలాగే ఆభరణాల తయారీ, పారిశ్రామిక అవసరాల కోసం ఎక్కువగా వినియోగిస్తారు. సుంకాలు విధిస్తే అంతర్జాతీయంగా బంగారం సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతుందని స్విస్ తయారీదారుల సంఘం కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా ప్రకటనతో మార్కెట్ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

**చైనా టారిఫ్‌ల గడువు పొడిగింపు**

బంగారంపై స్పష్టతనిచ్చిన సమయంలోనే, చైనాతో వాణిజ్య వివాదం విషయంలో ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌ల గడువును మరో 90 రోజులు పొడిగిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. వాస్తవానికి ఈ గడువు ఆగస్టు 12వ తేదీ అర్ధరాత్రితో ముగియాల్సి ఉంది. అమెరికా సోయాబీన్స్ కొనుగోళ్లను నాలుగు రెట్లు పెంచాలని చైనాను కోరిన మరుసటి రోజే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు హౌస్ అరెస్టు

**బంజారాహిల్స్-నవభూమి:** తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వాస్తవానికి ఆయన ఎలాంటి ఆందోళనలకు పిలుపు ఇవ్వలేదు. ఎలాంటి నిరసనలు చేపడతామని కూడా చెప్పలేదు. కానీ, పోలీసు లు ఆయనను మంగళవారం ఉదయం 6 గంటలకే ఇంటి నుంచి బయటకు కదలరాదంటూ.. హౌస్ అరెస్టు చేశారు. ఈ పరిణామం రాష్ట్రంలో బీజేపీ నాయకులకు ఆగ్రహం తెప్పించింది. వెంటనే రియాక్ట్ అయినా.. పార్టీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి పోలీసులపై విమర్శలు గుప్పించారు. ఇటీవల బంజారాహిల్స్‌లోని పెద్దమ్మ గుడిలో ఓ వ్యక్తి చొరబడి ఆలయంలో ధ్వంసానికి పాల్పడ్డాడు. ఈ ఘటనను అప్పట్లోనే బీజేపీ నాయకులు ఖండించారు. రాష్ట్రంలో హిందూ సంస్థలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఈ క్రమంలో మంగళవారం పెద్దమ్మగుడిని దర్శించేందుకు.. అమ్మవారికి పూజలు చేసేందుకు హిందూ సంఘాలు పిలుపునిచ్చాయి. వీటిపై స్పందించి.. రాం చందర్‌రావు కూడా.. కుంకుమార్చనకు వస్తారన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామునే.. ఆయన నివాసానికి వెళ్లి హౌస్ అరెస్టు చేస్తున్నట్టు ప్రకటిం చారు. మరోవైపు.. జీహెచ్ ఎంసీ పరిధిలో పలువురు కార్పొరేటర్లను కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కాగా.. ఈ అరెస్టుల తీరుపై హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అసలు తాము ఎలాంటి నిరసన, ధర్నాకు పిలుపు ఇవ్వకుండానే రాంచందర్‌రావు హౌస్ అరెస్ట్‌ను ప్రకటించడం ఏంటని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి నిలదీశారు. రేవంత్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వానికి ప్రజలను రక్షించడం, శాంతి భద్రతలను కాపాడడం చేతరావడం లేదని వ్యాఖ్యానించారు. అసలు ఎలాంటి నిరస న వ్యక్తం చేయకుండానే గృహ నిర్బంధం చేయడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం ప్రజా నిరసనలకు, ఉద్యమాలకు వణికి పోతోందని మంత్రి ఎద్దేవా చేశారు.

## చందానగర్ ఖజానా జ్యువెలర్స్ సిబ్బందిపై కాల్పులు..

# నగలు దోచుకెళ్లిన దొంగలు




**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ చందానగర్‌లో ఉన్న ఖజానా జ్యువెలర్స్ షోరూంలో కాల్పులు కలకలం రేపాయి. ఇవాళ ఉదయం జ్యువెలర్స్ సిబ్బందిపై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ముసుగు ధరించిన ఆరుగురు దుండగులు షాప్ తెరిచిన వెంటనే లోపలికి చొరబడ్డారు. దోపిడీని అడ్డుకోవడానికి ప్రయత్నించిన డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి గాయపరిచారు. సిబ్బందిపై కాల్పులు జరపడమే కాకుండా, షాపులోని సీసీ కెమెరాలపై కూడా కాల్పులు జరిపారు. గోల్డ్ లాకర్ కీస్ ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడ్డారు. అనంతరం షోరూంలోని వెండి సామాగ్రి, నగలు దోచుకున్నారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. మిగతా సిబ్బంది గాయపడిన వారిని వెంటనే ఆసపుత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే షోరూం వద్దకు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కాల్పులు జరిపి దుండగులు జహీరాబాద్ వైపు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. దోపిడీదారులు కేవలం 1 కేజీ వెండిని మాత్రమే తీసుకెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై సైబరాబాద్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో హై-అలెర్ట్ ప్రకటించారు. అన్ని చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. ఉదయాన్నే జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వాణిజ్య ప్రాంతాల భద్రతపై ఆందోళనలకు దారితీసింది. షాపు యజమానులు భద్రతా చర్యలను పెంచాలని పోలీసులు సూచించారు. ఉదయం 10.40 గంటల సమయంలో దోపిడి దొంగలు లోపలికి ప్రవేశించనినట్లు షోరూం ఎగ్జిగ్యూటివ్ మేనేజర్ సులేమాన్ మేనేజర్ తెలిపారు. ముందు కస్టమర్లు అనుకున్నామని.. అందరూ మాస్కులు వేసుకొని ఉండటంతో అప్రమత్తమైనట్లు చెప్పారు. రావటం రావటమే తమ మేనేజర్ తొడపై కాల్పులు జరిపినట్లు తెలిపారు. దీంతో సిబ్బందితో సహా.. అందరం బయపడినట్లు వెల్లడించారు. ఈరోజే తమకు చివరి రోజు అన్నట్లు భయపడినట్లు వెల్లడించారు. అందరూ డబుల్ షర్ట్స్ వేసుకున్నరని.. ఎక్కడ్నుంచి వచ్చారో తెలియదు.. సడెన్‌గా వచ్చారన్నారు. మమ్మల్ని తిట్టడంటోపాటు, చేయి కూడా చేసుకున్నారని ఎగ్జిగ్యూటివ్ మేనేజర్ సులేమాన్ వెల్లడించారు.

# పదో తరగతి విద్యార్థులకు అలర్ట్.. మార్కుల విధానంపై విద్యాశాఖ కీలక నిర్ణయం..



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఏడాది నవంబర్‌లో విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇంటర్నల్ మార్కులను ఎత్తేశామని తెలిపింది. కానీ ఇటీవల ఢిల్లీలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(నిర్వహించిన వర్క్‌షాప్‌లో విద్యా శాఖ తీసుకున్న ఈ నిర్ణయంపై పలు ప్రశ్నలు తలెత్తడంతో పునరాలోచనలో పడింది.చివరకు పదో తరగతి పరీక్షల విధానంపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఇంటర్నల్ మార్కులను రద్దు చేయాలనే ఆలోచనను వాయిదా వేసింది. దీంతో విద్యార్థులకు ఈ సంవత్సరం కూడా పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయి. 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు ఇంటర్నల్ మార్క్స్ ఉండనున్నాయి. ఈ నిర్ణయం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ బోర్డు ఆగస్టు 11న ఉత్తర్వులు జారీ చేసింది.ఇలా 2025-26 విద్యా సంవత్సరంలో పాత విధానాన్నే అమలు చేస్తామని తెలిపింది. 'గతంలో జారీ చేసిన ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నాం' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మార్పులను వెంటనే అమలు చేయాలని హైదరాబాద్, వరంగల్ ఆర్డీజేలకు, అన్ని ఎ ఆదేశాలు జారీ చేశారు. డైరెక్టర్, స్కూల్ ఎడ్యుకేషన్ ఈ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. అయితే.. ఉపాధ్యాయ సంఘాలు ఈ నిర్ణయంపై వేర్వేరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఒత్తిడి వల్లే ప్రభుత్వం ఇలా చేసిందని ఆరోపిస్తున్నారు. ఇంటర్నల్ మార్కుల వల్ల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నష్టం జరుగుతుందని వారు అంటున్నారు.ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ మార్కులు సులభంగా వస్తాయని వారి వాదన. కానీ.. ఈ విధానం కొనసాగడం వల్ల విద్యార్థులకు పరీక్షల్లో ఒత్తిడి తగ్గుతుందని విద్యా నిపుణులు చెబుతున్నారు. ప్రతీ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి నెలలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే వార్షిక పరీక్షలకు ఇంకా సమయం ఉండటంతో ఇప్పటి నుంచే మంచి మార్కులు తెచ్చుకునేందుకు కసరత్తు ప్రారంభించారు విద్యార్థులు.

# తెలంగాణలో మరికొన్ని రోజులు అత్యంత భారీ వర్షాలు..



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో మరికొద్దిరోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని.. దీని ప్రభావంతో బుధవారం వరకు పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశాలున్నాయని.. తర్వాతి 48 గంటల్లో బలపడే అవకాశం ఉందని పేర్కొంది.

ఉత్తర కోస్తాంధ్రను ఆనుకొని ఉన్న తెలంగాణ మీదుగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. ఈ క్రమంలో తెలంగాణలో మంగళశారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం హన్మకొండ, జనగాం, మహబూబాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది.ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, హైదరాబాద్, భూపాలపల్లి, కరీంనగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. ఈ జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. గురువారం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వానలు పడుతాయంటూ రెడ్ అలెర్ట్ జారీ చేసింది.అలాగే, హన్మకొండ, హైదరాబాద్, జనగాం, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడుతాయని.. ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్, కరీంనగర్, ములుగు, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అలాగే, శుక్ర, శనివారాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడుతాయని చెప్పింది. ఇదిలా ఉండగా గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిశాయి. సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా వరంగల్ జిల్లా కాపులకనపర్తి గ్రామంలో 21.8 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ వివరించింది.

# అప్పుల తిప్పలు!

**(1వపేజీ తరువాయి)**పెరుగుదల.. కానీ ఆందోళనకరమైన నిష్పత్తి అప్పులతో పాటు రాష్ట్ర ఆస్తులు కూడా పెరిగాయనేది వాస్తవం. 2014-15లో రూ.83,142.68 కోట్లుగా ఉన్న ఆస్తుల విలువ 2023-24 నాటికి రూ.4,15,099.69 కోట్లకు చేరింది. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వల్ల ఇది సాధ్యమైంది. అయితే, అప్పుల పెరుగుదల వేగంతో పోలిస్తే ఆస్తుల పెరుగుదల నిష్పత్తి ఆందోళనకరంగా ఉంది. ఇభవిష్యత్తు సవాళ్లు, పరిష్కార మార్గాలు పెరిగిన అప్పులను తిరిగి చెల్లించాల్సిన భారం, వాటిపై వడ్డీలు భవిష్యత్తులో రాష్ట్ర బడ్జెట్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కఠినమైన ఆర్థిక నియంత్రణలు పాటించాలి. ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు, అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. ముఖ్యంగా, అప్పులను ఉత్పాదక రంగాలు, దీర్ఘకాలిక ప్రయోజనాలు అందించే ప్రాజెక్టుల్లో మాత్రమే పెట్టుబడి పెట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టే అవకాశం ఉంటుంది. లేకపోతే, అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉంది. కేంద్రం వెల్లడించిన ఈ గణాంకాలు తెలంగాణ ఆర్థిక స్థితిపై కొత్త చర్చలకు తెరలేపాయి. భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వం అప్పుల నిర్వహణలో ఎలాంటి విధానాలను అనుసరిస్తుందో వేచి చూడాలి. మొత్తానికి, కేంద్రం వెల్లడి చేసిన ఈ గణాంకాలు తెలంగాణ ఆర్థిక స్థితిగతులపై రాజకీయ, ప్రజాస్వామ్య వర్గాల్లో కొత్త చర్చలకు దారితీశాయి. అప్పుల నిర్వహణలో భవిష్యత్ దిశ రాష్ట్ర ఆర్థిక ఆరోగ్యానికి కీలకమవుతుంది.

# ఎంపీ అవినాష్ అరెస్టు

**(1వపేజీ తరువాయి)**ఈ రెండు ఉప ఎన్నికల్ని అధికార కూటమితో పాటు.. వైసీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కడప జిల్లాలోని ఈ రెండు జెడ్పీలు వైసీపీకి కంచుకోట లాంటివి. ఈ నేపథ్యంలో ఈ రెండింటిని తమ సొంతం చేసుకుంటే వైసీపీకి దిమ్మ తిరిగే షాక్ ఇవ్వాలన్నది అధికార టీడీపీ ఆలోచన. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు పోటాపోటీగా బరిలోకి దిగాయి. గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన ముఖ్యుల్ని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. పోలీసుల తీరును ప్రశ్నిస్తూ తన ఇంటి ఎదుట ఎంపీ అవినాష్ రెడ్డి నిరసన తెలుపుతున్నారు. దీంతో భారీగా వైసీపీ శ్రేణులు అవినాష్ ఇంటి వద్ద చేరాయి. దీంతో.. పోలీసులు ఎంట్రీ ఇచ్చి వైసీపీ శ్రేణుల్ని అవినాష్ రెడ్డి ఇంటి నుంచి బయటకు పంపుతున్నాయి. వైసీపీ ఏజెంట్లపై టీడీపీ దాడులు చేస్తుందని.. అలాంటి దాడుల్ని అపాల్సిన పోలీసులు తనను అడ్డుకోవటం ఏమిటి? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ముందస్తు జాగ్రత్తగా ఎంపీ అవినాష్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆయన్ను ఇంటి నుంచి పోలీసు వాహనంలో బయటకు తీసుకెళ్లారు. పోలీసుల తీరుపై అవినాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంతటి దారుణ పరిస్థితిని తానెప్పుడు చూడలేదన్న ఆయన.. దాడ్ను ఆపాల్సిన పోలీసులే తనను అడ్డుకోవటం ఏమిటి? అని ప్రశ్నించారు. మరోవైపు వేంపల్లిలో వైసీపీ నేత సతీష్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. ఒంటిమిటటలో 24,600 ఓట్లు ఉన్నాయి. మొత్తం పదకొండు మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ రెండు ఉప ఎన్నికల ఈ రోజు సాయంత్రం వరకు బ్యాలెట్ పద్దతిలో జరగనున్న విషయం

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి హాట్ కామెంట్స్

**(1వపేజీ తరువాయి)**రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు మాట ఇచ్చే టైంలో ఈ విషయం తెలియదా అని నిలదీశారు.'మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టే. నాకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా.. ఇప్పుడు కూడా చెప్తున్నా.. మీరు మాటిచ్చారు. ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటి వరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా నిధుల విడుదలను ఆపొద్దు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది.. సమీకరణాలు కుదరడం లేదు అంటున్నారు. సమీకరణాలు ఎందుకు కుదరటం లేదు?. ఎవరు అడ్డుకుంటున్నారు రాకుండా..? నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని' అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. 'పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండోసారి ప్రామిస్ చేసినప్పుడు మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని తెలియదా? ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉంది. 9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా?' అని రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు.'అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్నా. ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దు.. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి. భువనగిరి నుంచి ఎంపీగా పని చేశాను.. నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను.. నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది. ఆ భగవంతుడు ఏ పదవి ఇచ్చినా.. మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదు' అని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# లోక్‌సభలో కొత్త బిల్లు పాస్

**(1వపేజీ తరువాయి)**1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

**పన్నుల చట్టాల సవరణ బిల్లులో కీలక మార్పులు**

దీంతో పాటు ఆమోదం పొందిన పన్నుల చట్టాల (సవరణ) బిల్లు ద్వారా పలు సంస్కరణలు చేపట్టారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) చందాదారులకు కూడా న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) తరహాలోనే పన్ను మినహాయింపులు వర్తింపజేయనున్నారు. అలాగే, భారత్‌లో పెట్టుబడులు పెట్టే సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు ప్రత్యక్ష పన్నుల నుంచి ఉపశమనం కల్పించారు. ఆదాయపు పన్ను సోదాల కేసుల్లో బ్లాక్ అసెస్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలను కూడా ఈ బిల్లు ద్వారా క్రమబద్ధీకరించారు.

బిల్లుల ఆమోదం అనంతరం కూడా ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు, యువతలో అధికమవుతున్న మొబైల్ ఫోన్ల వాడకం, ఇంటర్నెట్‌లో అశ్లీల సమాచారం వంటి అంశాలపై చర్చల అనంతరం రాజ్యసభ కూడా వాయిదా పడింది.

# బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్

**(1వపేజీ తరువాయి)**కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలు ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోపాటు ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే కేంద్రమంత్రి పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లైంట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకూ ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపై అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసులో కేటీఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు.

# ఏపీలో సెమీకండక్టర్

**(1వపేజీ తరువాయి)** పెట్టనుండగా.. పంజాబ్‌లో సీడీఐఎల్, ఏపీలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ సంస్థ సెమీకండక్టర్ల యూనిట్ నెలకొల్పనుంది. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ దక్షిణ కొరియాకు చెందిన APACT Co. Ltdతో టెక్నాలజీ టైఅప్ కింద, ఆంధ్రప్రదేశ్‌లో 96 మిలియన్ యూనిట్ల వార్షిక సామర్థ్యంతో సెమీకండక్టర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులు మొబైల్ ఫోన్‌లు, సెట్-టాప్ బాక్స్‌లు, ఆటోమొబైల్ అప్లికేషన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులలో తయారీలో ఉపయోగపడతాయని కేంద్రం వెల్లడించింది.


సుమారుగా 4600 కోట్ల రూపాయల వ్యయంతో ఈ నాలుగు సెమీకండక్టర్ తయారీ యూనిట్లు నెలకొల్పనున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 2034 మంది స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అలాగే మరింత మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని కేంద్రం తెలిపింది. తాజాగా ఆమోదించిన నాలుగు ప్రతిపాదనలతో కలిపితే ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద ఇప్పటి వరకూ ఆరు రాష్ట్రాలలో రూ.1.60 లక్షల కోట్లతో పది సెమీకండక్టర్ తయారీ యూనిట్లకు ఆమోదం తెలిపినట్లు కేంద్రం వెల్లడించింది. దేశంలో టెలికం, ఆటోమోటివ్, డేటా సెంటర్లు, కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ రంగాలలో సెమీకండక్టర్లకు డిమాండ్ పెరుగుతోందన్న కేంద్రం.. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో తాజాగా ఆమోదించిన నాలుగు ప్రాజెక్టులు ఆ అవసరాలను తీర్చుతాయని తెలిపింది.

# రూ.6 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్

**మంచిర్యాల-నవభూమి:** మంచిర్యాల జిల్లాలో ఏసీబీకి మరో అవినీతి చేప చిక్కింది . ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం .. కోటపల్లి మండలం అంగరాజుపల్లి పీహెచ్‌సీలో ఇన్‌చార్జి జూనియర్ అసిస్టెంట్‌గా( విధులు నిర్వహిస్తున్న గడియారం శ్రీనివాస్ అనే వ్యక్తి అదే శాఖలో పని చేస్తున్న వ్యక్తి కి సంబంధించిన డీఏ నిధుల విడుదల గురించి రూ.6 వేలను లంచంగా డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.బాధితుడి పిర్యాదు మేరకు మంచిర్యాల పట్టణంలో బొమ్మరిల్లు హోటల్ వద్ద రూ.6 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న అధికారులు లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు లేదా వాట్సప్ నంబర్ 9440446106 సమాచారం అందించాలన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
బుధవారం
13 । ఆగస్టు । 2025

## స్టాలిన్‌పై మాజీసీఎం ధ్వజం.. మీ గురించి మాకు తెలియదా..





**చెన్నై-నవభూమి:** తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ గురించి తమకు బాగా తెలుసని అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి(ఎద్దేవా చేశారు. డీఎంకే పాలనలో అన్ని రంగాల్లో కుంటుపడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన రెండో విడత ప్రచారంలో భాగంగా సోమవారం కృష్ణగిరి జిల్లా వేపనహల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సాగింది.రాయకోట అన్నా విగ్రహం జంక్షన్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాజీ మంత్రులు బాలచంద్రారెడ్డి, కేపీ మునుస్వామితో కలసి రోడ్ షోలో పాల్గొన్న ఈపీఎస్ మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, మామిడి పండ్ల దిగుబడిలో కృష్ణగిరి జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉందని అయితే, అధిక దిగుబడుల కారణంగా నష్టపోయిన రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.అలాగే, రబ్బరు రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదని, ఈ రెండు డిమాండ్లతో ఇటీవల జిల్లాలో అన్నాడీఎంకే భారీస్థాయిలో ఆందోళన నిర్వహించినట్లు ఈపీఎస్ తెలిపారు. హోసూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.20 కోట్లతో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నిర్మించిన వేలం కేంద్రాన్ని డీఎంకే ప్రభుత్వం మూసివేసిందని, తాము వచ్చే ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రం ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఆసిమ్ మునీర్.. ఓ సూట్ ధరించిన ఒసామా బిన్ లాడెన్



**పెంటగాన్-నవభూమి:**పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌ను.. ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌తో పోల్చారు పెంటగాన్ మాజీ అధికారి మైఖేల్ రూబిన్. ఏఎన్ఐ వార్తా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. యుద్ధ కాంక్షతో ఉన్న పాకిస్థాన్ ఓ దుష్ట దేశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అమెరికాలో సెప్టెంబర్ లెవన్ దాడులకు కారణమైన అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ తరహాలో.. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు.%తాజాగా ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్.. అణ్వాయుధ బెదిరింపులకు పాల్పడ్డారు. ఒకవేళ పాకిస్థాన్ ఓడిపోయే దశలో ఉంటే. అప్పుడు తమతో పాటు సగం ప్రపంచాన్ని తీసుకెళ్తామని అణు హెచ్చరికలు చేశారు. ఫ్లోరిడాలోని థంపాలో జరిగిన అమెరికా మిలిటరీ అధికారుల భేటీలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ మాజీ అధికారి స్పందించారు. అమెరికా నేలపై పాకిస్థాన్ చేసిన బెదిరింపులు అమోదయోగ్యం కాదు అని రూబిన్ వెల్లడించారు.సమస్యాత్మక కోణంలో ఉగ్రవాదాన్ని అమెరికా చూస్తుందని, అనేక మంది ఉగ్రవాదుల ఐడియాలజీ అర్థం కాదు అని, సూట్ ధరించిన ఒసామా బిన్ లాడెన్ లాంటి వాడు ఆసిమ్ మునీర్ అని ఆయన అన్నారు. ఇస్లామిక్ స్టేట్ వ్యాఖ్యల తరహాలో ఫీల్డ్ మార్షల్ ప్రకటన ఉన్నట్లు రూబిన్ తెలిపారు. పాకిస్థాన్‌లో ఉన్న అణ్వాయుధ కేంద్రాలను అమెరికా సీల్ దళాలు స్వాధీనం చేసుకోవాలని ఆయన సూచించారు. పాకిస్థాన్‌ను నాన్-నాటో సభ్య దేశంగా చూడాలని, యూఎస్ సెంట్రల్ కమాండ్ సభ్యదేశంగా చూడవద్దు అని రూబిన్ అన్నారు. ఆసిమ్ మునీర్‌కు ఎప్పటికీ యూఎస్ వీసా ఇవ్వకూడదన్నారు.

## నేను మాటల మనిషిని కానే కాదు..



**చెన్నై-నవభూమి:** పదేళ్ల అన్నాడీఎంకే పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అథఃపాతాళానికి చేరిందని, గత నాలుగేళ్ల డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్ర ఆర్థిక ప్రగతి పురోగమించినట్లు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్( పేర్కొన్నారు. అయితే వాస్తవాలకు విరుద్ధంగా డీఎంకే పాలనలో అభివృద్ధి శూన్యమంటూ ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అసత్య ప్రచారం చేస్తున్నారని, ఆయనలా తాను మాటల మనిషిని కాదని, చేతల మనిషినని సీఎం పేర్కొన్నారు.తిరుప్పూరు జిల్లా ఉడుమలపేట నేతాజీ మైదానంలో సోమవారం జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో రూ. 1426.89 కోట్లతో పూర్తయిన పథకాలను సీఎం ప్రారంభించారు. 35 కొత్త పథకాలకు శంకుస్థాపన చేశారు.వివిధ సంక్షేమ పథకాల కింద 19,785 మంది లబ్ధిదారులకు రూ.295.29 కోట్ల విలువైన సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీల కంటే ముందుగా ఈపీఎస్ ఇక్కడి పడమటి జోన్ నుండి ప్రచార పర్యటనను ప్రారంభించారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ జోన్ నుండే అన్నాడీఎంకే ఓటమి ప్రారంభమవుతుందని తెలియకపోవడం శోచనీయమన్నారు.

2024 లోక్‌సభ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో అన్నాడీఎంకే చిత్తుగా ఓడిపోయిందని, వాస్తవాలు ఇలా ఉండగా తాను పడమటి జోన్‌కు చెందిన వ్యక్తినని, రైతుబిడ్డనని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రమంతటా ఉంగలుడన్ స్టాలిన్, నలమ్‌కాక్కుం స్టాలిన్ పథకాలకు లభిస్తున్న ప్రజా స్పందనను చూసి ఓర్వలేకే ఈపీఎస్ తనను ఏకవచనంతో విమర్శించే స్థాయికి దిగజారి పోయారన్నారు.

ఉంగలుడన్ స్టాలిన్ పథకంపై హైకోర్టులో పిటిషన్ వేసి అభాసుపాలై , కోర్టు రూ.10లక్షల జరిమానా విధించినా ఈపీఎస్ మళ్ళీ అదే పనిగా ప్రభుత్వ పథకాలపై పసలేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈపీఎస్ తనను ఎంజీఆర్‌లా, జయలలితలా ఊహించుకుని ప్రచారంలో ఆ నేతలలాగే హావభావాలను ప్రదర్శించి చూపరులకు ఏవగింపు కలిగిస్తున్నారని స్టాలిన్ విమర్శించారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పత్తా లేకుండా పోవటం తథ్యమని స్టాలిన్ పేర్కొన్నారు.

తిరుప్పూరుకు వరాల జల్లు..తిరుప్పూరు జిల్లాకు ముఖ్యమంత్రి స్టాలిన్ నాలుగు వరాలను ప్రకటించారు. కేరళ ప్రభుత్వంతో చర్చించి నీరారు - నల్లారు, ఆనైమలైయారు అనుసంధాన పథకాన్ని వీలైనంత త్వరగా అమలు చేస్తామన్నారు. పరంబికుళం ఆళియారు సాగు పథకం కాలువల్లో పూడిక తీత పనులకు రూ.10 కోట్ల మేరకు నిధులు కేటాయించనున్నామని తెలిపారు. తిరుచ్చి కార్పొరేషన్‌లో రూ.9కోట్లతో గ్రంథాలయం, అమరజ్యోతి గార్డెన్ ప్రాంతం వద్ద రూ.5 కోట్లతో క్రీడామైదానం నిర్మిస్తామని,కాంగేయం నగర పంచాయతీలో రూ.11కోట్లతో తాగునీటి పథకాలు అమలు చేస్తామని, నంజియంపాళయం వద్ద ఉప్పారుపై రూ.7.60 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మించనున్నామని, ఊత్తుకుళి యూనియన్ ప్రాంతంలో రూ.6.5 కోటతో వెన్న కర్మాగారం నెలకొల్పుతామని పేర్కొన్నారు. ఉడుమలపేటలోని తాజ్‌థియేటర్ సమీపంలో రహదారికి మాజీ మంత్రి సాదిక్‌బాషా పేరు పెట్టనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ముత్తుసామి, ఎంపీ సామినాథన్, చక్రపాణి, కయల్‌విళి సెల్వరాజ్, జిల్లా కలెక్టర్ మనీష్ నారాణవరే, మేయర్ దినేషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమలత సంచలన కామెంట్స్.. జయ నా రోల్ మోడల్



**చెన్నై-నవభూమి:** 'సినీ, రాజకీయ రంగాల్లో రికార్డులు సాధించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత తన రోల్ మోడల్' అని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత(పేర్కొన్నారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం సమీపంలో తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతు ప్రకటించిన ప్రేమలత, సోమవారం వారిని పరామర్శించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే మేనిఫెస్టోలో ఉన్న హామీల్లో జీసీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీ కూడా ఉందని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేనందువల్లే సుమారు 2 వేల మందికి పైగా కార్మికులు ఆందోళన చేస్తున్నారని, అయినా మేయర్ ప్రియ, కార్పొరేషన్ అధికారులు,

## కశ్మీరీ పండిట్ హత్య కేసులో కీలక పరిణామం..: 35 ఏళ్ల తర్వాత అక్కడ సోదాలు



**జమ్మూ కాశ్మీర్- నవభూమి:** జమ్మూ కాశ్మీర్‌లో 35 ఏళ్ల క్రితం జరిగిన ఒక దారుణమైన హత్య కేసులో ఇప్పుడు కొత్తగా దర్యాప్తు ప్రారంభమైంది. 1990లలో కశ్మీరీ పండిట్లపై జరిగిన దాడులలో భాగంగా హత్యకు గురైన నర్సు సార్లా భట్ కేసును తిరిగి విచారించేందుకు స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కశ్మీర్ కేంద్రంలోని ఎనిమిది ప్రదేశాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ చర్యలు జమ్మూ కాశ్మీర్‌లో మళ్లీ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.అసలేం జరిగిందంటే..?

1990లో కశ్మీర్ లోయలో ఉగ్రవాదం తలెత్తినప్పుడు.. వేలాది మంది కశ్మీరీ పండితులు తమ ఇళ్లను, ఆస్తులను వదిలి పారిపోవలసి వచ్చింది. ఆ సమయంలోనే శ్రీనగర్‌లోని సౌరాలో ఉన్న ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సార్లా భట్ తన హాస్టల్ నుంచి అదృశ్యం అయ్యారు. ఆ తర్వాత ఆమె మృతదేహం శ్రీనగర్‌లో లభ్యమైంది. అప్పటి నుంచి ఈ కేసు విచారణ ఆలస్యం అవుతూ వచ్చింది. సరైన న్యాయం జరగలేదని బాధితుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఇప్పుడు మూడున్నర దశాబ్దాల తర్వాత.. ఈ కేసులో తిరిగి దర్యాప్తు మొదలవడం వారికి కొత్త ఆశలను కల్పిస్తోంది.సార్లా భట్ హత్య కేసును ఇప్పుడు ఎస్ఐఏ పటిష్టంగా విచారిస్తోంది. హత్య జరిగినప్పుడు నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన జమ్మూ అండ్ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్‌తో సంబంధం ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ముఖ్యంగా జెకెఎల్ఎఫ్ చీఫ్, ప్రస్తుతం జైలులో ఉన్న వేర్పాటువాద నాయకుడు యాసిన్ మాలిక్ నివాసంలో కూడా సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో కేసును బలపరిచే కీలక ఆధారాలు లభించి ఉంటాయని ఎస్?ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే కేసులో జెకెఎల్ఎఫ్ మాజీ నాయకుడు పీర్ నూరుల్ హక్ షా ఇంటిపై కూడా దాడులు జరిగాయి.అసలెవరీ యాసిన్ మాలిక్..?

యాసిన్ మాలిక్ ప్రస్తుతం తీహార్ జైలులో టెర్రర్ ఫండింగ్ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. ఈ కేసు విచారణలో జాతీయ దర్యాప్తు సంస్థ (%చీ×ూ%) మాలిక్?కు మరణశిక్ష విధించాలని కోరింది. అయితే ట్రయల్ కోర్టు ఈ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. మాలిక్ నేరాలు భారతదేశం గుండెలపైనే దాడి చేసినప్పటికీ.. మరణశిక్ష విధించడానికి అవి సరిపోవని కోర్టు వ్యాఖ్యానించింది. కానీ ఇప్పుడు పాత కేసులో తిరిగి విచారణ మొదలు పెట్టడం, అందులోనూ యాసిన్ మాలిక్ పేరు మళ్లీ తెరపైకి రావడం రాజకీయంగా కూడా తీవ్ర చర్చకు

## ఓపిక నశిస్తే బ్రహ్మోస్ క్షిపణులు పాక్‌లోకి దూసుకెళ్తాయి

### 140 కోట్ల మందీ యుద్ధం చేస్తారు..: మిథున్ చక్రవర్తి



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ సింధూ నదీ జలాల ఒప్పందంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు భారతీయ సినీ నటుడు, బీజేపీ నాయకుడు మిథున్ చక్రవర్తి ఘాటుగా స్పందించారు. పాక్ తరచుగా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ఉంటే.. భారత్ ఓపిక నశిస్తుందని అన్నారు. ఈక్రమంలోనే బిలావల్‌కు సినిమా స్టైల్ హెచ్చరిక జారీ చేశారు. ఒకవేళ బిలావల్ భుట్టో తన బెదిరింపులను కొనసాగిస్తే.. భారత్ తన శక్తిని ప్రదర్శించడానికి ఏమాత్రం వెనుకాడదని, అప్పుడు బ్రహ్మోస్ క్షిపణులు రంగంలోకి దిగుతాయని వివరించారు. అంతేకాకుండా భారతదేశంలో ఉన్న 140 కోట్ల మందీ ప్రజలంతా యుద్ధం చేస్తారని వెల్లడించారు.భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో తమ దేశానికి పెద్ద నష్టం జరిగిందని బిలావల్ భుట్టో ఇటీవలే ఓ కార్యక్రమంలో వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ తీసుకున్న చర్యలు పాక్‌కు చాలా నష్టం కల్గించాయన్నారు. ముఖ్యంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేయడం అనేది పాకిస్థాన్ చరిత్ర, సంస్కృతి, నాగరికతపై దాడి అవుతుందని అన్నారు. అంతేకాకుండా యుద్ధం వంటి పరిస్థితులు వస్తే పాకిస్థాన్ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీని ఎదుర్కొనే శక్తి ఉందని ఆయన సవాలు విసిరారు. ఈ వ్యాఖ్యలు భారత్‌లోని రాజకీయ నాయకులతో పాటు ప్రజల్లో కూడా తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి.

ముఖ్యంగా బిలావల్ భుట్టో వ్యాఖ్యలపై మిథున్ చక్రవర్తి స్పందిస్తూనే.. ఘాటు సమాధాన చెప్పారు. "బిలావల్ భుట్టో.. మేము 140 కోట్ల మంది భారతీయులం. మేము ఒక ఆనకట్ట నిర్మించాలనుకుంటున్నాం. అది కూడా భారతీయులందరి మూత్ర విసర్జనతో. దాన్ని ఒక్కసారిగా తెరిచామంటే పాకిస్థాన్‌కు సునామీ వస్తుంది" అని అన్నారు. అలాగే నేను చేసిన ఈ వ్యాఖ్యలు.. పాకిస్థాన్ ప్రజలు అందరికీ కాదని.. కేవలం బిలావల్ భుట్టోకు మాత్రమే అని కూడా స్పష్టం చేశారు. ఇవేమీ పట్టించుకోకుండా యుద్ధానికి వస్తే.. మా ఓపిక నశించి బ్రహ్మోస్ క్షిపణులను మీ దేశంపైకి పంపుతామన్నారు. అయితే బిలావల్ భుట్టో ఈ కామెంట్లు చేయడానికి కొన్ని గంటల ముందే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అమెరికా వేదికగా షాకింగ్ కామెంట్లు చేశారు. పాకిస్థాన్‌కు ఏదైనా ముప్పు ఏర్పడితే.. అది సగం ప్రపంచాన్ని తనతో పాటు తీసుకుపోతుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ వద్ద అణుబాంబులు ఉన్నాయని గుర్తు చేశారు. వాటి ద్వారానే ఇతర దేశాలపై పగ తీర్చుకుంటామని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలను కూడా భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అణు బెదిరింపులు పాకిస్థాన్‌కు అలవాటేనిని సమాధానం ఇచ్చింది.

## జెండా కోడ్ సవరణల పుణ్యం.. బెంగేరిలో భారీగా పడిపోయిన జెండాల అమ్మకాలు..!



**న్యూఢిల్లీ-నవభూమి:**భారత త్రివర్ణ పతాకాన్ని తయారు చేసే ఏకైక అధీకృత కేంద్రం, సరఫరాదారు అయిన.. కర్ణాటక రాష్ట్రం బెంగేరిలోని 'కర్ణాటక ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘం జెండా అమ్మకాలలో తీవ్ర తగ్గుదలను ఎదుర్కొంటోంది. ఈ సంవత్సరం కేకేజీఎస్ఎస్ టర్నోవర్ రూ.49 లక్షలకు పడిపోయింది. ఎర్రకోటకు, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలకు బెంగేరి నుంచే జెండాలను సరఫరా చేసేవారు. అయితే 2022లో భారత జెండా కోడ్‌కు సవరణల తర్వాత ఈ జెండాల తయారీ కేంద్రం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లింది.1957 నవంబర్ 7న వెంకటేష్ మాగడి, శ్రీరంగ కామత్ వంటి గాంధేయ నాయకులు స్థాపించారు. కర్ణాటకవ్యాప్తంగా ఉన్న 58 ఖాదీ, గ్రామీణ పరిశ్రమ సంస్థలను ఏకం చేశారు. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ కేంద్రంలో కుట్టు యూనిట్లు, ఉత్పత్తి సౌకర్యాలు, ఒక టెక్స్‌టైల్ శిక్షణ కళాశాల ఉన్నాయి. ప్రతి జెండాను 60 కుట్టు యంత్రాలపై చేతితో తయారు చేస్తారు. కఠినమైన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి జెండాను 18 సార్లు పరీక్షిస్తారు.2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా జరిగిన 'హర్ ఘర్ తిరంగ' ప్రచారం తర్వాత సాంప్రదాయ ఖాదీ, పట్టు, ఉన్ని వెర్షన్లతోపాటు పాలిస్టర్ త్రివర్ణాలను అనుమతించడానికి కేంద్ర ప్రభుత్వం జెండా కోడ్‌ను సవరించింది. అప్పటి నుంచి బెంగేరిలో జెండాలు అమ్మకాలు తగ్గిపోయాయి. చౌక ధర, యంత్రాలతో తయారీ కారణంగా పాలిస్టర్ జెండాలు మార్కెట్‌లో వేగంగా ఆధిపత్యం చేశాయి. దాంతో బెంగేరిలో జెండాల అమ్మకాలు దారుణంగా పడిపోయాయి.కేకేజీఎస్ఎస్ కార్యదర్శి శివానంద్ మఠపతి మంగళవారం తెలంగాణ టుడేతో మాట్లాడుతూ.. బెంగేరిలో జెండాల అమ్మకాల పతనం గురించి వెల్లడించారు. జమ్ము అండ్ కశ్మీర్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ లాంటి ప్రధాన రాష్ట్రాల నుంచి ఆర్డర్లు తగ్గిపోవడంతో అమ్మకాలు పడిపోతున్నాయని చెప్పారు. గత సంవత్సరం అమ్మకాలతో పోల్చుకుంటే ఈ ఏడాది అమ్మకాలు 25 శాతానికి పడిపోయాయని కేకేజీఎస్ఎస్ కార్యదర్శి అన్నారు.2022%-%23లో రూ.4.28 కోట్ల అమ్మకాలు జరిగాయని, గత ఏడాది అంటే 2023-24లో అవి రూ.1.80 కోట్లకు తగ్గాయని చెప్పారు. ఇప్పుడు అమ్మకాలు ఇంకా తగ్గిపోయాయని, దాంతో ఇక్కడ పనిచేసే 2,000 మంది మహిళా కార్మికులకు సమయానికి వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని తెలిపారు. అమ్మకాలు లేకుండా తాము జీతాలు చెల్లించలేమని, ముడి పదార్థాలను కొనుగోలు చేయలేమని చెప్పారు. సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వం జెండా కోడ్ సవరణను వెనక్కి తీసుకోవాలని, ఖాదీ జెండాలను మళ్ళీ తప్పనిసరి చేయాలని మఠపతి కోరారు.గత రెండు సంవత్సరాలుగా అమ్ముడుపోని స్టాక్ పేరుకుపోతోందని జెండా తయారీదారు అన్నపూర్ణ దొడ్డమణి చెప్పారు. 'మేము గతంలో జూన్ నుంచి ఆగస్టు వరకు తొమ్మిది వేర్వేరు పరిమాణాల్లో జెండాలను తయారు చేయడానికి అదనపు గంటలు పని చేసేవాళ్ళం. ఇప్పుడు ఖాదీ జెండాలకు డిమాండ్ పోయింది. మా ఆదాయం కూడా అలాగే తగ్గిపోయింది' అని చెప్పారు.కాగా ఉపాధి కరువవడంతో చాలామంది జెండాల తయారీ కార్మికులు తక్కువ జీతానికి ఖాదీ సంచుల తయారీకి మారారు. ఖాదీ జెండాల ధరలు రూ.250 నుంచి రూ.30,150 మధ్య ఉన్నాయి. 21ఐ14 అడుగుల జెండాలు నరగుండ్ హిల్, సిమెంట్ ప్లాంట్లు వంటి ల్యాండ్‌మార్క్ ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తారు. 3ఐ2 అడుగుల జెండాలు అత్యంత ప్రజాదరణ పొందాయి.ప్రభుత్వం ఇప్పటికైనా జెండా కోడ్ సవరణను వెనక్కి తీసుకోకపోతే ఖాదీ జెండాల తయారీకి ప్రసిద్ధి చెందిన బెంగేరి యూనిట్ చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కళాకారులు అంటున్నారు.

## 40 ఏళ్ల వయసులో పెళ్లి.. పిల్లలు పుట్టకపోవడంతో..

## సభ్యసమాజం తలదించుకునే పని!




**:గుజరాత్-నవభూమి:** వారిద్దరిదీ లేట్ మ్యారేజ్. ఒక సంవత్సరం క్రితం 40 ఏళ్ల వయసులో వారిద్దరూ పెద్దల సమక్షంలోనే పెళ్లాడారు. ఆరు నెలలపాటు వారి కాపురం అన్యోన్యంగానే సాగింది. అయితే పెళ్లి జరిగి ఆరు నెలలు దాటినా కోడలు గర్భం దాల్చకపోవడం.. అందులోనూ వయసు కూడా ఎక్కువగా ఉండటంతో హాస్పిటల్‌కు వెళ్లమని అత్తగారు సూచించింది. దీంతో దంపతులు ఇద్దరూ ఆస్పత్రికి వెళ్లగా.. పరీక్షించిన వైద్యులు భర్తకు స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉందని, అందుకే పిల్లలు పుట్టడం లేదని తెలిపారు.ఐవీఎఫ్ చేయించుకుంటే ఫలితం ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో ఆ మహిళ ఐవీఎఫ్ చేయించుకుంది. అయినా లాభం లేకపోవడంతో.. ఎవరినైనా దత్తత తెచ్చుకుని పెంచుకుందామని అత్తింటి వారికి చెప్పింది. కానీ వారు అందుకు అంగీకరించలేదు. ముఖ్యంగా ఆమె మామ.. ఓరోజు కోడలు ఒంటరిగా నిద్రిస్తుండగా వెళ్లి ఆమెపై అత్యాచారం చేశాడు. విషయం ఎవరికీ చెప్పొద్దని.. తనతో పడక సుఖం పంచుకోవడం వల్ల పిల్లలు పుడతారని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో జరిగిన ఘోరాన్ని భర్తకు చెప్పిన ఆమె భోరుమంది.కానీ భర్త కూడా తండ్రినే సమర్థించాడు. ఎవరికైనా విషయం చెబితే.. నీ నగ్న ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించాడు. దీంతో ఆమె నోరు మెదపకపోవడంతో చాలా నెలల పాటు సొంత మామ.. ఆమెపై అత్యాచారం చేశాడు. అయినా సరే ఆమె గర్భం దాల్చకపోవడంతో.. ఆమె ఆడపడుచు భర్తను రంగంలోకి దింపారు.

వరుసకి అన్నయ్య అయ్యే అతడు కూడా ఏమాత్రం కనికరం లేకుండా వివాహితపై దారుణానికి ఒడిగట్టాడు. అతడు చాలా రోజుల పాటు ఆమెపై అత్యాచారం చేశాడు. ఫలితంగా జూన్ నెలలో ఆమె గర్భం దాల్చింది. అయితే ఆ తర్వాతి నెలలోనే గర్భస్రావం జరిగింది. సంతానం కోసం మళ్లీ ఈ దారుణాలను, అత్యాచారాలను ఎదుర్కోవాల్సి వస్తుందని భయపడిన ఆ వివాహిత.. తన అత్తింటి వారు చేస్తున్న అరాచకాలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే వారిని అరెస్ట్ చేసి విచారణ జరిపి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు.గుజరాత్‌లోని వడోదరలో వెలుగు చూసిన ఈ ఘటన స్థానికంగా సంచలనమైంది. పిల్లల కోసం మరీ ఇంతకు తెగిస్తారా? అని జనం ప్రశ్నిస్తున్నారు. కన్నతండ్రిలా చూసుకోవాల్సిన మామ, సోదరుడిలా అండగా ఉండాల్సిన ఆడపడుచు భర్త ఆమెపై రోజుల తరబడి అత్యాచార పర్వం కొనసాగించడం.. భర్త కూడా వారికి మద్దతు పలకడం నిజంగా సిగ్గుచేటు.

## ఓట్ల దోపిడీపై నోరుజారారు.. చివరకు మంత్రి పదవినే కోల్పోయారు, ఎవరంటే?




**బెంగళూరు-నవభూమి:**కర్ణాటక రాజకీయాల్లో మరో కొత్త వివాదం చెలరేగింది. ఓటర్ల జాబితాకు సంబంధించి ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఇబ్బందికరంగా మారాయి. ముఖ్యంగా నోరుజారి ఈ వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి కే.ఎన్. రాజన్నను.. మంత్రివర్గం నుంచి తొలగించారు. సోమవారం రోజు ఆయన్ను పదవి నుంచి తొలగించిన విషయాన్ని ధ్రువీకరిస్తూ.. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఓ ప్రకటన చేశారు. కాంగ్రెస్ అధిష్టానం జాతీయ స్థాయిలో నకిలీ ఓటర్ల విషయంపై ఆందోళన చేస్తుండగా.. ఈ ప్రక్రియను రాజన్న ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగానే ఓటర్ల జాబితాను తయారు చేసిందని.. దాన్ని బహిరంగ పరిచినా సర్కారు ఏ చేస్తుందని అడిగారు. ఈ కామెంట్ల వల్లే ఆయన పదవిని కోల్పోవాల్సి వచ్చింది.కర్ణాటక సహకార మంత్రిగా పని చేసిన రాజన్న.. ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగినట్లు పరోక్షంగా అంగీకరించారు. ఎన్నికల సమయంలో తమ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసే వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగానే ఓట్ల జాబితాను తయారు చేశారని.. సవరించిన ఈ జాబితాను బహిరంగ పరిచినా సర్కారు ఏ చేస్తోందని ప్రశ్నించారు. అక్కడితో ఆగకుండా అప్పుడు కళ్లు మూసుకుని ఇప్పుడు ఆందోళన చేయడంలో అర్థం లేదన్నారు. ఓట్ల దోపిడీ వల్లే నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని అయ్యారని అన్నారు. కాంగ్రెస్‌కు ఈ అక్రమాల గురించి తెలిసినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటుందని వ్యాఖ్యానించారు.అంతేకాకుడా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా కర్ణాటక ఎమ్మెల్యేలతో ఇటీవలే ప్రత్యేకంగా సమావేశం అయిన విషయాన్ని కూడా తప్పుబట్టారు. ఒక అధికార పార్టీ మంత్రి స్వయంగా ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు చెలరేగాయి. ముఖ్యంగా రాజన్న చేసిన ఈ వ్యాఖ్యలను ప్రతిపక్ష బీజేపీ ఒక ఆయుధంగా మార్చుకుంది. ఓటర్ల మోసం జరిగిందంటూ బీజేపీ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఇది కేవలం ఒక మంత్రి చేసిన వ్యాఖ్యలు కాదని, ప్రభుత్వ పెద్దలందరికీ తెలిసే ఇలాంటి పనులు జరుగుతున్నాయని బీజేపీ ఆరోపించింది.మరోవైపు రాజన్న వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ పార్టీలో కూడా తీవ్ర అసంతృప్తి నెలకొంది. మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేవిగా ఉన్నాయని, ముఖ్యంగా రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఇది పార్టీకి నష్టం చేకూరుస్తుందని పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే పార్టీకి మరింత నష్టం జరగకుండా ఉండేందుకు రాజన్నను మంత్రి పదవి నుంచి తప్పించారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఈ ఘటనతో కర్ణాటకలో ఓటర్ల జాబితా పారదర్శకతపై తీవ్రమైన చర్చ మొదలైంది. రాజకీ పార్టీలు తమ గెలుపు కోసం ఇలాంటి అనైతిక పద్ధతులను అనుసరిస్తున్నాయన్న ఆరోపణలు, ప్రజాస్వామ్య విలువలకు తీవ్రమైన సవాలు విసురుతున్నాయి.

## పూర్తి అధికారం పార్లమెంట్‌కే ఉంది.. ఈసీకి లేదు



**చెన్నై-నవభూమి:**కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిని అసెంబ్లీ స్పీకర్ అప్పావు తప్పుబట్టారు. పూర్తి అధికారం పార్లమెంట్‌కే ఉందని ఎన్నికల సంఘానికి లేదన్నారు. ఆయన తిరునెల్వేలిలో మీడియాతో మాట్లాడుతూ, ఒక వ్యక్తి ఆరోపణలు చేస్తే, అది అబద్ధమని నిరూపించకుండానే ఆ వ్యక్తిని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం తప్పన్నారు. ఇలాంటి చర్యలకు కేంద్ర ఎన్నికల సంఘం అండగా ఉండటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానంలో ఐఐటీ(వంటి పోటీ పరీక్షల్లో ఉన్నతశ్రేణి వర్గాలకు చెందిన విద్యార్థులు గురుకులాల్లో విద్యాభ్యాసం చేయడం వల్ల ఉన్నత చదువులకు వెళ్ళే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.14 వేల కోట్ల రుణాలను రద్దు చేశారన్నారు. పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.అదేసమయంలో త్రిభాషా విద్యా విధానానికి మన రాష్ట్రంలో చోటు లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానంలో ఒక విద్యార్థి 3, 5, 8 తరగతుల్లో ఉత్తీర్ణులైతేనే పై చదువులకు వెళ్ళే పరిస్థితి ఉంటుందని లేనిపక్షంలో కూలి పనులు వెళ్ళాల్సి ఉంటుందని స్పీకర్ అప్పావు అభిప్రాయపడ్డారు.

# కవయిత్రి,గాయకురాలు అనిశెట్టి రజిత కన్నుమూత



ఒక చేత్తో ఉద్యమ జెండా ఇంకో చేత్తో కవిత్వ పతాక " ఆవిడే అనిశెట్టి రజితగా ప్రసిద్ధి చెందిన వారు ఇక లేరు !

కవి, గాయకురాలు, ఉద్యమోపజీవి, ఉపన్యాసకురాలు, వ్యాస రచయిత్రి, నెచ్చెలి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఆవిర్భావ సభ్యురాలు, ప్రస్తుత జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత వరంగల్లులో ఆగస్టు 11 వతేదీ గుండెపోటుతో మరణించారు. ఆమె శరీరదానం చేసినందువల్ల తరువాత కాకతీయ వైద్య కళాశాలకి అప్పగిస్తారు అని ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక వారు ప్రకటించారు.రజితా అనిసెట్టి ఒక ప్రముఖ తెలంగాణ రచయిత్రి, స్త్రీవాద కార్యకర్త. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించారు. స్త్రీల విముక్తి మరియు సామాజిక సమానత్వం కోసం తన జీవిత మంతా కృషి చేసారు . 2017లో తెలంగాణ ప్రభుత్వం ఆమెకు విశిష్ట మహిళా పురస్కారం ప్రదానం చేసింది. హైస్కూల్ విద్యార్థిగా 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నది. ఇంటర్ విద్యార్థిగా ప్రగతిశీల మహిళా సంఘం పిలుపుకు ప్రతిస్పందించింది. సమకాలపు సామాజిక చలనాలకు కదిలిపోతూ కవిత్వమైంది. 1982 లో కాకతీయ అధ్యాపక బృందం విద్యార్థులు కలిసి ఏర్పాటు చేసిన స్త్రీజనాభ్యుదయ అధ్యయన సంస్థలో భాగస్వామి అయింది.ఆనాటి మహిళా ఉద్యమ అవసరాల నుండి రజిత జానపద గాయకురాలు అయింది. శబ్దలయను గురించిన స్పృహ ఆమె రచనలోనూ ధిక్కారం ఆమె గానంలోనూ స్వభావమై ఒదిగిపోయా యి. సారా వ్యతిరేక ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్య మం, పోలవరం ప్రాజెక్ట్ వ్యతిరేక ఉద్యమం, మల్లన్న సాగర్ వ్యతి ఒక ఉద్యమం, ముజఫర్ నగర్ మారణకాండ నిరసన ఉద్య మంలో పాల్గొన్నారు.

## సాహిత్య భావుకుని.. మేధో దీప్తిధార

తెలుగు సాహిత్యంలో మేధావితనం, నైతిక దృఢత్వం, ఆలోచనా స్వాతంత్ర్యం అనే మూడూ సమపాళ్లలో కలిసిన అరుదైన వ్యక్తిత్వం కోడూరి శ్రీరామమూర్తి. ఒకే వ్యక్తి సాహిత్య విమర్శకుడు, కథాకారుడు, నవలా రచయిత, బాలసాహిత్య సృష్టికర్త, పత్రికా రచయిత, పరిశోధకుడు, ఉపన్యాసకుడు, అంతేకాదు ఒక గాంధేయవాది, మానవతావాది. ఆయన రచనలు కేవలం వినోదానికి పరిమితమైనవి కాదు, అవి ఆలోచనల జ్యోతులు, సాంస్కృతిక అవగాహనకు కిరణాలు, సమాజాన్ని సరిదిద్దే నైతిక పాఠాలు.

**కుటుంబ నేపథ్యం – స్వాతంత్ర్యస్ఫూర్తి వారసత్వం**

1941 సెప్టెంబర్ 29న రాజమండ్రిలో జన్మించిన కోడూరి శ్రీరామమూర్తి కుటుంబం స్వాతంత్ర్యోద్యమంలో నిండి ఉన్న రక్తనాళాల్లా. ఆయన తాత దేవతా శ్రీరామమూర్తి, రాజమహేంద్రవరంలో బ్రిటీష్ పాలనకు సవాల్ విసిరి తన ఇంటిపై తొలిసారిగా జాతీయ పతాకాన్ని ఎగరేసిన వీరుడు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయనపై వేసిన అక్రమకేసులను స్వయంగా ఎదుర్కొని, "జెండా ఎగరేయడం నా హక్కు" అని కోర్టులో గెలిచిన సాహసి. ఆ పోరాట స్ఫూర్తి రాజమహేంద్రి గాలిలో రెపరెపలాడగా, ఆయనను 'జెండా ప్లీడరు'గా ప్రజలు గౌరవించారు. ఈ దేశభక్తి వారసత్వమే చిన్న కోడూరి మనసులో గాఢమైన ప్రభావం చూపింది.

తండ్రి పుల్లేశ్వరరావు, తల్లి లీలావతిదేవి. తల్లి బాలసాహిత్యంలో ప్రతిభ కనబరిచిన రచయిత్రి. ఆమె ప్రభావంతో కోడూరి చిన్న వయసులోనే 'నేనూ నా చెల్లెలు' అనే రచన చేశాడు. చదువులోనూ, ఆలోచనలోనూ ఆయన బాల్యం నుంచే గాంధేయవాదం పట్ల ఆకర్షితుడయ్యాడు.

**రచనా వ్యాసంగం ఆరంభం..**కేవలం 19 ఏళ్ల వయసులోనే రవీంద్రనాథ్ ఠాగూర్ శతజయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 14 భాషల్లో జరిగిన రచన పోటీలో మొదటి బహుమతి సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. అక్కడినుంచి ఆయన సాహిత్యయాత్ర ఆగకుండా కొనసాగింది.

'ఉదయరేఖ' అనే సాహిత్య పత్రికను స్వయంగా నడిపి, అనేక విలువైన రచనలు, అనువాదాలను అందించారు. అమెరికన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ప్రోత్సాహంతో పాశ్చాత్య మేధావుల ఆలోచనలను తెలుగులోకి తీసుకువచ్చి, వాటిని తెలుగు పాఠకలోకానికి పరిచయం చేశారు. బెర్ట్రాండ్ రస్సెల్, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ రస్కిన్, జాన్ స్టువర్ట్ మిల్ వంటి ప్రపంచ మేధావుల గురించి తెలుగులో తొలిసారిగా విలువైన వ్యాసాలు రాసి కొత్త మేధో దిశ చూపారు.

విద్యావేత్తగా మరియు రచయితగా..ముప్పై ఏళ్లకు పైగా బొబ్బిలి కళాశాలలో ఆర్థికశాస్త్రం బోధించారు. బోధనలోనూ, రచనలోనూ ఆయన పద్ధతి ఒకటే విషయం లోతుగా అర్థం చేసుకోవడం, దానిని నిష్పాక్షికంగా సమీక్షించడం. 'భారతి' పత్రికలో ఆయన వ్యాసాలు తరచుగా ముద్రణకెక్కడం, సాహిత్య సమీక్షల్లో ఆయనకు వచ్చిన గౌరవానికి చిహ్నం.

'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ' అనే ఆయన రచన నేటికీ ఆ అంశంపై ఉన్న ఏకైక ఉద్గ్రంథం. 'నీటిలో నీడలు' అనే నవల వాషింగ్టన్ కాంగ్రెస్ లైబ్రరీలో చోటు దక్కించుకోవడం తెలుగు సాహిత్యానికి గర్వకారణం. 'వెలుగు వెన్నెల', 'తెలుగు కథ నాడు–నేడు', 'మా మంచి తెలుగు కథ', 'రాగమాలిక', 'తెర తీయగరాదా', 'బాలసాహిత్యంలో రవికవి', 'మహనీయుల జీవితంలో కథ కాని కథలు' వంటి అనేక విలువైన రచనలు ఆయన సృష్టి.

**గాంధేయవాదం జీవిత సిద్ధాంతం**

కోడూరి గాంధేయవాదం కేవలం సిద్ధాంతపరమైనది కాదు, ఆచరణలోనూ ఆయన దానికి కట్టుబడి ఉన్నారు. మహాత్మాగాంధీ జీవితాన్ని ఆయన విభిన్న కోణాల్లో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. గాంధీని కేవలం స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా సత్యాన్వేషి, పర్యావరణవేత్త, పాత్రికేయుడు, దార్శనికుడు, రాజకీయవేత్తగా కూడా ఆవిష్కరించారు.ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'గాంధీజీ కథావళి' రాసి, ఒక సుప్రసిద్ధ దినపత్రికలో 'నేటికీ గాంధేయ మార్గం ఎందుకు అవసరమో' అనే వ్యాస పరంపర రాసి, యువతను గాంధేయ సిద్ధాంతాలపై ఆలోచింపజేశారు. మొత్తం పదిహేను పుస్తకాలు గాంధీపై రాయడం ఆయన అంకితభావానికి నిదర్శనం.

**విశ్లేషణా శైలి –ఆలోచనా వైశాల్యం**

కోడూరి రచనల్లో హేతుచింతన, శాస్త్రీయ దృష్టి, సమాజపట్ల బాధ్యత ఈ మూడు సమపాళ్లలో కనిపిస్తాయి. వ్యక్తిగత నమ్మకాలకు అతీతంగా, ఆధారాలు, పరిశోధన ఆధారంగా ఆయన సమీక్షలు, వ్యాసాలు రాశారు. గాంధీజీ ప్రతిపాదించిన నూతన విద్యావిధానం, పౌర చైతన్యం, సామాజిక న్యాయం, సహకారోద్యమం వంటి అంశాలను యువత లోతుగా అధ్యయనం చేయాలని ఆయన కోరేవారు.

**చివరి దశ – ఆత్మకథ అముద్రిత పరిశోధన**


తన 80 ఏళ్ల వయసులో 'తెగిన జ్ఞాపకాలు' పేరిట ఆత్మకథ ప్రారంభించి, తన తరం అనుభవాలను, జ్ఞాపకాలను భవిష్యత్ తరానికి అందించాలనే సంకల్పంతో రచన కొనసాగించారు. కానీ 2025 ఆగస్టు 5న ఆయన పరమపదించారు. ఆయన అముద్రిత పరిశోధన 'స్వాతంత్ర్యానంతర యుగంలో వచన సాహిత్యం : సంప్రదాయం, ప్రయోగం' వెంటనే వెలువడవలసిన అవసరం ఉంది.కోడూరి మరణం కేవలం ఒక రచయితను మాత్రమే కోల్పోవడం కాదు, అది తెలుగు సాహిత్యం ఒక మేధో దీప్తిని కోల్పోవడమే. ఆయన సాహిత్య విశ్లేషణలు, గాంధేయ ఆలోచనలు, మానవతా దృక్పథం ఇవన్నీ సమాజానికి మేలుచేసే వెలుగులు. రాజకీయ విప్లవాల పట్లా, భావోద్యమాల పట్లా ఆయన చూపిన స్నేహపూర్వక దృష్టి, విభిన్న సిద్ధాంతాలను అర్థం చేసుకుని వాటి సారాన్ని స్వీకరించగల దృష్టి ఇవి నేటి సాహిత్యరంగంలో అరుదైన లక్షణాలు.

కోడూరి శ్రీరామమూర్తి వారసత్వం మనకు మూడు ముఖ్యమైన పాఠాలు అందిస్తుంది –

ఆయన జీవితం సాహిత్య భావుకతకు, మేధో దీప్తికి ప్రతీక. గాంధేయవాదానికి, మానవతావాదానికి, సత్యాన్వేషణకు ఒక శాశ్వత స్ఫూర్తిగా ఆయన నిలిచిపోతారు.

### బాల కార్మికుడి నుండి 110 డిగ్రీలు పొంది గిన్నిస్ రికార్డు సాధించిన

# ప్రొఫెసర్ సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ పిజే సుధాకర్



*బాల కార్మికుడిగా పశువుల కాపరిగా జీవితం ప్రారంభం మంచి నాటక కళాకారుడు 2012 లో భారత రాష్ట్రపతికి పోటీ*



కొందరికి కొన్ని రంగాల్లో ఆసక్తి ఉంటుంది అయినా రాణించలేరు. కానీ కొంతమంది మాత్రం పట్టుదలతో ముందుకు వెళ్లి తాము అనుకున్న లక్ష్యం కన్నా మరిన్ని లక్ష్యాలను సాధిస్తారు. అలాంటి వారే చరిత్ర సృష్టిస్తారు. ఒక్క డిగ్రీ అతి కష్ట మీద పాస్ అవుతున్న అణగారిన దళిత కుటుంబంలో పుట్టిన డాక్టర్ పి జే సుధాకర్ బాల కార్మికుడిగా పశువుల కాపరిగా జీవితాన్ని ప్రారంభించి ఏకంగా, 110 డిగ్రీలు పొంది ప్రపంచ స్థాయి ఖ్యాతి గడించారు . చదువుతోపాటు సామాజిక ఉన్న మంచి మనసు ఉన్న మనిషి ఆయన, పేద విద్యార్థులను చేరదీసి ఎందరికో మార్గదర్శక నిలిచారు . చదువులతోపాటు మంచి నాటక కళాకారుడు కూడా అనేక నాటకాలు రకరకాల పాత్రలు పోషించారు.

పట్నాల జె సుధాకర్, 1. డిసెంబర్ 1957, నూట పది డిగ్రీలకు పైగా పొంది ప్రపంచ రికార్డు సృష్టించారు. మహారాష్ట్రకు చెందిన నాగ్‌పూర్‌కు చెందిన శ్రీకాంత్ జిచ్కర్ 25 డిగ్రీలు మరియు కర్ణాటకకు చెందిన యజ్ఞేశ్వరన్ 32 డిగ్రీలు కలిగి ఉన్నారు. వారి తర్వాత ఇన్ని డిగ్రీలను కలిగి ఉన్న ఏకైక ఉన్న వ్యక్తి సుధాకర్ ప్రొఫెసర్ డాక్టర్ పి జే సుధాకర్ ప్రజా సంబంధాలు, సామాజిక సేవ, నేర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చట్టం, రాజకీయ శాస్త్రం, చరిత్ర, అంతర్జాతీయ సంబంధాలు మరియు అనేక ఇతర రంగాలలో 110 కంటే ఎక్కువ డిగ్రీలను సాధించి ప్రపంచ రికార్డులను కలిగి ఉన్నారు. డాక్టర్, ఇంజనీరింగ్ మినహా దాదాపు అన్ని విద్యా రంగాలలో ఆయన డిగ్రీలు సాధించారు. ఆయన ఆగస్టు 31, 2014న బెంగళూరులోని నేషనల్ స్కూల్ ఆఫ్ లా నుండి 104వ డిగ్రీ స్నాతకోత్సవాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి నుండి పొందారు.

ఆయన దాదాపు 10 పుస్తకాలు రాశారు మరియు ఆయన సాధించిన విజయాలకు 25 అవార్డులు అందుకున్నారు. బాల కార్మికుడి నుండి ప్రభుత్వ ఉద్యోగిగా మారిన డాక్టర్ సుధాకర్ కార్మికుడిగా న్యాయవాదిగా, జర్నలిస్ట్‌గా, శాస్త్రవేత్తగా, హైదరాబాద్‌లోని ఆల్ ఇండియా రేడియో మరియు దూరదర్శన్ డైరెక్టర్‌గా, ప్రొఫెసర్‌గా, మానవ హక్కుల కార్యకర్తగా మరియు అనేక ఇతర రంగాలలో పనిచేశారు. డాక్టర్ సుధాకర్ వివిధ అంశాలపై సమాజంలో అవగాహనను పెంపొందిస్తున్నారు. ఆయన జాతీయ మానసిక ఆరోగ్య ఉద్యమ వ్యవస్థాపక అధ్యక్షుడు. ఇది 100 మంది మనస్తత్వవేత్తల బృందంగా పనిచేస్తోంది, వారు వేలాది మంది ఎయిడ్స్ రోగులకు కౌన్సెలింగ్ అందిస్తూ, జీవితంలో ఆశను సృష్టిస్తున్నారు, సమాజంలో నైతిక విలువలు మరియు నైతిక ప్రమాణాలను ప్రోత్సహిస్తున్నారు. డాక్టర్ సుధాకర్ బహుముఖ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి.

**తొలినాళ్ళ జీవితం.**ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం పెదగాడి గ్రామంలో వ్యవసాయ దళిత కూలీలైన మోషేసు మరియు కాంతమ్మ దంపతులకు జన్మించిన సుధాకర్, ఉన్నత పాఠశాల తర్వాత తీవ్ర పేదరికం కారణంగా చదువును ఆపాల్సి వచ్చింది. సుధాకర్ తన జీవితాన్ని నిలబెట్టుకోవడానికి నెలవారీ జీతం కోసం గేదెలను మేపడం ప్రారంభించాడు, అంతేకాకుండా వ్యవసాయ పనులకు కూడా హాజరయ్యాడు. అయితే, 20 సంవత్సరాల వయస్సులో, సుధాకర్ సి బి ఐ లో జూనియర్ అసిస్టెంట్‌గా చేరాడు. అప్పటి నుండి, కరస్పాండెన్స్ కోర్సులు మరియు ఓపెన్ విశ్వవిద్యాలయాల ద్వారా సంవత్సరానికి పది డిగ్రీలు పొందాడు. 1980లలో, అతను న్యాయశాస్త్రంలో మొదటి డిగ్రీని పొందాడు. ఇప్పటి వరకు సుధాకర్ నూట పది డిగ్రీలకు పైగా పొందారు. జూన్ 2014 నాటికి, అతను ఇగ్నో నుండి ఎంఏ ఆంత్రోపాలజీ మరియు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి మానవ హక్కులలో పిహెచ్‌డి సాధించారు.సుధాకర్ 2012లో భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేశారు.

సుధాకర్‌కు బోధన, పరిపాలన మాస్ మీడియాలో 35 సంవత్సరాల అనుభవం ఉంది. ఆయన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ – సిబిఐ , డీసీఐ , ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పి ఐ బి , ఆల్ ఇండియా రేడియో , దూరదర్శన్ , పబ్లికేషన్స్ డివిజన్ మరియు రక్షణ మంత్రిత్వ శాఖ వంటి అనేక సంస్థలలో పనిచేశారు. ఆయన 1987లో సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణులై ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ ఐ ఐ ఎస్ లో చేరారు. సుధాకర్ భోపాల్‌లో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పి ఐ బి అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేసారు . ఆయన 2012 జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ అధికారిక జీవిత చరిత్ర రచయిత చరిత్రకారుడు . మీడియా, వార్తల రచన, చిత్తడి నేలల రక్షణ, ఆర్టీఐ , మైనారిటీల హక్కులు, వికలాంగుల సాధికారత, మేధో సంపత్తి హక్కులు సామాజిక సమస్యలపై ఆయన వర్క్‌షాప్‌లకు నాయకత్వం వహించారు. వ్యక్తిత్వ వికాస తరగతులు, ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాల యువతను ప్రేరేపించడం నిర్వహించారు.

ఆయన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సలహాదారు, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ – గ్లోబల్ ఫోరం ఫర్ పబ్లిక్ రిలేషన్స్ స్థాపక అధ్యక్షుడు – నేషనల్ పబ్లిక్ రిలేషన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా. ఆయన అనేక భారతీయ విశ్వవిద్యాలయాలలో విజిటింగ్ లేదా గెస్ట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

డాక్టర్ రావూరి భరద్వాజ రచనలు, కవితలు, నవలలు మరియు జీవితంపై సుధాకర్ పరిశోధన చేశారు. ఆయన జీవితంపై స్మృతి సాహిత్యం లూ ఈ శతాబ్ది గొప్ప రచయిత డాక్టర్ రావూరి భరద్వాజ అనే పుస్తకాన్ని 2 మే 2013న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. అతను రావూరి భరద్వాజ అనే మరో రెండు పుస్తకాలు – సాహిత్య జీవన సమరం పేరుతో మరియు హిందీలో ఒక పుస్తకాన్ని కూడా రాశాడు. సుధాకర్ 1999 జూలై ఎడిషన్‌లో యోజనలో రావూరి భరద్వాజ గురించి ఒక వ్యాసం ప్రచురించారు, ఆయన హైదరాబాద్‌లోని యోజన సంపాదకుడిగా పనిచేసారు.

**2014లో ఉద్యోగ విరమణ చేశారు..** ఉద్యోగ విరమణ తర్వాత చాలావరకు సభలు సమావేశాల్లో అనేక సందర్భాల్లో పాల్గొన్నారు. కరోనా సమయంలో చివరి దశలో విశాఖపట్నంలో సోదరు ని వద్ద నివాసం ఉంటున్నారు. ప్రొఫెసర్ డాక్టర్ పి జే సుధాకర్ కు భార్య ఒక కూతురు ఉన్నారు. కూతురు బ్రిటన్ లో సెటిల్ అయ్యారు. అనారోగ్యం కారణంతో 6 ఆగస్టు 2025 న విశాఖపట్నంలో తుది శ్వాస వదిలారు. ప్రపంచవ్యాప్తంగా 110 డిగ్రీలు పొందిన నిరంతర విద్యార్థి పీజే సుధాకర్ ఒక్కరిగా మిగిలిపోయారు.

**అస శ్రీరాములు**
**సీనియర్ జర్నలిస్ట్**
**94400 37196**

# ఒక జీవితాన్ని నిలబెట్టే వారధి అవయవ మార్పిడి



అవయవ మార్పిడి అనేది కేవలం ఒక వైద్య ప్రక్రియ మాత్రమే కాదు, అదొక రెండో జీవితాన్ని ప్రసాదించే అద్భుత మైన అవకాశం. ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతూ చివరి దశకు చేరుకున్న వారికి ఇది ఒక కొత్త ఆశను, జీవించాలనే స్ఫూర్తిని ఇస్తుంది. అయితే, భారతదేశంలో ఈ మహత్తర వైద్య రంగం పురోగమిస్తున్నప్పటికీ, అవయవ దానం విషయంలో మన దేశం ఇంకా వెనుకబడి ఉంది. అవసరం, లభ్యత మధ్య ఉన్న అంతరం ఎందరో నిస్సహాయుల ప్రాణాలను నిశ్శబ్దంగా హరిస్తోంది. 2024 గణాంకాల ప్రకారం భారతదేశంలో దాదాపు 18,900 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. ఇది ప్రపంచంలోనే మూడో అత్యధిక సంఖ్య. ఈ అద్భుతమైన వృద్ధికి వైద్య నిపుణులకు, దాతలకు కృతజ్ఞతలు చెప్పాలి. కానీ ఈ విజయాల వెనుక దాగి ఉన్న కఠిన వాస్తవం ఏమిటంటే అవయవం కోసం వేచి చూస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంది. కిడ్నీ కోసం 63 వేలకు పైగా, కాలేయం కోసం 22 వేలకు పైగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ నిరీక్షణలో ప్రతి పది నిమిషాలకు ఒకరు చనిపోతున్నారు. ఈ భయంకరమైన అంతరం మన సమాజంలో అవయవ దానంపై ఇంకా ఉన్న అపోహలకు, అవగాహన లోపానికి అద్దం పడుతోంది.

సంఖ్యల వెనుక దాగి ఉన్న మానవీయ కథనం

ప్రతి గణాంకం వెనుక ఒక కుటుంబం యొక్క కన్నీళు ,, ఆశలు దాగి ఉన్నాయి. ఒక నడి వయసు తండ్రి, తన కూతురిని పెళ్లి చేసి చూడాలని కలలు కంటూ కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నాడు. అతనికి ప్రతి రోజు ఒక పరీక్షే. ఆసుపత్రిలోని తన గదిలో కూర్చొని, తన పేరు ఎప్పుడు పిలుస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్న అతని కథ మనకు తెలియనిది కాదు. అవే కాకుండా, ఈ విషయంలో దేశవ్యాప్తంగా ప్రాంతీయ అసమానతలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అవయవ మార్పిడి కార్యక్రమాలు ఎక్కువగా దక్షిణ రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. ఇది ఇతర రాష్ట్రాల వారికి అన్యాయం చేస్తోంది.

అవయవ దానంపై అపోహలు – సవాళ్లు:

భారతదేశంలో అవయవ దానం రేటు తక్కువగా ఉండటానికి అనేక కారణాలు ఉన్నాయి. చాలా మందికి ' బ్రెయిన్ డెడ్ ' గురించి సరైన అవగాహన లేదు. మనిషి మెదడు పని చేయడం మానేసినప్పుడు, గుండె కొట్టుకుంటున్నా అది తిరిగి సాధారణ స్థితికి రాలేదని ఆ సమయంలోనే అవయవాలను దానం చేయవచ్చని చాలామందికి తెలియదు. ఇది మతపరమైన, సాంస్కృతిక నమ్మకాలతో కూడిన ఒక సున్నితమైన అంశం. దీనికి తోడు అవయవ దానం వల్ల శరీరం వికృతంగా మారుతుందనే భయం కూడా ఉంది. కానీ, ఆధునిక వైద్యశాస్త్రంలో శస్త్రచికిత్స తర్వాత శరీరాన్ని సాధారణ స్థితిలో ఉంచుతారు.

అవయవ దాన ప్రక్రియను సులభతరం చేయకపోవడం కూడా ఒక ప్రధాన సవాలు. దానం చేయాలనుకునే వారు రిజిస్టర్ చేసుకోవడానికి సరైన మార్గదర్శకత్వం లేదు. దీనికి తోడు, దానం చేసిన అవయవాలను సకాలంలో అవసరం ఉన్న వారికి చేర్చడంలో ఉన్న రవాణా సమస్యలు కూడా కీలకమైనవి. ఇటీవల హైదరాబాద్‌లో మెట్రో రైలు ద్వారా సకాలంలో అవయవాలను తరలించడం లాంటి ఘటనలు దేశానికి ఒక నమూనాగా నిలుస్తున్నాయి. ఇలాంటి ప్రయత్నాలను దేశవ్యాప్తంగా విస్తరించాలి.

**ఆర్థిక భారాలు, నైతిక సమస్యలు:**

అవయవ మార్పిడి తర్వాత కూడా సవాళ్లు ముగిసిపోవు. చికిత్స తీసుకున్న వ్యక్తి జీవితాంతం రోగనిరోధక శక్తిని తగ్గించే మందులు వాడాల్సి ఉంటుంది. ఈ మందుల ఖరీదు చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది పేద, మధ్య తరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతుంది. ఆర్థికంగా బలంగా లేని వారు ఈ మందులను కొనలేక తిరిగి అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం, వైద్య సంస్థలు ముందుకు వచ్చి ఈ మందుల ధరలను తగ్గించేందుకు కృషి చేయాలి.

**భవిష్యత్తుపై ఆశల వెలుగు:**

ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, అవయవ మార్పిడి రంగం భవిష్యత్తుపై ఆశలు కల్పిస్తోంది. కృత్రిమ అవయవాల తయారీ, స్టెమ్ సెల్ థెరపీ, జన్యు సవరణ వంటి ఆధునిక సాంకేతికతలు ఈ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. అయినా, ఈ సాంకేతిక అద్భుతాలు అందుబాటులోకి వచ్చే లోపు, మనం ఇప్పుడే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలి. అవయవ దానంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, అపోహలను తొలగించడం, దాన ప్రక్రియను సరళతరం చేయడం, అలాగే మార్పిడి తర్వాత రోగులకు ఆర్థిక సహాయం అందించడం వంటి చర్యలు తీసుకోవాలి. అవయవ మార్పిడి అనేది మానవత్వానికి, దయకు నిలువుటద్దం లాంటిది. దానం చేసిన వారికి తెలియకపోయినా వారి దానం ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది. మన సమాజంలో ప్రతి ఒక్కరూ అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకొని, ముందుకు వస్తే, అవయవాల కోసం వేచి చూస్తున్న ఏ ప్రాణమూ గాలిలో కలిసిపోదు. ఇది కేవలం ప్రభుత్వాలు చేయాల్సిన పని కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

**కవిత్వమంతటి కవి..శివారెడ్డి.!!**

# అతనే కవిత్వం..కవిత్వమే అతను



"ఏది నన్ను వెంటాడుతుందో
నేను దేన్ని వెంటాడుతున్నానో
అది ఒక కొలిక్కి వచ్చేదాకయినా
బతకవలయు " !!

శివారెడ్డి జీవితమే కవిత్వం..
కవిత్వమే జీవితం..... !
కవిత్వం శివారెడ్డిని వెంటాడుతోంది.

శివారెడ్డి కూడా కవిత్వాన్ని వెంటాడుతున్నాడు .ఈ 'వేట ' ఓ కొలిక్కి వచ్చేదాకా ఇలాగే...కొనసాగుతూనే వుంటుంది.ఇది నిరంతర వేట...విశ్రాంతి లేని అన్వేషణ.!

శివారెడ్డి కన్నీటి చుక్కల మధ్య....
ఇంద్ర ధనుస్సుల్ని సృష్టించాడు.
శివారెడ్డి స్వతహాగా కవి గనుక
ఆయనఆపని చేయగలిగాడు.

ఊపిరి తీసుకోని కాలపు కంటకాల మధ్యన కరుగుతూ ,కదులుతూ కవిత్వంగా మారాడు.నడిచే కవిత్వ మయ్యాడు.

తన కవిత్వానికి తన కవిత్వమే"ముందు మాటగా,"చివరి మాటగా "భావించడం ఆయనకే చెల్లింది .ఓ మనిషి ఎలా విస్తరించాలో శివారెడ్డినిచూసి నేర్చుకోవాలి.

"చాపే కావాలని ఏం లేదు
ఇంత జాగా దొరికినా పడుకుంటాను
లేదు, పద్మాసనం వేసైనా కూచుంటాను
అక్కడి నుంచి మొదలవుతుంది
విస్తరించడం "
అతను చరిత్ర,' సంచారి 'కవిత .!

సాహిత్యంలో 'ఇంతై వటుడింతై' అన్నట్లు ఈ శివన్న ఎదిగిన తీరు అందరికీ ఆదర్శం కావాలి.

ఎంత ఎదిగినా ఇంకా ఎలా ఒదిగుండాలో తెలిపినవినయశీలుడుశివారెడ్డి

ం"మిమ్మల్ని లొంగదీయటం చాలా కష్టం.
ప్రతీ దానికీ కొత్త కొత్త నిర్వచనాలిస్తూ కొత్త కొత్త భాష్యాలుచెబుతూ సాగిపోతున్న
మిమ్మల్ని ఎవరు అందుకో గలరు
తెలుగు కవిత్వంలోఆయనో... జీవనది!!

శివారెడ్డి తెలుగు కవిత్వంలో ఓ జీవనది లాంటి వాడు.ఎన్ని 'పాయల్ని' పట్టుకొని, తనలో ఇముడ్చుకున్నాడో లెక్కేలేదు . ఓ వ్యక్తి 50ఏళ్లకు పైబడి కవిత్వంగా జీవిస్తున్నాడంటే చిన్న విషయం కాదు.

శివారెడ్డి జీవితమే కవిత్వం,
ఆయనశ్వాస కవిత్వం..
ఆయన భాష కవిత్వం.
ఆయన మాటలు కవిత్వం,...
ఆయన తెల్లబడ్డ జులపాలు కవిత్వం.
అంతెందుకు..?
ఆయన కూర్చుంటే కవిత్వం...
లేస్తే. కవిత్వం.
ఆయన నడక కవిత్వం
ఆయన నడత కవిత్వం

ఒళ్ళంతా కవిత్వాన్ని పులుముకున్న ఈ కవికి"సరస్వతీ సమ్మాన్ " ఏమంత పెద్ద విషయంకాక పోవచ్చు కానీ,ఈ అవార్డు పొందిన "తొలి తెలుగు కవి " కాబట్టి సాటి కవులు ఇంతకంటే సంతోషించదగిన విష యం ఇంకేముంటుంది?అయితే...మన తెలుగు కవి లోకానికి బాకీ వున్నజ్ఞానపీఠ్ పురస్కారాన్ని శివారెడ్డి ద్వారా ఆశించడం అత్యాశ కాదనుకుంటాను.!

కవులకు ప్రేరణ !!

*" ముడి ఇనుము నల్లని రేయిని*
*ఎర్రగా కాల్చి*
*సాగ్గొట్టి ఆయుధం చేస్తున్న*
*అరణ్యమూ కవిత్వమే*
*చేతులన్నీ ఒక్కసారి లేచి*
*ఇంక్విలాబ్ అంటే%ా*
*ఆకాశమూ కవిత్వమే !!"*

శివారెడ్డి కూడా ముడి కవుల్ని కాల్చి సాగ్గొట్టి మంచి కవిత్వం రాసేలా చేశారు. ఇంకా చేస్తూనే వున్నారు.ఆయన కవి పక్షపాతి.' ఓ పక్క కోటి రూపాయలు, ఇంకోపక్క కవిత్వాన్ని పెట్టి మీకేం కావాలో తీసుకోండి ' అంటే ఆయన వెనుకా ముందూచూడకుండా కవిత్వాన్నే.... తీసుకుంటారు.కవిగా ఆయన కమిట్మెంట్ అది.

కవిగా ఆయనేం చేస్తున్నారు?

"గోడలకు నోరిస్తున్నాడు.చెట్లకు కళ్ళిస్తున్నా డు.గాలికి గొంతిస్తున్నాడు. ప్రజలకు చేతులిస్తున్నాడు.

ప్రజల చేతుల్లో అనంత శక్తి సంపన్నమైన పద్యాన్ని పెడుతున్నాడు.జనాన్ని చైతన్యవం తుల్ని చేస్తున్నా డు.మనిషిని మనిషిగా జీవించడాని అమృతం లాంటికవిత్వాన్ని ఇస్తున్నాడు.ఓ కవి ఇంతకన్నా ఇంకేం చేయ గలడు?నీరసిస్తున్న జాతికి వెనుచరుపు ఆయన కవిత్వం

. "నడవడం తడవడం
తడిసి బరువెక్కడం
నాకు కొత్త గాదు
అడుగడుక్కీ ఆనందం
వేసే ప్రతీ అడుగూ ఓ సంబరం "!!

శివారెడ్డి కవిత్వమే కాదు.!ఆయన జీవితం కూడా సంబరమే.ఆయన ఆకాశాన్ని చుంబించాడు.భూమి నుంచి ఆకాశం దాకాగంతులు వేసి వాన చినుకుల్ని ముట్టుకున్నాడు.ఒక్కొక్క అడుగూ ముందుకే. వేసే ప్రతీ అడుక్కీ కొంత బరువు పెరగుతాడు.అయినా ముందుకే నడుస్తాడు. తెలుగు సాహిత్యంలో ఆయన నిరంతర బాటసారి.

కవిత్వమంటే..?

కవిత్వం పట్ల శివారెడ్డికి ఓ స్పష్టమైన అవగాహన వుంది.కవిత్వం అంటే మరేదో కాదు..కవిత్వమంటే... జీవితం.కవిత్వమం టే తాను నివసించే ప్రాంతం.కవిత్వమంటే అస్తిత్వం.కవిత్వమంటే అనుభవాలు.

కవిత్వమంటే ప్రజల సమస్యలు,ఉద్యమా లు అంటారు శివారెడ్డి.

లికొత్త తరం కవుల గురించి ఏమంటారు?

"ఈ తరం కవులు బాగా నే రాస్తున్నారు. అయితే విస్తృత అధ్యయనం అవసరం.బాగా చదవాలి.నేటి కవిత్వం నుంచి మొదలెట్టి ప్రాచీన సాహిత్యాన్ని కూడాఔపోసన పట్టాలి.కవికి అనుభవం ఎంత అవసరమో, లోకజ్ఞానం కూడా అంతే...అవసరం. ఓసారి కవిత్వం రాయడం మొదలెడితే జీవితాంతం రాస్తూనే వుండాలి."అంటారు శివారెడ్డి .

ఈకాలపు కవి శివారెడ్డి ఫక్తు ఈ కాలపు కవి.వయసు మీదపడుతున్నా ఆయన కవిత్వానికి పదును తగ్గలేదువర్ధమాన కవులకుఆయనిచ్చే సలహాలు బి కాంప్లెక్స్ టానిక్ లాంటివి. ఉత్సాహాన్ని నింపుతాయి ఉత్ప్రేరకంగా పనిచేస్తాయి.

"నేటి తరం కవులు రాసే కవిత్వాన్ని చదవక పోతే నేను వెనకబడిపోతాను ,"అంటూ...

యువకవుల కవిత్వాన్ని అక్కున చేర్చుకునే సహృదయత ఆయన సొంతం.ఎవరైనా యువకవి వెళ్ళి తన కవితా సంకలనానికి 'ముందుమాట రాసివ్వండి సార్ ' అనిఅడిగి తే.."దానికేం నాయనా ! ఇచ్చెళ్ళు.రాసి పెడతా !" అనే తత్వం ఆయనది.

శివారెడ్డి నేటి కాలపు కవి.నిరంతర చలన జ్వలన కవిత్వ స్వరం అతడు.

**–రజాహుస్సేన్**
**ప్రముఖ సాహితీ విమర్శకులు**



## సమోసా.. భుజియా.. ఆ స్నాక్స్ గురించి బుమ్రా ఏమన్నాడంటే..



**న్యూఢిల్లీ-నవ భూమి:** సమోసా.. భుజియా.. ఈ స్నాక్స్ గురించి తెలియని ఇండియన్స్ ఉండరు. చిన్ననాటి నుంచే ఆ వంటకాలకు ప్రతి ఒక్కరూ అలవాటు పడి ఉంటారు. టీమిండియా బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా ఆ స్నాక్స్ గురించి మాట్లాడారు. స్పోర్ట్‌బైబిల్స్ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన చిన్నతనం నుంచి ఎటువంటి స్నాక్స్ తిన్నాడో చెప్పాడు. భారత్, బ్రిటన్‌కు చెందిన స్నాక్స్‌పై చేసిన వీడియోను ఆ ఛానల్‌లో పోస్టు చేశారు. ఇండియాలో పాపులరైన సమోసా, భుజియా స్నాక్స్‌ను అమితంగా ఇష్టపడుతానని బుమ్రా చెప్పాడు. స్నాక్ వార్స్ అన్న సెగ్మెంట్‌లో ఆ వీడియో సాగింది. బ్రిటన్, ఇండియన్ స్నాక్స్‌ను బుమ్రా ఆ వీడియోలో విశ్లేషించాడు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అయ్యింది. బ్రిటన్‌కు చెందిన స్నాంపీ ఫ్రైస్, ఇండియాకు చెందిన భుజియాను అతను పోల్చాడు.

స్నాంపీ ఫ్రైస్ తిన్న అతను బాగున్నాయని చెప్పాడు. ఇక ఇండియన్ స్నాక్ భుజియా చిన్నప్పటి నుంచి తింటున్నట్లు చెప్పాడు. సోదరి, తాను చిన్ననాటి నుంచి ఆ స్నాక్స్ ప్రిఫర్ చేసినట్లు చెప్పాడు.సమోసా.. ఆనియన్ పఫ్ గురించి కూడా బుమ్రా కామెంట్ చేశాడు. కానీ సమోసాను ఇష్టపడుతున్నట్లు చెప్పాడు. వాల్‌నట్ పచ్చడి.. పకోడీల గురించి కూడా బుమ్రా పోల్చాడు. ఫిష్ అండ్ చిప్స్, చికెన్ బిర్యానీ, ట్విగ్లెట్స్, చక్లి గురించి కూడా బుమ్రా ఆ వీడియోలో మాట్లాడాడు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
బుధవారం
13 ၊ ఆగస్టు ၊ 2025


## ధర్మస్థలిలో మృతదేహాల వెలికితీత.. డ్రోన్ ఆధారిత జీపీఆర్ టెక్నాలజీతో గుర్తింపు




**ధర్మస్థలి-నవభూమి:** దక్షిణ కన్నడ లోని ధర్మస్థలి) సమీపంలో సామూహికంగా వందల సంఖ్యలో అమ్మాయిల మృతదేహాలను పాతిపెట్టినట్లు ఓ మాజీ శానిటేషన్ వర్కర్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడ గత కొన్ని ర్జోల నుంచి తొవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా నేత్రావతి నది పరివాహక ప్రాంతంలో ఖనన ప్రదేశాలను వెలికితీస్తున్నారు. పాయింట్ నెంబర్ 13 వద్ద ఇవాళ గాలింపు చేపట్టారు. అయితే మృతదేహాలను గుర్తించేందుకు డ్రోన్ ఆధారిత జీపీఆర్ టెక్నాలజీ వాడుతున్నారు. గ్రౌండ్ పెనట్రేటింగ్ రేడార్‌తో బొందపెట్టిన కళేబరాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారీ భద్రత మధ్య అక్కడ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఈ ఆపరేషన్ చేపడుతోంది.ఇప్పటికే ఈ కేసులో పలు ప్రదేశాలను తొవ్వారు. అయితే తొలిసారి జీపీఆర్ టెక్నాలజీతో ఆ ప్రాంతాన్ని సెర్చ్ చేస్తున్నారు. సంప్రదాయ జీపీఆర్ డివైస్‌లకు బదులుగా.. కొత్తగా వచ్చిన అత్యాధునిక సిస్టమ్‌ను వాడుతున్నారు. డ్రోన్ కింద యాంటీనా ఈ పరికరాలకు ఉంటుంది. గ్రౌండ్‌కు సమీపంగా ఆ డ్రోన్ వెళ్తుంది. భూమిలోకి సిగ్నల్ పంపిస్తుంది. అయితే సెన్సార్ల ద్వారా వస్తున్న డేటాను రికార్డు చేస్తారు. రేడార్లు ఇచ్చిన ఇన్ఫర్మేషన్‌తో 2డీ, 3డీ ఇమేజింగ్ చేస్తారు. నదీ ప్రాంతంలో భూమిలోపల ఉన్న ఎటువంటి వస్తువునైనా ఈ టెక్నాలజీతో గుర్తిస్తారు. పాయింట్ 13 ఇప్పుడు ఈ కేసులో కీలక ప్రదేశంగా మారింది. ఇక్కడ ఉన్న నేలతో పాటు సమీప ప్రాంతాలను కూడా జీపీఆర్ టెక్నాలజీతో గాలింపు చేపట్టనున్నారు. సిట్ అధికారులతో పాటు రెవన్యూ, పంచాయతీ సిబ్బంది ఈ ప్రాంతాన్ని క్లీన్ చేస్తున్నారు. సామూహిక ఖననం జరిగిన ప్రదేశం గురించి ఏదైనా సమాచారం దొరుకుతుందని భావిస్తున్నారు. సైట్ వద్ద సుమారు 50 మంది పోలీసుల్ని మోహరించారు. జీపీఆర్ డ్రోన్లతో చేపడుతున్న తనిఖీల వల్ల రాబోయే రోజుల్లో ఏదైనా కీలక సమాచారం వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.ధర్మస్థలి ప్రాంతంలో 1995 నుంచి 2014 మధ్య.. వందల సంఖ్యలో అమ్మాయిలు, మహిళలను రేప్ చేసి హత్య చేశారని, వారిని సామూహికంగా పాతిపెట్టనట్లు ఓ శానిటేషన్ వర్కర్ జూన్ 3వ తేదీన ఫిర్యాదు చేశాడు. ధర్మస్థల ఆలయ బోర్డులో ఆ శానిటేషన్ వర్కర్ జీతం తీసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయి. అనేక మంది అమ్మాయిల మిస్సింగ్ కేసులు అక్కడ రిపోర్టు అయ్యాయి. ఈ నేపథ్యంలో శానిటేషన్ వర్కర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నేత్రావతి నదీ తీరం వెంట సామూహిక ఖనన ప్రదేశాల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## లోక్‌సభను రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి : తృణమూల్ ఎంపీ అభిషేక్ బెనర్జీ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ఓట్ల చోరీ వ్యవహారం దుమారం రేపుతోంది. ఓట్ల చోరీ దుమారం వేళ.. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.'గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సరిగ్గానే ఉందని.. పశ్చిమ బెంగాల్, బీహార్, తమిళనాడులో మాత్రమే తప్పుగా ఉన్నాయని ఈసీ చెబుతోంది. ఈసీ అలా ఎలా చెబుతుంది..? తప్పుడు ఓటర్ల జాబితాను ఉపయోగించే బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల జాబితా నిర్వహిస్తే అది దేశవ్యాప్తంగా జరగాలి. అంతకంటే ముందు లోక్‌సభను రద్దు చేయాలి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆయన మంత్రివర్గం రాజీనామా చేయాలి. నేను కూడా రాజీనామా చేసేందుకు సిద్ధమే. తృణమూల్‌తో పాటు ప్రతిపక్ష ఎంపీలందరూ అందుకు సిద్ధమే. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి' అని అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు.బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కొద్ది రోజులుగా సంచలన ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై నిన్న విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఢిల్లీలో ర్యాలీ చేపట్టిన విషయం తెలిసిందే. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ, ఓట్ చౌర్యానికి వ్యతిరేకంగా పార్లమెంట్ హౌస్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు సోమవారం ప్రతిపక్ష ఎంపీలు నిరసన ర్యాలీ చేపట్టారు.ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ప్రతిపక్ష ఎంపీలు వెళ్లకుండా మధ్యలోనే పీటీఐ భవనం వెలుపల బారికేడ్లు వేసి అడ్డుకోవడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి ఎంపీలు నిరసన తెలిపారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు బారికేడ్లు ఎక్కి ఎన్నికల కమిషన్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రోడ్డు పక్కన వరసగా నిలిపి ఉంచిన బస్సులలో ఎంపీలను బలవంతంగా ఎక్కించిన పోలీసులు వారిని పార్లమెంట్ వీధి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తర్వాత ఎంపీలు అందరినీ పోలీసులు విడిచిపెట్టారు.

## జమ్మూకశ్మీర్‌లో 1508 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో ర్యాలీ..



**దోడా-నవభూమి:** జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సుమారు 1508 మీటర్ల పొడువైన జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. ఆ భారీ త్రివర్ణ పతాకంతో .. విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. తిరంగా ర్యాలీలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దోడా జిల్లా డిప్యూటీ కమిషనర్ హర్విందర్ సింగ్ నేతృత్వంలో మెగా తిరంగా ర్యాలీ జరిగింది. జాతీయ జెండాను ప్రదర్శించిన విద్యార్థులు తమ దేశభక్తిని చాటుకున్నారు.వెల్కమ్ దోడా ఎంట్రీ గేటు నుంచి కమ్యూనిటీ హాల్ వరకు ఈ తిరంగా ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు తమ స్ఫూర్తిని, ఐకమత్యాన్ని చాటారు. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు కూడా ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. దేశభక్తికి చెందిన గీతాలు పాడారు, నినాదాలు చేశారు. జిల్లాలోని ఇతర పట్టణాల్లో కూడా ర్యాలీ చేపట్టారు.

# ఎన్నికల్లో ఘోర తప్పిదాలు జరుగుతున్నాయా?





**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ.. గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రక్రియపై చేస్తున్న ఆరోపణలు దేశంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్నికల సంఘం (ఈసీ), రాహుల్ గాంధీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. భారతీయ జనతా పార్టీతో (బీజేపీ) కుమ్మక్కై.. ఈసీ ఓటు దొంగతనాలకు పాల్పడుతోందంటూ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డూప్లికేట్ ఓట్లు సృష్టిస్తోందని, కర్ణాటకలోని ఓ లోక్‌సభ నియోజకవర్గంలో లక్షకు పైగా తప్పుడు ఓట్లను సృష్టించారని ఆరోపణలు చేశారు. ఎలక్షన్ కమిషన్ కూడా అంతే ఘాటుగా స్పందిస్తోంది. ఆరోపణలను అఫిడవిట్ రూపంలో సమర్పించి సంతకం చేయాలని లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కౌంటర్ ఇచ్చింది. తాజాగా హర్యానా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు సైతం సంతకం చేసిన అఫిడవిట్ సమర్పించాలని, ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సామాన్యమైనవి కావు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరునే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు ఏమిటి? ఎన్నికల సంఘం వాదనలేంటి? దీని వల్ల భారత ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి నెలకొన్న భయాందోళనలేంటి? అనే విషయాలను ఇప్పుడు చూద్దాం..రాహుల్ గాంధీ ఆగస్టు 7న ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎన్నికల సంఘం గురించి దాదాపు గంట పాటు ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఇందులో 2024 లోక్‌సభ ఎన్నికలను విశ్లేషించారు. అనంతరం ఓట్లు దోపిడీకి గురవుతున్నాయని ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు:పెద్ద మొత్తంలో ఓట్ల తారుమారు: కర్ణాటకలోని మహదేవపుర లోక్ సభ నియోజకవర్గంలో లక్షకు పైగా (1,00,250 పైగా) ఓట్లను తారుమారు చేశారని రాహుల్ ఆరోపించారు. డూప్లికేట్ ఓటర్లను చేర్చడం, తప్పుడు చిరునామాలు (ఇంటి నెంబర్లు 0 అని ఉండటం), ఒకే చిరునామాపై అనేక ఓటర్ రిజిస్ట్రేషన్లు ఉండటం, తప్పుడు ఫొటోలు ఉపయోగించడం, కొత్త ఓటర్ల కోసం ఉన్న ఫామ్ 6ను దుర్వినియోగం చేయడం.70 ఏళ్ల శకున్ రాణి అనే మహిళ.. ఫామ్ 6ను ఉపయోగించుకుని ఫస్ట్‌టైమ్ ఓటర్‌గా కొన్ని నెలల వ్యవధిలో రెండుసార్లు రిజిస్ట్రేషన్ చేయించుకుందని రాహుల్ ఉదహరించారు. ఓటర్ లిస్ట్‌లో ఆమె పేరు రెండు సార్లు ఉందన్నారు. ఆమె రెండు సార్లు ఓటేశారా లేదా ఆమె బదులు వేరే వాళు ఓటేశారా అని ప్రశ్నించారు. దీన్ని కవర్ చేయడానికి పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ ఫుటేజీ కూడా ఈసీ చూపించడం లేదని ఆరోపించారు.

తప్పుడు సమాచారం:ఓటర్ లిస్ట్‌లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులను ఫస్ట్‌టైమ్ ఓటర్లుగా వర్గీకరించారని, మరి కొంత మంది వాణిజ్య ప్రాంతాల అడ్రస్ పెట్టి ఓటు రిజిస్టర్ చేసుకున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. మరికొందరి ఓట్లు వివిధ రాష్ట్రాల్లో ఉన్నాయని, జాబితాలో ఫొటోలు అస్పష్టంగా ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ ఉద్దేశపూర్వకంగా, క్రమబద్ధంగా ఓటర్ల జాబితాలను తారుమారు చేశారనడానికి రుజువులని రాహుల్ పేర్కొన్నారు.కుట్ర:ఎన్నికలను తారుమారు చేయడానికి.. ఎలక్షన్ కమిషన్ (%జుజ%) బీజేపీతో కుమ్మక్కైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటు దొంగతనానికి పాల్పడ్డారన్నారు. ప్రజలు, పార్టీలు ధృవీకరించేలా.. ఈసీ డిజిటల్ ఓటరు జాబితాలను.. విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే పారదర్శకత పెరుగుతుందన్నారు.

'ఓటర్ చోరీ' వెబ్‌సైట్:ఆరోపణలు చేసిన తర్వాత.. ప్రజల మద్దకు కూడగట్టడానికి 'ఓటర్ చోరీ' వెబ్‌సైట్‌ను ప్రారంభించారు రాహుల్ గాంధీ. పారదర్శకత, ఈ విషయంలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా.. ఓటర్ రోల్స్ కేవలం పీడీఎఫ్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉంచారని... డిజిటల్ ఫార్మాట్‌లో లేవన్నారు. ఇలా మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఉంటే.. కచ్చితమైన ఆడిట్‌లను చేయొచ్చని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నేతలు వాదిస్తున్నారు.ఎన్నికల సంఘం వాదనలు..

రాహుల్ గాంధీ ఆరోపణల తర్వాత ఎన్నికల సంఘం గట్టిగానే స్పందించింది. ఆ ఆరోపణలు బేస్‌లెస్ అని ఖండించింది. పాత రాజకీయ వ్యూహంగా కొట్టిపారేసింది. 2018లో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్ నాథ్.. ఇలాగే చేసిన వాదనలను సుప్రీం కోర్టు తోసిపుచ్చిన ఘటనను గుర్తుచేసింది. ఇప్పుడు రాహుల్ గాంధీ కూడా అలాంటి టాక్టిక్‌ను అనుసరిస్తున్నారని.. చట్టబద్ధంగా గెలవలేమనే ఇలా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెబుతోంది.రాహుల్ గాంధీ ఎత్తిచూపిన తప్పులను నెలల క్రితమే సరిచేశామని.. కానీ రాహుల్ మాత్రం చట్టబద్ధంగా కాకుండా ఇలా బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారని చెప్పింది. అనంతరం కర్ణాటక సీఈఓతో పాటు మరో రాష్ట్ర సీఈఓ కూడా రాహుల్ గాంధీకి నోటీసులు జారీ చేశారు. ఆయన చేసిన ఆరోపణలకు డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించాలని (రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలెక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం) డిమాండ్ చేసింది. సంతకం చేసిన అఫిడవిట్ అయినా సమర్పించాలని లేదా దేశానికి క్షమాపణ చెప్పాలంది.రాహుల్ గాంధీ ఉదహరించిన ఓటర్ శకున్ రాణి.. ఒకటేసారి ఓటు వేశారని ఈసీ స్పష్టం చేసింది. రాహుల్ చూపించిన ఆధారం సరైనదికాదని చెప్పింది. రాహుల్ గాంధీ గుర్తించిన తప్పులు చాలా క్రితమే సరిచేశామని ఎలక్షన్ కమిషన్ స్పష్టం చేసింది. మరోవైపు.. రాహుల్ గాంధీ గుర్తించిన తప్పులకు ఆధారాలు చూపించాలని, సంతకం చేసిన అఫిడవిట్ ఇవ్వాలని కర్ణాటక సీఈవో అడిగినా.. దీనిపై ఆయన స్పందించలేదు. తాజాగా హర్యానా, మహారాష్ట్ర సీఈవోలు కూడా ఇదే అడిగారు.ఈసీ చర్యలు.. ప్రజాస్వామ్య మెడపై కత్తి!

రాహుల్ గాంధీ.. ఎన్నికల సంఘంపై చేసినవి కేవలం రాజకీయ విమర్శలు కాదు. అవి భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది లాంటి.. రాజ్యాంగ బద్ధమైన సంస్థ ఎన్నికలను ఎలాంటి పక్షపాతం లేకుండా నిర్వహించాల్సి ఉంటుంది. అలాంటిది దాని వైఖరిపైనే.. లోక్‌సభ ప్రతిపక్ష నేత ఇలాంటి ఆరోపణలను చేయడం గంభీరమైన విషయం. ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని ఆరోపించడం ఆందోళనకరమైన విషయం.ఇలాంటి ఆరోపణలు.. దేశ ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై కొత్త సందేహాలను లేవనెత్తుతాయి. అది ఎన్నికల విశ్వసనీయతపై అనుమానానికి దారితీస్తుంది. ఇలాంటి రాజ్యాంగ సంస్థలపై విశ్వాసం సన్నగిల్లుతే.. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది. అయితే ఆరోపణల సంగతి ఎలా ఉన్నా.. ఇలాంటి సంస్థలు తమ గౌరవాన్ని నిలబెట్టుకోవడం కోసం పారదర్శకంగా వ్యవహరించడం ఎంతైనా అవసరం.

గతంలో జరిగిందే.. మళ్లీ రిపీట్!

ఎలక్షన్ కమిషన్‌పై రాజకీయ నాయకులు విమర్శలు చేయడం ఇదే తొలిసారి కాదు. ఈసీ నిర్ణయాలను, పనితీరుపై ఆరోపణలు గతంలో చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సరిగా అమలు చేయకపోవడం, ఓటర్ల జాబితాపై అనుమానాలు, ఈవీఎమ్‌ల కచ్చితత్వంపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. అప్పట్లో బీజేపీ అగ్రనేత ఎక్ కే అద్వానీ సైతం.. ఈసీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ కూడా పలు సందర్భాల్లో ఈసీ చర్యలను వ్యతిరేకించింది. దీన్నే రాహుల్ గాంధీ ఇప్పుడు అనుసరించారు. గతంలో చేసినట్లే ఈసీపై ఆరోపణలు చేశారు. అయితే, ఈసారి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లడానికి.. ఎన్నికల్లో పెద్ద మొత్తంలో ఓట్లను దొంగతనం చేయడానికి లింక్ ఉన్నట్లు రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. అదే ఎన్నికల ఫలితాలను మార్చేసిందని అంటున్నారు. అయితే దీనిపై స్పష్టత లేదు. ఇది అధికార పక్షంపై బురద చల్లే ప్రక్రియగా బీజేపీ కొట్టిపారేస్తోంది. అంతేకాకుండా వారు ఓడిపోయినప్పుడు మాత్రమే వారికి ఇలాంటి ప్రశ్నలు వస్తాయని విమర్శిస్తోంది.

## జాతీయ జెండా ఎగరేసే క్రమంలో.. చేయాల్సిన..చేయకూడని పనులు ఇవే



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్య్రం పొందినప్పటి నుండి ఏటా ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసేటప్పుడు ఫ్లాగ్ కోడ్ ప్రకారం కొన్ని నియమాలను కచ్చితంగా పాటించాలి. ఇంతకు ముందు ఉన్న నిబంధనల ప్రకారం.. జెండాను సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకే ఎగురవేయాలి. కానీ ఫ్లాగ్ కోడ్ సవరణల తర్వాత రాత్రిపూట వెలుతురు ఉంటే ఎగురవేయవచ్చు. జెండాను గౌరవంగా చూసుకోవాలి, దానిని అవమానించే పనులేవీ చేయకూడదు.దాదాపు 200 ఏళ్ల బ్రిటిషర్ల వలస పాలనకు చరమ గీతం పాడుతూ.. 1947 ఆగస్టు 15న భారత్ స్వతంత్ర దేశంగా అవతరించింది. ప్రజాస్వామ్య, సార్వభౌమాధికార దేశంగా భారత్ తన ప్రయాణాన్ని సగర్వంగా కొనసాగిస్తోంది. దీంతో ఏటా ఆగస్టు 15వ తేదీన భారతీయులంతా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటారు. ఈ సందర్భంగా త్రివర్ణ పతకాన్ని ఎగరేయడంతోపాటు.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి.. స్వాతంత్య్ర సమర యోధుల పోరాటాలను స్మరించుకుంటాం. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మాత్రమే కాకుండా ఇళ్లు, వాణిజ్య స్థలాల్లోనూ త్రివర్ణ పతకాన్ని ఎగరేసి జాతీయ గీతాన్ని ఆలపిస్తాం.అయితే త్రివర్ణ పతకాన్ని ఎగరేసే సమయంలో కొన్ని నిబంధనలు పాటించడం తప్పనిసరి. జెండా ఎగరేసే క్రమంలో ఫ్లాగ్ కోడ్‌లో సూచించిన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సూర్యోదయం తర్వాత జాతీయ పతాకాన్ని ఎగరేసి.. సూర్యాస్తమయం వేళ కిందకు దించాలి. 2022లో ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియాకు సవరణలు చేశారు. దీని ప్రకారం రాత్రుళ్లు కూడా వెలుతురు ఉన్నట్లయితే జాతీయ జెండా ఎగరొచ్చు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను జెండా కర్ర కింది నుంచి పైకి తాడు సాయంతో లాగి ఎగరేస్తారు. 1947 వలస పాలనకు ముగింపు పలికినందుకు గుర్తుగా ఇలా చేస్తారు.

**చేయాల్సిన పనులు:**

- జాతీయ పతాకాన్ని వేగంగా ఎగరేసి.. మెల్లగా, గౌరవప్రదంగా కిందకు దింపాలి.
- జాతీయ పతాకాన్ని నిలువుగా ఎగరేసినప్పుడు.. కాషాయ రంగు పట్టీ కచ్చితంగా పై భాగంలో ఉండాలి.
- జాతీయ పతాకాన్ని ఎల్లప్పుడూ ప్రముఖమైన స్థానంలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఇతర జెండాలు లేదా వస్తువులేవీ జాతీయ పతాకాన్ని కప్పి ఉంచేలా ఉండొద్దు.
- జాతీయ పతకాన్ని అడ్డంగా ప్రదర్శించినప్పుడు.. కాషాయ రంగు పట్టీ పై భాగంలో ఉండాలి. నిలువుగా ప్రదర్శించినప్పుడు ప్రేక్షకులకు ఎదురుగా కనిపించేలా కాషాయ పట్టీ ఎడమ వైపున ఉండాలి.
- జాతీయ పతాకం ఎల్లప్పుడూ శుభ్రంగా, దెబ్బతినకుండా, చినిగిపోకుండా, రంగు చెదిరిపోకుండా ఉండాలి.
- ఫ్లాగ్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా చేతితో, మెషీన్‌తో తయారు చేసిన కాటన్, పాలిస్టర్, వూల్ లేదా సిల్క్ ఖాదీ బంటింగ్‌తో జాతీయ జెండాను తయారు చేయాలి.
- జాతీయ జెండాను ఆదివారాలు, సెలవు దినాలు సహా అన్ని రోజుల్లోనూ ఎగరేయొచ్చు. సామాన్యులతోపాటు ప్రయివేట్ సంస్థలు, విద్యా సంస్థలు.. ఇలా ఎవరైనా సరే సవరించిన 2022 ఫ్లాగ్ కోడ్ నిబంధనలను పాటిస్తూ జాతీయ జెండా ఎగరేయొచ్చు.
- జాతీయ పతాకాన్ని రాత్రుళ్లు కూడా ఎగరేయొచ్చు. అయితే త్రివర్ణ పతకం బాగా వెలుతురులో ఉండి, స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.
- త్రివర్ణ పతాకం ఏ సైజ్‌లోనైనా ఉండొచ్చు. కానీ దాని పొడవు, వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉండేలా చూడాలి.
- కార్యక్రమాల సమయంలో జాతీయ పతాకాన్ని విగ్రహంపై లేదా స్మారక చిహ్నంపై కప్పడానికి ఉపయోగించొచ్చు. అయితే జెండా ఎట్టి పరిస్థితుల్లోనూ నేలను లేదా ఫ్లోర్‌ను తాగొద్దు.
- దెబ్బతిన్న లేదా మురికిగా మారిన జెండాను గోప్యంగా డిస్పోజ్ చేయాలి. జాతీయ జెండా గౌరవానికి భంగం కలగని రీతిలో గోప్యంగా దహనం చేయడం కానీ పారేయడం కానీ చేయాలి.

**చేయకూడని పనులు:**


- జాతీయ పతాకాన్ని దాని గౌరవాన్ని దెబ్బతీసేలా ఉపయోగించకూడదు. ఉదాహరణ: ఏ వ్యక్తికి లేదా వస్తువుకు వందనం తెలిపే ఉద్దేశంతో జాతీయ పతాకాన్ని వంచి ప్రదర్శించకూడదు.
- త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా (కాషాయ రంగు పట్టీ కింది భాగంలో ఉండేలా) ఎగరేయొద్దు.
- జాతీయ పతాకం నేలను, ఫ్లోర్‌ను, నీటిని తాక కూడదు
- జాతీయ పతాకాన్ని వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించొద్దు. ఉదా: దుస్తులు, దిండు కవర్లు, నాప్ కిన్లు లేదా ఇతర వస్తువులపై త్రివర్ణ పతాకాన్ని వాడొద్దు. జాతీయ వేడుకల సందర్భంలో పేపర్ ఫ్లాగ్స్ లాంటి అనుమతి ఉన్న సందర్భాలకు ఇది వర్తించదు.
- స్టేట్ లేదా సైనిక అంత్యక్రియల్లో మినహా.. త్రివర్ణ పతాకాన్ని భవనం, వాహనం లేదా ప్లాట్‌ఫామ్‌పై కప్పుగా ఉపయోగించొద్దు.
- త్రివర్ణ పతాకాన్ని ఇతర జెండాల కంటే కిందగా లేదా దాని ప్రాధాన్యాన్ని తగ్గించే విధంగా పక్కన ఎగరేయకూడదు.
- జాతీయ పతాకంపై ఎలాంటి రాతలు, ముద్రణలు లేదా ఇతర మార్పులు ఉండొద్దు.
-జాతీయ పతాకం లేదా దాని డిజైన్‌ను.. నడుం కంటే దిగువ భాగాన్ని కప్పే దుస్తులు, యూనిఫామ్‌లు లేదా ఆభరణాల తయారీకి వాడొద్దు. అయితే ఫ్లాగ్ పిన్స్ లేదా గుర్తులను గౌరవప్రదంగా ధరించొచ్చు.
- త్రివర్ణ పతాకాన్ని ఉద్దేశపూర్వకంగా చింపేయడం, కాల్చడం లేదా పాడు చేయడం లాంటి పనులు పబ్లిక్‌లో చేయొద్దు. 1971 నాటి ప్రివెన్షన్ ఆఫ్ ఇన్‌సల్ట్స్ టు ది నేషనల్ హానర్ యాక్ట్ ప్రకారం ఇది నేరం.

**అదనపు మార్గదర్శకాలు:**

2022 ఫ్లాగ్ కోడ్ సవరణల తర్వాత పౌరులు తమ ఇళ్లు, కార్యాలయాలు లేదా ఫ్యాక్టరీల్లోనూ జాతీయ పతాకాన్ని ఎగరేయాలి. అయితే పైన పేర్కొన్న అన్ని నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ఫ్లాగ్ కోడ్‌ను ఉల్లంఘించడం లేదా జాతీయ పతాకాన్ని అవమానించడం చేస్తే.. 1971 నాటి చట్టం ప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించొచ్చు.

## అమెరికాలో ఇక చదువు కష్టమేనా?

### ట్రంప్ చర్యతో భారతీయ విద్యార్థులు ఏ దేశాలవైపు చూస్తున్నారు?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ విద్యార్థులకు అమెరికాలో ఇక చదువు కష్టమేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది!. రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు వీసా సమస్యలు మొదలయ్యాయి. వీసా అపాయింట్‌మెంట్లు దొరకడం కష్టంగా మారింది. వీసా తిరస్కరణ రేటు కూడా పెరగడంతో.. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మొదలయ్యే సెమిస్టర్‌కు వెళ్లాలనుకునే విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా మంది భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో వీసా తిరస్కరణలకు కారణాలు ఏంటి? ట్రంప్ చర్యతో భారతీయ విద్యార్థులు ఏ దేశాలవైపు చూస్తున్నారు? అనే విషయాలు తెలుసుకుందాం.అమెరికాలో ఇకపై చదువు కష్టమేనా? భారతీయ విద్యార్థుల అమెరికా డ్రీమ్ ఇక ఎండమావేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇకపై ఈ అమెరికా కల అంత సులభమేం కాదనే సంకేతాలు వస్తున్నాయి! గత కొద్ది నెలలుగా అమెరికా ఎఫ్-1 వీసా తిరస్కరణలు గణనీయంగా పెరిగాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కావడానికి దాదాపు రెండు వారాలు మాత్రమే సమయం ఉన్నా.. ఇప్పటికీ చాలా మందికి వీసాలు మంజూరు కాలేదు. ఈ క్రమంలో ఎఫ్-1 వీసా అంటే ఏమిటి? వీసా తిరస్కరణలకు కారాణాలేంటి? ఇటీవల కాలంలో వీసా మంజూరులో ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి? ట్రంప్ చర్యతో భారతీయ విద్యార్థులు ఏ దేశాలవైపు చూస్తున్నారు? అనే విషయాలను ఒకసారి పరిశీలిస్తే..అమెరికాలో ఆగస్టు చివర్లో లేదా సెప్టెంబర్ ప్రారంభంలో.. అంతర్జాతీయ విద్యార్థులకు కాలేజీల్లో ప్రవేశాలు మొదలవుతాయి. అయినా ఇప్పటివరకు చాలా మంది వీసాలు మంజూరు కాలేదు. వీసా అపాయింట్‌మెంట్లు తక్కువగా ఉండటం, ఎఫ్-1 వీసాలు తిరస్కరణకు గురికావడంతో ఈ పరిస్థితి తలెత్తింది.

**ఎఫ్-1 వీసాలు అంటే ఏమిటి?**

ఎఫ్-1 అనేది నాన్ ఇమ్మిగ్రంట్ వీసా. అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించడానికి ఈ వీసా చాలా ముఖ్యం. ఇది విద్యార్థులకు ఇచ్చే ఒక రకమైన అనుమతి పత్రం లాంటిది. దీని ద్వారానే విద్యార్థులు అమెరికాలో చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే, ఈ ఏడాది %ఖీ%-1 వీసా పొందడం భారతీయ విద్యార్థులకు చాలా కష్టంగా మారింది. యూఎస్ కాన్సులేట్‌లలో వీసా ఇంటర్వ్యూల కోసం అపాయింట్‌మెంట్లు దొరకడం లేదు. వీసాలను ఫ్రీజ్ చేశారో తెలియడం లేదు. లేదా ఊహించని విధంగా అపాయింట్‌మెంట్ స్లాట్లు రిలీజ్ చేస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో.. ఉన్న కొద్ది అపాయింట్‌మెంట్లు కూడా నిమిషాల్లోనే అయిపోతున్నాయి. చాలా మంది విద్యార్థులు అపాయింట్‌మెంట్ల కోసం ఎదురు చూస్తున్నారు.

70 శాతం తగ్గారు..'ఓపెన్ డోర్స్ రిపోర్ట్ ఆన్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్' నివేదిక ప్రకారం.. 2024లో దాదాపు 3,30,000 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. కానీ, ఈ సంవత్సరం ఆ సంఖ్య 1,00,000 కంటే తక్కువగా ఉంటే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంటే, దాదాపు 70 శాతం తగ్గారు. గతంలో ఇలా ఎన్నడూ జరగలేదని అంటున్నారు. అయితే, దీని ప్రభావం విద్యార్థులపైనే కాకుండా అమెరికన్ యూనివర్సిటీలపై కూడా ఉంటుందని.. చాలా విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థులపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు.

స్ట్రాంగ్ ప్రొఫైల్స్ ఉన్నా.. వీసా రిజెక్ట్ చేస్తున్నారు?

చాలా మంది విద్యార్థులకు మంచి మార్కులు, ఆర్థిక స్థోమత, స్ట్రాంగ్ ప్రొఫైల్ ఉన్నప్పటికీ వీసాలు రిజెక్ట్ చేస్తున్నారు. 'ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్'లోని సెక్షన్ 214 ప్రకారం విద్యార్థులు చదువు పూర్తయిన తర్వాత తమ దేశానికి తిరిగి వస్తారని కాన్సులేట్ అధికారులను కన్విన్స్ చేయాలి.

## జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానాన్ని స్వీకరించిన స్పీకర్.. విచారణకు ప్యానెల్ ఏర్పాటు

**న్యూఢిల్లీ-నవభూమి:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టల వ్యవహారం దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆయన అభిశంసన తీర్మానాన్ని తాజాగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. అభిశంసనపై 146 మంది ఎంపీలు సంతకాలు చేసిన తీర్మానాన్ని ఆమోదించారు. ఈ మేరకు జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఈ ప్యానెల్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మణీందర్ మోహన్, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్య ఉన్నారు. విచారణ నివేదికను వీలైనంత త్వరగా సమర్పించాలని కమిటీని స్పీకర్ ఈ సందర్భంగా కోరారుఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు వచ్చిన సమయంలో పెద్ద మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టలు, సగం కాలిన నోట్లు కనిపించాయి.


# డైట్ సోడాలతో చేటు



క్యాలరీలు లేని డైట్ సోడాలు ఆరోగ్యానికి చేటు కలిగించవని అనుకోవడం పొరపాటు. వాటితో గుండెకూ, మెదడుకూ చేటు కలుగుతుందని అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. రోజుకు ఒకటి లేదా రెండు డైట్ సోడాలు తాగే వారికి దాదాపు మూడు రెట్లు గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు పొంచి ఉంటుందనే ఒక తాజా అధ్యయనం అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జోర్నల్‌లో ప్రచురితమైంది. ఈ అధ్యయనంలో భాగంగా 2,800 మంది, 45 నుంచి 55 ఏళ్ల వయస్కులను పరీక్షించినప్పుడు, వారికి గుండెపోటు, అల్జీమర్స్ ముప్పు 30% కంటే ఎక్కువ ఉన్నట్టు గుర్తించడం జరిగింది. అలాగే డైట్ సోడాలోని ఫాస్ఫరస్ ఎముకల సాంద్రతను సన్నగిల్లేలా చేసి ఎముకలను గుల్లబారుస్తుంది. అలాగే దాన్లోని కృత్రిమ చక్కెరలైన ఆస్పర్టేమ్ లేదా స్టీవియాలు నాడీ క్షీణతను పెంచుతాయి. డైట్ సోడాను విపరీతంగా తాడే వారిలో, మూత్రపిండాల సామర్థ్యం కూడా త్వరితంగా క్షీణిస్తుందని నర్సెస్ హెల్త్ స్టడీకి చెందిన పరిశోధకులు కనిపెట్టారు. దాహార్తిని తీర్చుకోవడం కోసం డైట్ సోడాల మీద ఆధారపడడం వల్ల ఈ పానీయంలోని కెఫీన్ ఫలితంగా దాహార్తి తీరకపోగా, అత్యధిక మూత్రవిసర్జనతో శరీరంలో డీహైడ్రేషన్ పెరుగుతుందని కూడా వారు హెచ్చరిస్తున్నారు. దీన్లోని కెఫీన్‌తో నిద్రలేమి సమస్య కూడా వేధిస్తుందనీ, అదే పనిగా డైట్ సోడాలు తాగడం వల్ల కాలేయం దెబ్బతింటుందని కూడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



# 'ఫారెస్ట్ క్వీన్' మున్ముని



ప్రకృతిని కాపాడుకోకపోతే మానవాళికి భవిష్యత్తు లేదన్న నాన్న మాట మున్ముని పాయెంగ్‌కు మంత్రమయింది. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ... ప్రజల్ని కూడగట్టింది. ఆమె, ఆమె బృందం రెండేళ్ళలో పది లక్షల మొక్కలు నాటి... ఆకుపచ్చ విప్లవాన్ని సృష్టించారు. "మేము నాటే ప్రతి మొక్కా భవిష్యత్తుకు హామీ ఇస్తుంది. మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది" అంటోంది అసోంకు చెందిన పాతికేళ్ళ 'ఫారెస్ట్ క్వీన్' మున్ముని.

చిన్నప్పుడు నాన్న భుజాల మీద కూర్చొని, అడవిలో తిరుగుతూ, ఆయన మొక్కలు నాటుతూ ఉంటే, తను కూడా ఓ చెయ్యి వేస్తానని మారాం చేయడం... మున్ముని పాయెంగ్‌కు ఇష్టమైన జ్ఞాపకం. హఠాత్తుగా వరదలు ముంచుకొచ్చి భూమి కోతకు గురై... విలయంలో చిక్కుకున్న జనం నిస్సహాయత... ప్రతి వర్షాకాలంలో ఆమె కళ్ళెదుట నిలిచిన వాస్తవం. ఆ జ్ఞాపకంతో, ఈ వాస్తవంతో మున్ముని జీవితం పెనవేసుకుపోయింది.

**ఆయనను చూసే నేర్చుకున్నా...**

మున్ముని స్వస్థలం అసోం రాష్ట్రంలో... బ్రహ్మపుత్ర నదిలో ఉన్న అతి పెద్ద దీవి... మాజులీ. ప్రకృతి వైపరీత్యాల మధ్య జనం బిక్కుబిక్కుమంటూ గడిపే ఆ దీవికి ఒక కొత్త రూపు తెచ్చిన వ్యక్తి జాదవ్ మొలోయ్ పాయెంగ్. తమ దీవిని కాపాడుకోవాలనే తపనతో... రోజుకు ఒక మొక్క నాటే దీక్షను ఆయన తన పదహారేళ్ళ వయసులో చేపట్టారు. ఆయన కృషితో... ముప్ఫైయ్యేళ్ళలో... బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఉన్న ఇసుక దిబ్బల్లో... 1,360 ఎకరాల అడవి ఏర్పడింది. ఆ అడవిని జనం 'మొలోయ్ కథోనీ' అని ఆయన పేరిటే పిలుచుకుంటారు. 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అంతర్జాతీయంగానూ ప్రసిద్ధుడైన జాదవ్ 2015లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు. "నాకు అడుగడుగునా నాన్నే స్ఫూర్తి. మంచి మనిషిగా బతకాలి. కష్టపడి పని చెయ్యాలి. ఇతరులకు సాయపడాలి. ప్రకృతి సంపద పెరుగుదలకు దోహదం చేయాలి... ఇవి నాన్న నాకు చెప్పిన పాఠాలు. చిన్న స్థాయిలో ప్రారంభించినా అకుంఠిత దీక్షతో కొనసాగిస్తే... అసాధ్యాలు సుసాధ్యాలవుతాయనేది ఆయనను చూసే నేర్చుకున్నాను" అని చెబుతోంది మున్ముని. "నాన్న నాటిన అడవి ఇప్పుడు బెంగాల్ టైగర్స్, ఖడ్గమృగాలు, లేళ్లు, కుందేళ్ళు, కోతులు, రకరకాల పక్షులు, వైవిధ్యభరితమైన చెట్లతో కళకళలాడుతోంది. ప్రతి సంవత్సరం వందకి పైగా ఏనుగులు వచ్చి, ఆరు నెలలపాటు అందులో విడిది చేస్తాయి. ఒకప్పుడు బీడులా ఉండే ఆ ప్రాంతం ఇలా మారడానికి నాన్న ముందుచూపు, పట్టుదల కారణం. వాటినే నేను వారసత్వంగా స్వీకరించాను" అంటోంది మున్ముని. తండ్రి పేరిట నడుస్తున్న 'ఫారెస్ట్‌మ్యాన్ ఫౌండేషన్'లో కార్యకర్తగా చేరిన ఆమె ప్రస్తుతం ఆ సంస్థకు కార్యదర్శిగా వ్యవహరిస్తోంది. అలాగే 'సెజు ధరణి' (ఆకుపచ్చని భూమి) అనే సంస్థను మరికొందరితో కలిసి స్థాపించింది. మాజులీ, జోర్హాట్ జిల్లాల్లోని సుమారు అరవై గ్రామాల ప్రజలకు మొక్కల పెంపకంపై అవగాహన కల్పించింది. వారిని బృందంగా ఏర్పాటు చేసి... 2022లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండేళ్ళ వ్యవధిలో ఆమె, ఆమె బృందం పది లక్షలకు పైగా మొక్కలు నాటారు. ఈ యజ్ఞం ఇంకా కొనసాగుతోంది. "కోటి మొక్కలు నాటడం ప్రస్తుతం మా లక్ష్యం" అంటున్న మున్మునిని అందరూ 'ఫారెస్ట్ క్వీన్' అని ఆప్యాయంగా పిలుస్తారు. గ్రామస్తులు, పర్యావరణ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో... 'సబ్‌స్టాన్షియల్ గ్రీన్ ఇనీషియేటివ్ అండ్ క్లైమెట్ జస్టిస్' సంస్థ సహకారంతో 'మొలోయ్ కథోనీ 2.0' ప్రాజెక్ట్‌ను ఇటీవలే ఆమె ప్రారంభించింది.

**ఆ బాధ్యత తీసుకోవాలి...**

"బ్రహ్మపుత్ర తీరం, దీవులు పచ్చదనంతో కళకళలాడాలనేది మా నాన్న కల. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఉధృతమైన వరదలకు ఈ ప్రాంతంలోని దీవులు మునిగిపోవడం, అపారమైన పశు నష్టం, ఆస్తి నష్టం, పదుల సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతూ ఉండేది. అడవులు కొరవడడంతో గ్రామాల్లోకి ఏనుగులు మందలుగా వచ్చి విధ్వంసం సృష్టించేవి. దాన్ని నివారించడానికి చెట్ల పెంపకమే మార్గమనే ఆలోచనతో... చాలా చిన్న వయసులోనే మా నాన్న తన తన కృషిని ప్రారంభించారు. ఎడారిలా ఉండే ప్రాంతానికి పచ్చదనాన్ని తీసుకొచ్చారు. "మొక్కలు నాటడం, వాటిని పెంచడం అంటే మనల్ని కాపాడి, పోషిస్తున్న ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుకోవడమే" అని ఆయన మాకు ఎప్పుడూ చెబుతారు. ఆయన స్ఫూర్తితో... మా ప్రాంతానికే ప్రత్యేకమైన దేశీయమైన మొక్కలనే నాటుతున్నాం. అంతేకాదు... నాటిన ప్రతి మొక్కా పెరిగి పెద్దదయ్యేదాకా... బాధ్యత తీసుకుంటున్నాం.

# అన్నం తింటే షుగర్ పెరుగుతుందనే భయం వద్దు



షుగర్ వచ్చిన ప్రతి వ్యక్తికీ డాక్టర్లు ముందుగా చెప్పే మాట ఒకటే. రైస్ వీలైనంత వరకూ తగ్గించాలి. రోజుకు ఓ పూట మాత్రమే అన్నం తిని మిగతా రెండు పూటలు ఇంకేదైనా డైట్ తీసుకోవాలని సలహా ఇస్తారు. అందుకే..చాలా మంది షుగర్ పేషెంట్స్ వైట్ రైస్ ని అవాయిడ్ చేస్తారు. అన్నంలో చక్కెర నిల్వలు ఎక్కువగా ఉంటాయి. ఎక్కువ మొత్తంలో తీసుకుంటే అమాంతం షుగర్ పెరిగిపోతుంది. అయితే..రైస్ కి, షుగర్ లెవెల్స్ లింక్ ఉన్న మాట వాస్తవమే. కానీ..వేడి వేడి అన్నంతో పోల్చి చూస్తే చద్దన్నంతో షుగర్ పెరిగే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్ రష్మి. అప్పుడే వండుకున్న అన్నం తిన్నప్పటితో కంపేర్ చేస్తే చద్దన్నం తిన్నప్పుడు షుగర్ లెవెల్స్ కంట్రోల్ లోనే ఉంటాయని వివరిస్తున్నారు. అందుకు కారణాలేంటో కూడా ఎక్స్ ప్లెయిన్ చేశారు. వేడన్నం, చద్దన్నం మధ్య ఎందుకంత తేడా. రాత్రి మిగిలిన అన్నం ఉదయం తింటే షుగర్ ఎందుకు కంట్రోల్ అవుతుంది. దీనిపై న్యూట్రిషనిస్ట్ రష్మి ఏం చెప్పారో తెలుసుకుందాం.

మంచి ఆకలి మీద ఉన్నప్పుడు వేడి వేడి అన్నంలో కాస్తంత పచ్చడి కలుపుకుని తిన్నా సరే రుచికరంగా అనిపిస్తుంది. ఆకలి తీరిపోతుంది. అయితే..ఇలా ఆకలి తీర్చి శక్తినిచ్చే అన్నమే..షుగర్ పేషెంట్స్ కి చేటు చేస్తుంది. ఇందులో ఉండే చక్కెర కారణంగా డయాబెటిస్ ఉన్న వాళ్లలో షుగర్ లెవెల్స్ ఉన్నట్టుండి పెరిగిపోతాయి. అందుకే..షుగర్ పేషెంట్స్ రైస్ ని చాలా తక్కువ క్వాంటిటీలో తీసుకుంటారు. ఈ మధ్య కాలంలో జొన్నలు, సజ్జలు, రాగులతో రొట్టెలు చేసుకుని తింటున్నారు. ఇవి షుగర్ ని కంట్రోల్ చేయడంలో



తోడ్పడతాయి. అయితే.. అన్నంతో ఈ షుగర్ పెరిగినప్పటికీ..చద్దన్నం లేదా ఫ్రిజ్ లో పెట్టిన అన్నంతో ఇలాంటి ఇబ్బంది ఉండదు అని చెబుతున్నారు న్యూట్రిషనిస్ట్.

చల్ల అన్నమే మేలు..రాత్రి అన్నం మిగిలిపోతే మరుసటి రోజు ఏం తింటాంలే అని చెత్త బుట్టలో పారేస్తారు. కానీ..ఇలా మిగిలిపోయి అన్నంతోనే షుగర్ కంట్రోల్ చేసుకోవచ్చు. వినడానికి కాస్త భిన్నంగా అనిపించినా ఇదే నిజం అంటున్నారు న్యూట్రిషనిస్ట్ రష్మి. నిజానికి షుగర్ నియంత్రణలో ఉండాలంటే గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. అయితే..అప్పుడే వండిన అన్నంలో ఈ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. అందుకే.. తినగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. ఎప్పుడైతే దీన్ని రాత్రంతా నిల్వ ఉంచుతారో..అప్పుడు ఈ ఇండెక్స్ తగ్గిపోతుంది. అంటే..అది షుగర్ పేషెంట్స్ కూడా తినేందుకు అనువుగా మారుతుంది. ఇలా ఎందుకు జరుగుతుందో చూద్దాం. అన్నం రాత్రంతా నిల్వ ఉంచడం లేదా ఫ్రిజ్ లో పెట్టడం ద్వారా అందులో ఉండే పిండి పదార్థం తగ్గుతుంది. సాధారణంగా ఈ స్టార్చ్ కారణంగా షుగర్ పెరుగుతుంది. కానీ..ఇలా రాత్రంతా ఉంచడం వల్ల అన్నంలోని ఈ స్టార్చ్ మోతాదు తగ్గుతుంది. దీన్ని రెసిస్టెంట్ స్టార్చ్ అని పిలుస్తారు. మామూలుగా అయితే అన్నంలో ఉండే చక్కెర శరీరంలోకి వెళ్లిన తరవాత ముక్కలుగా విడిపోయి చక్కెరలో కలిసిపోతుంది. ఈ కారణంగానే షుగర్ లెవెల్స్ పెరుగుతాయి. కానీ..ఈ రెసిస్టెంట్ స్టార్చ్ అలా విడిపోదు. సులువుగా అరిగేందుకు అనువుగా మారిపోతుంది. అందుకే..చల్ల అన్నం తింటే సులువుగా జీర్ణం అవుతుంది. దీన్ని సైంటిఫిక్ గా స్టార్చ్ రిట్రోగ్రేడేషన్ అంటారు. అంటే..ఇలా ఉన్న అన్నం తింటే అందులో ఉండే పిండి పదార్థాన్ని లేదా చక్కెరను శరీరం అబ్జార్బ్ చేసుకోదు. అందుకే..షుగర్ లెవెల్స్ పెరగవు.

# అమ్మ చేతి గోరుముద్ద!



పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరి చూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం.

పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

**అమ్మమ్మల ఆహారం!**

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు.

అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

**పేచీ పెట్టే పిల్లలతో ఇలా...**

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది.

ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్థి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

**పోషకాల చిరుతిళ్లు ఇవే!**

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చికూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు.

షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

**ఆకలి తెలియనివ్వాలి**

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పుడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు.

కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.


**పిల్లల ఆహారం పసందుగా...**

అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి.

'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి.

చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.

# జుట్టుకు రంగు వద్దు



ఈ రోజుల్లో అందంగా ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. ఇక, జుట్టు ప్రతి ఒక్కరి అందంలో కీలకపాత్ర పోషిస్తుంది. అయితే, ఈ రోజుల్లో చాలా మంది జుట్టు సమస్యలతో బాధపడుతున్నారు. అందులో తెల్ల జుట్టు ఒకటి. సాధారణంగా లేటు వయసులో తెల్ల జుట్టు వస్తుంది. అయితే, ఈ రోజుల్లో చాలా మంది చిన్న వయసులోనే తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతున్నారు. నిండా ముప్పై ఏళ్లు రాక ముందే తలంతా తెల్ల జుట్టుతో కనిపించే వారు బోలెడు. ఇక, తెల్ల జుట్టు సమస్యను తగ్గించుకోవడానికి మార్కెట్లో దొరికే కెమికల్ డై, హెన్నా ప్రొడక్ట్స్ వాడుతున్నారు. అయితే, ఇవి తాత్కాలికంగా మాత్రమే తెల్ల జుట్టును నల్లగా మారుస్తున్నాయి. ఆ తర్వాత మళ్లీ తెల్ల జుట్టు కనిపించడం ప్రారంభమవుతుంది. అయితే, తెల్ల జుట్టు రాకుండా ఆ సమస్యను తగ్గించేందుకు కొన్ని చిట్కాల్ని ప్రముఖ డెర్మాటాలజిస్ట్ యుగల్ రాజ్‌పుత్ కాన్పూర్ చెప్పారు. ఈ చిట్కాల్ని రెగ్యులర్‌గా ఫాలో అయితే తెల్ల జుట్టు రాకుండా ఆపవచ్చు. ఇంతకీ ఆ చిట్కాలేంటో తెలుసుకుందాం.

చిన్న వయసులోనే జుట్టు తెల్లబడటానికి అనేక కారణాలు ఉన్నాయని కాన్పూర్‌లోని మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డెర్మటాలజిస్ట్ డాక్టర్ యుగల్ రాజ్‌పుత్ చెప్పారు. ఈ సమస్యకు అతిపెద్ద కారణం పోషకాహార లోపం అంటే అవసరమైన పోషకాలు లేకపోవడం. సరైన ఆహారం తీసుకోకపోతే, శరీరంలో పోషకాల లోపం ఏర్పడుతుంది. దీంతో జుట్టు బూడిద రంగులోకి మారడం ప్రారంభమవుతుంది. విటమిన్ %దీ%12 లోపం, దీర్ఘకాలిక అనారోగ్యం, జన్యుపరమైన రుగ్మత, థైరాయిడ్ రుగ్మత, పరాన్నజీవి సంక్రమణ, అధిక ఒత్తిడి కారణంగా చిన్న వయసులోనే బూడిద జుట్టు సమస్య వస్తుందని డాక్టర్ తెలిపారు. ఇక, ఈ సమస్యను నివారించడానికి డాక్టర్ కొన్ని చిట్కాలు చెప్పారు. అవేంటో ఓ లుక్కేద్దాం.

**పోషకాలు అధికంగా ఉండే ఆహారం**

తెల్ల జుట్టు సమస్యను నివారించడానికి, పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని చర్మవ్యాధి నిపుణులు యుగల్ అంటున్నారు. పోషకాలు పుష్కలంగా పండ్లు, కూరగాయలు వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. సీజన్ ఏదైనా సరే సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని డాక్టర్ చెప్పారు. దీంతో విటమిన్ డి పుష్కలంగా పొందవచ్చు. శాఖాహారులు ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.

**తలకు మసాజ్**

తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు వారానికి ఒకసారి తలకు బాగా మసాజ్ చేసుకోవాలని డాక్టర్ సూచించారు. తలకు మసాజ్ చేయడం వల్ల మైక్రో సర్క్యులేషన్ మెరుగుపడుతుంది. దీంతో జుట్టు మూలాలకు రక్త సరఫరా సరిగ్గా జరుగుతుంది. కొబ్బరి నూనె, ఆవ నూనె, నువ్వుల నూనె వీటిలో ఏదైనా ఒక్కదానితో తలకు మసాజ్ చేసుకోవాలని డాక్టర్ చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. అంతేకాకుండా తెల్ల జుట్టు సమస్య నుంచి బయటపడవచ్చని తెలిపారు.

**షాంపూ తర్వాత కండీషనర్**



తల స్నానం చేసిన తర్వాత జుట్టును బాగా ఆరబెట్టుకోవాలని డాక్టర్ యుగల్ అంటున్నారు. వారానికి రెండు మూడు సార్లు షాంపూతో స్నానం చేసిన తర్వాత జుట్టుకు కండీషనర్ వాడాలి. ఇది జుట్టును తేమగా ఉంచుతుంది. ఇలా చేయడం వల్ల జుట్టు తెల్లబడే ప్రమాదం తగ్గుతుంది. షాంపూ తర్వాత జుట్టుకు కండీషనర్ అప్లై చేయడం వల్ల చుండ్ర సమస్య కూడా తగ్గుతుందని డాక్టర్ చెబుతున్నారు.

**జుట్టుకు రంగు వద్దు**

కొంతమంది జుట్టు తెల్లగా మారిన వెంటనే హెయిర్ కలర్ వేయడం ప్రారంభిస్తారు. ఇది తెల్ల జుట్టు సమస్యను పెంచుతుంది. మార్కెట్లో దొరికే హెయిర్ కలర్, కెమికల్ డైల్లో జుట్టుకు హాని కలిగించే రసాయనాలు ఉంటాయి. తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు హెయిర్ కలర్ వేయకపోవడమే మంచిదని డాక్టర్ అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెల్ల జుట్టు సమస్యతో బాధపడేవారు వైద్యుణ్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మేలు.

**వ్యాయామం**

జుట్టు ఆరోగ్యానికి, వ్యాయామానికి సంబంధం ఏముందని అనుకుంటున్నారా? వ్యాయామంతో జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ అంటున్నారు. రెగ్యులర్‌గా వ్యాయామం జుట్టుపై మంచి ప్రభావాన్ని చూపుతుంది. జుట్టు సమస్యలను తగ్గిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ దాదాపు 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గుతుంది. తెల్ల జుట్టు సమస్య కూడా తగ్గుతుందని డాక్టర్ యుగల్ చెబుతున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్
బుధవారం
13 । ఆగస్టు । 2025




# స్టాక్ మార్కెట్లో ఊరట..



**ముంబై-నవభూమి:** వరుసగా ఆరు వారాలుగా నష్టపోతూ మూడు నెలల కనిష్ఠానికి జారుకున్న ఈక్విటీ సూచీలకు సోమవారం కాస్త ఊరట లభించింది. ఇంధన, వాహన, బ్యాంకింగ్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వాల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో మార్కెట్ మళ్లీ లాభాల్లో పయనించింది. సెన్సెక్స్ 746.29 పాయింట్ల వృద్ధితో 80,636.05 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 221.75 పాయింట్ల లాభంతో 24,585.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.5 లక్షల కోట్ల పెరుగుదలతో రూ.444.13 లక్షల కోట్లకు చేరుకుంది. అమెరికా మార్కెట్ల సానుకూల సంకేతాలు, వరుసగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మళ్లీ మన మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలపరిచిందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నెల 15న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ముగిసేందుకు ఈ సమావేశం బాటలు వేయనుందన్న అంచనాలూ మార్కెట్ ర్యాలీకి దోహదపడ్డాయి.

## రోజూ రూ. 333 సేవ్ చేయండి..ఈ పోస్టాఫీస్ స్కీంతో రూ.17 లక్షలు పొందే ఛాన్స్..



**ముంబై-నవభూమి:** మీరు తక్కువ రిస్క్‌తో మంచి రాబడి ఇచ్చే స్కీం కోసం చూస్తున్నారా. అయితే, పోస్టాఫీస్ స్కీమ్స్ అందుకు బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. ఎందుకంటే వీటిలో ఎలాంటి రిస్క్ ఉండదు. మనం ఇన్వెస్ట్ చేసిన మొత్తం గ్యారంటీగా వడ్డీతోసహా తిరిగి వస్తుంది. అలాంటి వాటిలో పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ స్కీం కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు సపోర్ట్ ఇస్తుంది. ఈ పథకంలో రోజుకు కేవలం రూ.333 పొదుపు చేయడం ద్వారా మీరు రూ.17 లక్షల మొత్తాన్ని సృష్టించవచ్చు. అది ఎలా అనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

పోస్టాఫీస్ RDలో రోజుకు రూ.333 పొదుపు చేస్తే, నెలకు రూ.10,000 అవుతుంది (రూ.333 %ఇ% 30 రోజులు = రూ.9,990, దాదాపు రూ.10,000). ఈ మొత్తాన్ని 5 సంవత్సరాల పాటు స్కీంలో ఇన్వెస్ట్ చేస్తే, మొత్తం రూ.6 లక్షలు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుతం ఈ పథకంపై 6.7% వార్షిక వడ్డీ లభిస్తుంది. ఇది త్రైమాసిక కాంపౌండింగ్‌తో లెక్కించబడుతుంది. ఈ వడ్డీ రేటు ప్రకారం, 5 సంవత్సరాల తర్వాత మీకు సుమారు రూ.1.13 లక్షల వడ్డీ లభిస్తుంది, అంటే మొత్తం రూ.7.13 లక్షలు లభిస్తాయి.

ఇప్పుడు మీరు ఈ ఖాతాను మరో 5 సంవత్సరాలు పొడిగిస్తే, మీ పెట్టుబడి రూ.12 లక్షలకు చేరుతుంది (రూ.10,000- 120 నెలలు). ఈ 10 సంవత్సరాల కాలంలో, కాంపౌండింగ్ వడ్డీ మీ మొత్తాన్ని రూ.17,08,546కు పెంచుతుంది. అంటే ఈసారి మీకు రూ.5.08 లక్షల వడ్డీ లభిస్తుంది. ఈ విధంగా రోజుకు కేవలం రూ.333 పొదుపు చేయడం ద్వారా మీరు 10 సంవత్సరాల్లో రూ.17 లక్షల మొత్తాన్ని దక్కించుకోవచ్చు.

**కేవలం రూ.100తో ప్రారంభించండి**

పోస్టాఫీస్ పథకం అందరికీ అందుబాటులో ఉండేలా రూపొందించబడింది. ఈ పథకంలో కనీసం రూ.100తో నెలవారీ డిపాజిట్ ప్రారంభించవచ్చు. ఇది ఒక నెలవారీ పొదుపు పథకం. దీనిలో మీరు ప్రతి నెలా స్థిర మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. ఈ పథకం ప్రాథమిక మెచ్యూరిటీ వ్యవధి 5 సంవత్సరాలు, కానీ మీరు దీనిని మరో 5 సంవత్సరాలు పొడిగించవచ్చు. అంటే మొత్తం 10 సంవత్సరాల వరకు పెట్టుబడిని కొనసాగించవచ్చు. అన్ని వయసుల వారు ఈ పథకంలో ఇన్వెస్ట్ చేయవచ్చు.

అదనపు ప్రయోజనాలు..ముందస్తు ఉపసంహరణ సౌలభ్యం: ఒకవేళ మీరు ఏదైనా కారణంతో ఖాతాను మూసివేయాలనుకుంటే, 3 సంవత్సరాల తర్వాత ముందస్తుగా ఉపసంహరణ అవకాశం అందుబాటులో ఉంది. ఇది మీకు ఆర్థిక సౌలభ్యాన్ని అందిస్తుంది.నామినీ సౌకర్యం: ఈ పథకం నామినీ సౌకర్యాన్ని అందిస్తుంది. ఒకవేళ పెట్టుబడిదారుడికి ఏదైనా జరిగితే, నామినీ ఖాతాను క్లెయిమ్ చేయవచ్చు లేదా కొనసాగించవచ్చు.రుణ సౌకర్యం: ఈ పథకం రుణ సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. ఒక సంవత్సరం నిరంతరం డిపాజిట్ చేసిన తర్వాత, మీరు డిపాజిట్ చేసిన మొత్తంలో 50% వరకు రుణంగా తీసుకోవచ్చు.

## సుంకాలు లేవంటూ ట్రంప్ ప్రకటన..

### బంగారం ధర మరింత తగ్గనుందా..

**ముంబై-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియా ఉత్పత్తుల విషయంలో 50 శాతం సుంకాలు విధించనున్నట్లు ఇప్పటికే తెలిపారు. కానీ బంగారంపై మాత్రం ఈ సుంకాలు ఉండవని సోషల్ మీడియా ట్రూత్ వేదికగా వెల్లడించారు. దీంతో గత కొన్ని రోజులుగా కొనసాగిన ఊహాగానాలకు బ్రేక్ పడింది. ఈ వార్త విన్న తర్వాత బంగారం ధరలు పెరుగుతాయని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. బదులుగా బంగారం ధర ఒక్క రోజులోనే 1.6% పడిపోయి, ఔన్స్‌కు 3,350 స్థాయికి చేరుకుంది. ఇది మే 14 తర్వాత అతిపెద్ద క్షీణత అని చెప్పుకోవచ్చు.

ఈ గందరగోళం శుక్రవారం యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ జారీ చేసిన ఒక ప్రకటనతో మొదలైంది. స్విట్జర్లాండ్ నుంచి వచ్చే కిలో, 100 ఔన్సుల బంగారు కడ్డీలపై 39% సుంకం విధిస్తామని వాళ్లు చెప్పారు. ఇది స్విట్జర్లాండ్‌కు బిగ్ షాక్ అని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రపంచంలో దాదాపు 70% బంగారాన్ని ఈ దేశమే రిఫైన్ చేస్తుంది. ఈ బంగారం చాలావరకు అమెరికాకు ఇన్వెస్ట్‌మెంట్, ఇండస్ట్రీ ఉపయోగాల కోసం వెళ్తుంది. ఒకవేళ స్విస్ బంగారంపై సుంకాలు పడితే, గ్లోబల్ బులియన్ మార్కెట్‌లో కూడా మార్పు జరిగే అవకాశం ఉంది. ఈ వార్తతో బంగారం ప్రియులు, ఇన్వెస్టర్లు ఒక్కసారిగా ఆందోళనలో పడ్డారు. ట్రంప్ స్వయంగా బంగారంపై సుంకాలు లేవని క్లారిటీ ఇవ్వడంతో ఆ భయాలు పూర్తిగా తొలగిపోయాయి.

అయితే సుంకాలు లేవని ట్రంప్ చెప్పినా కూడా బంగారం ధర పెరగలేదు, కానీ డ్రాప్ అయ్యింది. దీనికి కొన్ని కారణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది బంగారం ధర ఇప్పటికే 27% పెరిగింది. ఇది బిట్‌కాయిన్ గెయిన్స్‌తో సమానం, %ఎస్‌అండ్‌పీ% 500 ఇండెక్స్‌లోని 9% రిటర్న్‌ను కూడా బీట్ చేసింది. ఇంత భారీ గెయిన్స్ తర్వాత, సుంకాల భయం తొలగిపోయింది కాబట్టి, ఇన్వెస్టర్లు లాభాలను బుక్ చేసుకునేందుకు వెనక్కి తగ్గారు.

స్థిరంగా ధరలు..బంగారం అంటే సేఫ్ హెవెన్ ఆస్తి. సుంకాల భయం ఉన్నప్పుడు దీని డిమాండ్ పెరుగుతుంది. ఇప్పుడు ట్రంప్ సుంకాలు లేవని చెప్పడంతో, ఆ భయం తగ్గిపోయి, బంగారం కొనాలనే ఆసక్తి ఇన్వెస్టర్లలో తగ్గింది. సుంకాలు లేనందున బంగారం ధరలు స్థిరంగా ఉంటాయని మార్కెట్ భావించింది. దీంతో కొత్తగా కొనుగోళ్లు చేసే ఉత్సాహం తగ్గింది.ధరలు ఇంతకంటే ఎక్కువ పెరగవని ట్రేడర్లు భావించి ఉండొచ్చు. బంగారం ధరలు ఇప్పటికీ హై లెవెల్స్‌లో ఉన్నాయి. కానీ ఈ ఒక్క రోజు డ్రాప్‌తో పానిక్ అవ్వాల్సిన అవసరం లేదు. బంగారం ఎప్పుడూ లాంగ్-టర్మ్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ఉపయోగపడుతుంది. మరికొంత మంది నిపుణులు మాత్రం రానున్న రోజుల్లో పసిడి ధరలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.




## సరికొత్త రీఛార్జ్ ప్లాన్.. రూ. 347కే అన్‌లిమిటెడ్ కాల్స్, డైలీ 2జీబీ డేటా.. 54 రోజులు ఆఫర్!




**న్యూఢిల్లీ-నవభూమి:** గత కొంత కాలంగా ప్రభుత్వ రంగ టెలికాం దిగ్గజం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ తన కస్టమర్లను పెంచుకుంటున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఇతర అగ్రగామి టెలికాం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఇలాంటివన్నీ భారీగా టారిఫ్స్ పెంచడంతో కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ వైపు ఆకర్షితులయ్యారని చెప్పొచ్చు. ఆయా టెలికాం కంపెనీలు ఒక్క నెల రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ చేసుకోవాలన్నా కనీసం రూ. 200 పైనే వసూలు చేస్తున్నాయి. ఇది వినియోగదారులకు భారంగా మారింది. మరోవైపు.. బీఎస్ఎన్ఎల్ ఎప్పటినుంచో యూజర్లకు బడ్జెట్ ఫ్రెండ్లీ ప్లాన్స్ అందిస్తోంది. ఇప్పటికే ఇక్కడ 4G సేవలు అందుబాటులోకి రాగా.. త్వరలోనే 5G సర్వీసుల్ని కూడా లాంచ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే ఇప్పుడు భారత స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో అద్భుత ప్లాన్ లాంచ్ చేసింది.ఇందులో భాగంగా రూపాయికే సరికొత్త ప్లాన్ లాంచ్ చేసింది. రూపాయితోనే కొత్త సిమ్ అందించడంతో పాటుగా.. 30 రోజుల పాటు అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 2GB డేటా, 100 SMS లు ఆఫర్ చేస్తోంది. ఇది కొత్త యూజర్లకు మాత్రమే వర్తిస్తుందని బీఎస్ఎన్ఎల్ స్పష్టం చేసింది. ఇదే సమయంలో బీఎస్ఎన్ఎల్ నుంచి అందుబాటులో ఉన్న మరో అద్భుత ప్లాన్ గురించి తెలుసుకుందాం.ఇదే రూ. 347 ప్లాన్. ఇక్కడ రూ.347 తో రీఛార్జ్ చేసుకుంటే 54 రోజుల వ్యాలిడిటీతో రోజుకు 2GB చొప్పున డేటా వస్తుంది. పూర్తి కాల పరిమితికి 108 GB డేటా వస్తుంది. ఇంకా అన్‌లిమిటెడ్ కాల్స్,రోజుకు 100 SMS లు ఎలాగూ ఉన్నాయి. ఇదే డేటా కోసం 56 రోజుల కాల పరిమితితో ఎయిర్‌టెల్, జియోల్లో రీఛార్జ్ ధర చాలా ఎక్కువగా ఉందని చెప్పొచ్చు.మరోవైపు బీఎస్ఎన్ఎల్‌లో వార్షిక ప్లాన్ కూడా చాలా తక్కువకే ఉంది. రూ. 1999తో రీఛార్జ్ చేసుకుంటే ఏడాది పాటు వ్యాలిడిటీతో అన్‌లిమిటెడ్ కాల్స్, డేటా పొందొచ్చు. ఇక్కడ డైలీ 1.64 GB డేటా వస్తుంది. మొత్తంగా చూస్తే 600 GB డేటా వస్తుంది. ఇక్కడ కూడా ఏడాది పాటు అపరిమిత కాల్స్, రోజుకు 100 SMS లు వస్తాయి.

## వాహన దారులకు అలర్ట్.. 15 నుంచి ఫాస్టాగ్ కొత్త విధానం అమలు..




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో జాతీయ రహదారులపై ప్రయాణం చేస్తున్నవారికి కీలక అలర్ట్ వచ్చేసింది. ఇకపై ప్రతి టోల్ వద్ద వాహనం వాహనం ఆపి టోల్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆగస్టు 15 నుంచి గ్ఖుం౦% అనే కొత్త స్కీంను ప్రారంభించబోతోంది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ పథకాన్ని ప్రకటించారు. ఈ పాస్ ద్వారా హైవే టోల్ బూత్‌ల వద్ద ఎదురయ్యే ఆలస్యం, రద్దీ వంటి సమస్యలను నివారించుకుని ప్రయాణికులు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని పొందవచ్చు.

ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ అనేది తరచూ జాతీయ రహదారులపై ప్రయాణించే వారి కోసం రూపొందించిన ఒక సరికొత్త పథకం. ఈ పాస్‌తో కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి ప్రైవేట్ వాహనాలు ఒకేసారి రూ. 3,000 చెల్లించడం ద్వారా ఒక సంవత్సరంలో 200 టోల్ క్రాసింగ్‌ల వరకు ప్రయాణించవచ్చు. ఏది ముందు వస్తే అది. ఈ పాస్ ద్వారా టోల్ బూత్‌ల వద్ద తరచూ ఫాస్టాగ్ రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేకుండా సులభంగా ప్రయాణించవచ్చు.

**ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ ఎలా పనిచేస్తుంది?**

ఈ యాన్యువల్ పాస్‌నిర్వహించే జాతీయ రహదారులు జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలపై మాత్రమే చెల్లుతుంది. ఉదాహరణకు, ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై-నాసిక్, ముంబై-సూరత్, ముంబై-రత్నగిరి వంటి రహదారులపై ఈ పాస్ ఉపయోగపడుతుంది. అయితే, రాష్ట్ర రహదారులు లేదా మున్సిపల్ టోల్ రోడ్లపై (ఉదాహరణకు, ముంబై-పూణే ఎక్స్‌ప్రెస్‌వే, ముంబై-నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వే, అటల్ సేతు, ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వే, బెంగళూరు-మైసూర్ ఎక్స్‌ప్రెస్‌వే, అహ్మదాబాద్-వడోదర ఎక్స్‌ప్రెస్‌వే) ఈ పాస్ చెల్లదు. సాధారణ ఫాస్టాగ్ ఛార్జీలు వర్తిస్తాయి.

కాలం ముగిసిన తర్వాత..క్లోజ్డ్ టోలింగ్ రహదారులలో (ఉదాహరణకు, ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే), ఒక ట్రిప్ అంటే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు కలిపి ఒక్కటిగా పరిగణించబడుతుంది. ఓపెన్ టోలింగ్ రహదారులలో (ఉదాహరణకు, ఢిల్లీ-చండీగఢ్), ప్రతి టోల్ ప్లాజా క్రాసింగ్ ఒక ట్రిప్‌గా లెక్కించబడుతుంది. పాస్ చెల్లుబాటు కాలం ముగిసిన తర్వాత, రూ. 3,000 చెల్లించి దాన్ని రీన్యూ చేసుకోవచ్చు. అలాగే, ఒక సంవత్సరంలో 200 ట్రిప్‌ల పరిమితి ముగిస్తే, సాధారణ ఫాస్టాగ్ రీఛార్జ్ లాగానే ఈ పాస్‌ను మళ్లీ రీఛార్జ్ చేసుకోవచ్చు.

**ఫాస్టాగ్ యాన్యువల్ పాస్ ఎలా పొందాలి?**

రాజ్‌మార్గ్ యాత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి లేదా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి మీ వాహన రిజిస్ట్రేషన్ వివరాలను నమోదు చేయండి.

ఇప్పటికే ఉన్న ఫాస్టాగ్ చెల్లుబాటులో ఉందని, బ్లాక్‌లిస్ట్‌లో లేదని నిర్ధారించుకోండి.రూ. 3,000 ఫ్లాట్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించండి.చెల్లింపు నిర్ధారణ అయిన తర్వాత, మీ యాన్యువల్ పాస్ మీ ఫాస్టాగ్‌కు లింక్ అవుతుంది.ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్నవారు కొత్తది కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రోడ్డు రవాణా, రహదారుల శాఖ స్పష్టం చేసింది.

## గుడ్ న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు.. కానీ వెండి మాత్రం..



**ముంబై-నవభూమి:** దేశంలో పసిడి ప్రియులకు మళ్లీ గుడ్ న్యూస్ వచ్చేసింది. ఎందుకంటే ఈరోజు(మంగళవారం) ఉదయం నాటికి పసిడి ధరలు భారీగా పడిపోయాయి. ఈ క్రమంలో బంగారం ధరలు ఆగస్ట్ 12, 2025న గణనీయమైన తగ్గుదలను నమోదు చేశాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 760 తగ్గి రూ. 1,02,420కి చేరుకుంది.

అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,890 వద్ద నిలిచింది. ఈ ధరలు నిన్నటితో పోలిస్తే భారీగా తగ్గాయి. వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉండి, ఢిల్లీలో కిలోగ్రాము వెండి రూ.1,16,900 స్థాయిలో ఉంది.

దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో మార్పులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి (1 కిలో) రూ. 1,26,900గా నమోదైంది. విజయవాడలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ. 1,26,900గా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,26,900గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,16,900గా నమోదైంది. ఈ ధరలు ఢిల్లీతో పోలిస్తే కొన్ని నగరాల్లో స్వల్ప వ్యత్యాసాలను చూపిస్తున్నాయి. వెండి ధరలు హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో ఢిల్లీ కంటే ఎక్కువగా ఉన్నాయి.

బంగారం ధరల తగ్గుదలకు కారణాలు

బంగారం ధరలు ఇటీవల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిలకు చేరినప్పటికీ, ఆగస్ట్ 12న గణనీయమైన తగ్గుదల నమోదైంది. దీనికి ప్రధాన కారణాలు అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్ బలపడటం, పెట్టుబడిదారులలో కొంతమంది లాభాలను బుక్ చేసుకోవడం. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు స్పాట్ గోల్డ్ రేట్లపై ఆధారపడి ఉంటాయి.డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు కూడా ఈ తగ్గుదలకు దోహదపడ్డాయి. భారతదేశంలో శ్రావణమాసం, పండుగ సీజన్ సమీపిస్తున్నప్పటికీ, కొంతమంది కొనుగోలుదారులు ధరలు మరింత తగ్గే అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. దీని వల్ల డిమాండ్ తాత్కాలికంగా తగ్గింది. వెండి ధరలు స్థిరంగా ఉండటం దీని పారిశ్రామిక వినియోగం, స్థిరమైన డిమాండ్‌ను సూచిస్తుంది.

పెట్టుబడిదారుల దృష్టి...బంగారం అనేక మందికి సురక్షిత ఆస్తిగా పరిగణించబడుతుంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ఆర్థిక అస్థిరతలు దీని డిమాండ్‌ను పెంచుతాయి. అయితే, ఇటీవలి ధరల తగ్గుదల పెట్టుబడిదారులకు కొనుగోలు అవకాశంగా కనిపిస్తోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం బంగారం ధరలు ఈ ఏడాది చివరిలో మరింత పెరిగే అవకాశం ఉంది.

## ఈ కేంద్రం స్కీంకు ఫుల్ డిమాండ్..


### ఏడాదికి 10 వేలతో చేతికి రూ. 11 కోట్లు.. లక్షకుపైగా అకౌంట్లు!



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్ర ప్రభుత్వ పథకాల్లో నేషనల్ పెన్షన్ స్కీమ్‌కు ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇది 18 ఏళు నిండిన వారికే అందుబాటులో ఉండగా.. మైనర్ల కోసం కూడా ఎన్‌పీఎస్ వాత్సల్య పేరిట గతేడాది కేంద్రం కొత్త స్కీమ్ తెచ్చిన సంగతి తెలిసిందే. పిల్లల భవిష్యత్తు కోసం దీర్ఘకాలం పాటు పెట్టుబడి పెట్టేందుకు ఇది ఉద్దేశించింది. ఈ స్కీమ్ చందాదారుల సంఖ్య 1.30 లక్షలు దాటిందని తాజాగా కేంద్రం వెల్లడించింది.


ఎవరైనా తల్లిదండ్రులు.. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే కోరుకుంటుంటారు. ఇక వారి కోసమే కష్టపడి సంపాదిస్తుంటారు. దానికి తగ్గట్లుగా తాము సంపాదించే వయసులోనే పిల్లలు ఎదిగే సరికి వారికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేస్తుంటారు. ఇప్పటికే ఇలాంటి వాటి కోసం మనకు చాలానే పథకాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం గతేడాది కొత్త స్కీమ్ తీసుకొచ్చింది. అదే ఎన్‌పీఎస్ వాత్సల్య. ఇది ఇప్పటికే ఉన్న నేషనల్ పెన్షన్ స్కీమ్ (%చీూ%) మాదిరిగానే ఉంటుంది. కానీ ఇది 18 ఏళ్లు నిండిన వారికే వర్తిస్తుండగా.. చిన్న పిల్లలు కూడా చేరేందుకు ఈ పథకం లాంచ్ చేసింది. గతేడాది సెప్టెంబర్ 18న ఈ స్కీంను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించారు.తాజాగా ఈ పథకం గురించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది ఆగస్ట్ 3 వరకు ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య (చందాదారులు) 1.30 లక్షలు దాటిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంటులో తెలిపారు. పిల్లల్లో పొదుపు ప్రోత్సహించేందుకు, వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించే ఉద్దేశంతో ఈ పథకం తీసుకొచ్చినట్లు లోక్‌సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. అంటే ఏడాది గడవక ముందే ఈ స్కీంలో లక్ష మందికిపైగా చేరారన్నమాట. ఇప్పుడు మనం ఈ స్కీమ్ గురించి తెలుసుకుందాం. 18 ఏళ్లలోపు పిల్లల పేరిట తల్లిదండ్రులు లేదా గార్డియన్స్ ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తెరవొచ్చు. పిల్లలకు 18 ఏళ్లు నిండాక.. ఇది సాధారణ %చీూ% అకౌంట్‌గా మారిపోతుంది. కనీసం రూ. 1000 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. ఇక ఈ పథకంలో ఎంత పెట్టుబడి పెడితే.. సగటున ఎంత వార్షిక రాబడికి ఎంత చేతికి వస్తుందనే అంచనాల్ని కూడా ఈ పథకం ప్రారంభించిన సమయంలో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. దీని గురించి చూద్దాం.ఇక్కడ సంవత్సరానికి రూ. 10 వేల చొప్పున 18 ఏళ్లు ఇన్వెస్ట్ చేస్తే.. 18 వ సంవత్సరం నాటికి ఇక్కడ సగటున 10 శాతం వార్షిక రాబడితో రూ. 5 లక్షలు అవుతుంది. ఏడాదికి రూ. 10 వేలు అంటే నెలకు సగటున రూ. 833 చొప్పున పడుతుంది. ఇదే రిటైర్మెంట్ నాటికి అంటే 60 ఏళ్లు వచ్చే సరికి 10 శాతం రాబడి అంచనాతోనే రూ. 2.75 కోట్లు అవుతుంది. రాబడి ఇంకాస్త ఎక్కువగా 11.59 శాతం ఆశిస్తే.. రూ. 5.97 కోట్లు అవుతుంది. 12.86 శాతం సగటు రిటర్న్ లెక్కన రూ. 11.05 కోట్లు చేతికి వస్తాయని తెలిపింది. ఇది గత డేటా ఆధారంగానే అంచనా వేసిందని.. రియల్ టైంలో ఇందులో హెచ్చుతగ్గులు ఉండొచ్చని పేర్కొంది.

## ఎల్ఐసీ నుంచి బెస్ట్ ప్లాన్.. మీ అమ్మాయి పెళ్లికి రూ.28 లక్షలు.. రోజుకు ఇంత కడితే చాలు!




**న్యూఢిల్లీ-నవభూమి:** పిల్లల ఉన్నత చదువులు, పెళ్లికి చాలా డబ్బులు అవసరమవుతాయి. అందుకే పిల్లలు చిన్నగా ఉన్నప్పటి నుంచే వారి ఉన్నత చదువులు, పెళ్లి కోసం పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉంది. ఇలా చేయడం ద్వారా ఉన్నత చదువుల కోసం, పెళ్లి కోసం ఆర్థిక భారం పడకుండా ఉంటుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఇల్లు కట్టి చూడు పెళ్లి చేసి చూడు అంటారు. అంటే ఇల్లు కోసం, పెళ్లి కోసం చేసిన అప్పు అంత సులభంగా తీరదంటారు. అందుకోసం పొదుపు, పెట్టుబడి చేయాల్సి ఉంటుంది. మీరు కూడా అమ్మాయి పెళ్లి కోసం పెద్ద మొత్తంలో డబ్బులు జమ చేయాలనుకుంటున్నారా? ఎల్ఐసీ అందిస్తోన్న జీవన్ తరుణ్ పాలసీ అందుకోసం బెస్ట్ ఆప్షన్‌గా చెప్పవచ్చు.ఎల్ఐసీ అందిస్తోన్న జీవన్ తరుణ్ ప్లాన్ ప్రత్యేకంగా పిల్లల భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించేలా రూపొందించారు. ఇందులో చేరేందుకు 9 నెలల వయసు నుంచి 12 ఏళ్ల వయసు మధ్య ఉన్న పిల్లల పేరుపై ఈ పాలసీ తీసుకోవచ్చు. ఆడ పిల్లలు ఉన్న తల్లితండ్రులు ఈ పాలసీ కొనుగోలు చేసి పొదుపు చేసుకుంటూ వెళ్లాలి. అమ్మాయికి 20 సంవత్సరాల వయసు వచ్చే నాటికి పెట్టుబడి కొనసాగించాలి. ఆ తర్వాత 5 ఏళ్లు లాకిన్ పీరియడ్ ఉంటుంది. అంటే ప్రీమియం చెల్లించకుండా వేచి ఉండాల్సి ఉంటుంది. దీంతో మీ పాప వయసు 25 సంవత్సరాలు వచ్చేసరికి పెట్టుబడి మొత్తం, బోనస్ కలిపి ఒకేసారి పెద్ద మొత్తంలో చేతికి అందుతాయి. ఈ డబ్బులు మీ అమ్మాయి ఉన్నత చదువు, పెళ్లి కోసం ఉపయోగించుకోవచ్చు.ఎల్ఐసీ జీవన్ తరుణ్ పాలసీ కనీసం బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.75000 గా ఉంటుంది. గరిష్ఠంగా పరిమితి అంటూ లేదు. అయితే ప్రీమియం చెల్లింపుల ఆధారంగా రిటర్న్స్ వస్తాయి. మీకు అనువైన పద్ధతిలో అంటే నెల రోజులు, 3 నెలలు, 6 నెలలు, ఏడాది లెక్కన ప్రీమియం చెల్లించవచ్చు. ఈ పాలసీ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ పాలసీ. ఈ పాలసీ ద్వారా ఒకేసారి రూ.28 లక్షలు ఎలా అందుకోవాలో తెలుసుకుందాం. ఏదైనా ఒక వ్యక్తి 12 సంవత్సరాల వయసు పాప పేరుపై జీవన్ తరుణ్ పాలసీ కొన్నారు అనుకుందాం. దీంతో నెలకు రూ.150 పొదుపు చేస్తూ ఉండాలి. ఏడాదికి రూ.54,750 ప్రీమియం కట్టాల్సి వస్తుంది. ఇలా మీ పాపకు 20 సంవత్సరాలు వచ్చే వరకు 8 ఏళ్లు పొదుపు చేస్తూ ఉండాలి. మీ పెట్టుబడి రూ.4.38 లక్షలుగా అవుతుంది. ఈ పెట్టుబడిపై రూ.2.47 లక్షల మేర బోనస్ ఇస్తారు. అమ్మాయికి 25 ఏళ్లకు వచ్చేసరికి రూ.7 లక్షలు అందుతాయి. అదే పాప పుట్టిన 2 ఏళ్ల నుంచే రోజుకు రూ.171 చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ 18 సంవత్సరాల పాటు కొనసాగిస్తే మీ పెట్టుబడి విలువ రూ.10.89 లక్షలుగా ఉంటుంది. దాని పై బోనస్, ఇతర ప్రయోజనాలతో మొత్తం రూ. 28.24 లక్షలు వస్తాయి. ఈ పాలసీ పూర్తి వివరాలు తెలుసుకుని కొనుగోలు చేయాలి.

## ఈక్విటీ ఫండ్లలోకి నిధుల వరద




**న్యూఢిల్లీ-నవభూమి:** జూలై నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకాల్లో నికర పెట్టుబడులు సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.42,702 కోట్లకు పెరిగాయి. ఈ జూన్‌లో నమోదైన రూ.23,578 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే ఏకంగా 81 శాతం వృద్ధి నమోదైంది. గత నెలలో ఈక్విటీ మార్కెట్లు తీవ్ర ఒడుదుడుకులకు లోనైన తరుణంలోనూ ఈ విభాగ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి రికార్డు స్థాయిలో కొత్త పెట్టుబడులు రావడం గమనార్హం. థీమాటిక్, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది. కాగా, ఈక్విటీ ఫండ్ పథకాల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది 53వ నెల అని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) సోమవారం తన నివేదికలో వెల్లడించింది. "సుంకాల పోరు నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు పెరిగినప్పటికీ, భారత వృద్ధికి ఢోకా లేదనడానికి ఈక్విటీల్లోకి పెరిగిన నిధుల వరదే నిదర్శనం. దిగివచ్చిన ధరలు (ద్రవ్యోల్బణం), మెరుగైన ద్రవ్య లభ్యత, పెరిగిన కుటుంబ ఆదా వంటి అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయ"ని యాంఫీ సీఈఓ వెంకట్ ఎన్ చలసాని అన్నారు. మరిన్ని విషయాలు..మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి క్రమానుగత పెట్టుబడులూ (సిప్) సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. గత నెలలో ఫండ్ మదుపరులు రూ.28,464 కోట్లు సిప్ చేశారు. అంతక్రితం నెలలో నమోదైన రూ.27,269 కోట్ల సిప్‌లతో పోలిస్తే 4 శాతం అధికం ఇది.ఈ జూన్‌లో డెట్ ఫండ్ల నుంచి నికరంగా రూ.1,711 కోట్లు వెనక్కి తీసుకున్న ఇన్వెస్టర్లు.. జూలైలో ఏకంగా రూ.1.06 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. లో డ్యూరేషన్, మనీ మార్కెట్ ఫండ్లతో పాటు లిక్విడ్, ఓవర్‌నైట్ ఫండ్లలో భారీగా కొత్త పెట్టుబడులు రావడం ఇందుకు తోడ్పడింది.గత నెలలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ)ల్లోకి నికరంగా రూ.1,256 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతక్రితం నెలలో వచ్చిన రూ.2,081 కోట్ల పెట్టుబడులతో పోలిస్తే మాత్రం గణనీయంగా తగ్గాయి. అయితే, వీటిల్లోకి నికర పెట్టుబడులు రావడం వరుసగా ఇది మూడో నెల.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ బుధవారం 13 । ఆగస్టు । 2025



# అర్హ క్యూట్ వీడియో..అన్నయ్యలకి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకున్న బన్నీ తనయ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తనయ అల్లు అర్హకి సంబంధించిన వీడియోలు అప్పుడప్పుడు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంటాయి. ఫన్నీ బెస్ట్ మూమెంట్స్ అయితే సోషల్ మీడియాని షేక్ చేస్తుంటాయి. తన తండ్రితో సరదాగా గడిపిన క్షణాలు, క్యూట్ డైలాగ్స్ బన్నీలేదా స్నేహా రెడ్డిలు తమ సోషల్ మీడియాలో షేర్ చేస్తుండడంతో అవి నెటిజన్స్‌తో పాటు బన్నీ అభిమానులని ఎంతగానో అలరిస్తూ ఉంటాయి. రీసెంట్‌గా మంచు లక్ష్మితో అల్లు అర్హ ఫన్నీ మూమెంట్ తెగ వైరల్ అయింది. అందులో మంచు లక్ష్మి 'నువ్వు నన్ను ఏదో అడగాలనుకున్నావట కదా ఏంటి?' అని అడగ్గా మీరు తెలుగువారేనా? అంటూ క్యూట్‌గా ప్రశ్నించింది అర్హ.చిన్నారి ప్రశ్నకి లక్ష్మీ షాక్ అవుతూ 'నేను తెలుగే పాప. నీకు అంత డౌట్ ఎందుకు వచ్చింది.' అంటూ పడి పడి నవ్వేసింది%% 'మీ యాక్సెంట్ అలా ఉంది' అంటూ అర్హ చెప్పడంతో మంచు లక్ష్మితో పాటు అల్లు అర్జున్, స్నేహ కూడా తెగ నవ్వేసుకున్నారు. ఈ వీడియో క్షణాలలోనే వైరల్ అయింది. నెటిజన్స్‌ని కూడా ఎంతగానో ఆకట్టుకుంది. అర్హ తన తండ్రితో కలిసి పలు వీడియోలు చేస్తూ సోషల్ మీడియాలో తనకంటూ సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇక శాకుంతలం సినిమాలో బాలనటిగా కూడా నటించి అలరించింది.బన్నీ భార్య స్నేహా రెడ్డి తన ఇద్దరు పిల్లలకు సంబంధించిన ప్రతి విషయాన్నీ ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ని ఉత్సాహపరుస్తుంది.పండగలు, ఫంక్షన్స్ ఫోటోలు మాత్రం మిస్ కాకుండా షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా స్నేహ అల్లువారి ఇంట జరిగిన రాఖీ వేడుకలను తన సోషల్ మీడియాలో షేర్ చేసింది.



# అనుపమ హాట్ కామెంట్స్.. టార్గెట్ ఎవరు..?



అందాల భామ అనుపమ పరమేశ్వరన్ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయినా కూడా ఎందుకో ఇంకా వెనకపడే ఉంది. బహుశా ఆమె వ్యక్తపరిచే అభిప్రాయాల వల్ల ఆమెకు అవకాశాలు రావట్లేదా అన్న డౌట్ వస్తుంది. ఎందుకంటే లేటెస్ట్ గా పరదా సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ లో అనుపమ సినిమాకు తాను 7 గంటలకు వస్తే రెండున్నర గంటల తర్వాత అంటే 9:30 గంటలకు షాట్ రెడీ అంటారు. అలా రెండున్నర గంటల టైం ఎందుకు వేస్ట్ అని తను అడిగితే మాత్రం ఈ అమ్మాయికి యాటిట్యూడ్ ఎక్కువ అనేస్తారు.

**హీరోయిన్ కాకుండా వేరే వాళ్లు చేస్తే..**


నేను కూడా సినిమా గురించే ఆలోచిస్తాను కదా.. ఈ రెండున్నర గంటల టైం లో సినిమాకు సంబందించిన థింగ్స్ ఎన్నో చేయొచ్చు. కో యాక్టర్ కోసం అన్ని గంటల టైం ఎందుకు వెయిట్ చేయాలి. ఇదే హీరోయిన్ కాకుండా వేరే వాళ్లు చేస్తే ఇలానే రియాక్ట్ అవుతారా వాళ్ల వెనకాలే కదా మాట్లాడేది. మరి హీరోయిన్స్ తో ఎందుకు వెంటనే ఆన్సర్ ఇస్తారంటూ అంటుంది అనుపమ పరమేశ్వరన్. తాను చేసిన కొన్ని సినిమాల షూటింగ్స్ లో తన అనుభవాలను చెబుతూ ఇలా రెండున్నర గంటలు హీరోయిన్ సెట్ లో వెయిట్ చేయాలంటూ చెప్పుకొచ్చింది.అనుపమ పరమేశ్వరన్ ఇలా అడగడంలో తప్పులేదు కానీ సినిమా అంతే సమిష్టి కృషి. ఒకరిద్దరు కాస్త టైం అడ్జెస్ట్ చేసుకోక తప్పదు. ప్రతిసారి అలా జరిగితే కష్టమే కానీ ఏదో ఒకరోజు అలా రెండు మూడు గంటలు అనుకోకుండా వెయిట్ చేయాల్సి రావడం సినిమా షూటింగ్స్ లో కామనే. అనుపమ చెప్పిన ఈ పాయింట్ బహుశా అందరి హీరోయిన్స్ సపోర్ట్ చేసే ఛాన్స్ ఉంటుంది. కానీ ఎవరు కావాలని హీరోయిన్ ని ఇబ్బంది పెట్టాలని ఉండదు. ఐతే ఎవరైతే అలా చేస్తున్నారో వాళ్ల గురించి కచ్చితంగా హీరోయిన్స్ ఇలా ఇన్ డైరెక్ట్ గా కాకుండా డైరెక్ట్ ఎటాక్ కి సిద్ధమయ్యే రోజు కూడా వస్తుంది. ప్రవీణ్ కంద్రేగుల డైరెక్షన్ లో..ఇక అనుపమ పరమేశ్వరన్ సినిమాల విషయానికి వస్తే ప్రెజంట్ పరదాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అనుపమ. ఈ సినిమా మీద అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది. ప్రవీణ్ కంద్రేగుల డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాలో సంగీత, దర్శన రాజేంద్రన్ కూడా ఇంపార్టెంట్ రోల్స్ లో నటించారు. అనుపమ లీడ్ రోల్ లో నటించిన సినిమా అవ్వడం వల్ల ఈ సినిమా బాధ్యత అంతా తన మీద వేసుకుంది అమ్మడు. సినిమాకు ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టగా ఆగష్టు 22న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది.

# ప్రభాస్ ఫౌజీ అప్డేట్.. అసలు మ్యాటర్ ఇది..!



ప్రభాస్ హను రాఘవపూడి డైరెక్షన్‌లో ఒక సినిమా చేస్తున్నాడన్న విషయం తెలిసిందే. ఈ సినిమా కూడా పీరియాడికల్ కథగా రాబోతుంది. బిఫోర్ ఇండిపెండెన్స్ టైం స్టోరీతో ఇది తెరకెక్కుతుంది. ఐతే ఈ సినిమా షూటింగ్ అప్డేట్ గురించి ఫ్యాన్స్ అంతా ఎంతో ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ సినిమా అప్డేట్స్ అంటూ రోజు ఏదో ఒక న్యూస్ వస్తూనే ఉంటుంది. హను, ప్రభాస్ మూవీ ఫౌజీ (వర్కింగ్ టైటిల్) సినిమా కూడా 50 శాతం షూటింగ్ పూర్తైందన్న న్యూస్ వచ్చింది. ఐతే అందులో ఎలాంటి నిజం లేదని తెలుస్తుంది.తెలుస్తున్న సమాచారం ప్రకారం ప్రభాస్ ఫౌజీ ఇంకా 150 నుంచి 160 రోజుల దాకా షూటింగ్ ఉంటుందట. అంతేకాదు ఈ సినిమా సుభాస్ చంద్రబోస్ గురించి అంటూ న్యూస్ వైరల్ అయ్యింది. ఐతే ఫౌజీలో ఆయన ప్రస్తావన ఉండే ఛాన్స్ ఉంది కానీ కథ మాత్రం వేరే అని అంటున్నారు. అంతేకాదు ఈ సినిమా స్టోరీ బ్యాక్ డ్రాప్ అంతా కూడా చాలా కొత్తగా ఉంటుందని చెబుతున్నారు.బిఫోర్ ఇండిపెండన్స్ స్టోరీనే అయినా హను మార్క్ ఫిక్షనల్ స్టోరీగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఇమాన్వి నటిస్తుంది. ప్రభాస్ ఇమాన్వి కెమిస్ట్రీ కూడా సినిమాకు హైలెట్ అవుతుందని అంటున్నారు. రెబల్ స్టార్ ప్రభాస్ క్రేజీ సినిమాల్లో ఒకటిగా ఫౌజీ వస్తుంది. ఈ సినిమాను హను చాలా ఫోకస్ తో చేస్తున్నారట. సినిమాకు సంబందించి ప్రతి విషయాన్ని చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారట.సందీప్ తో స్పిరిట్ సినిమా..ప్రభాస్ ఈ సినిమాతో పాటు సందీప్ తో స్పిరిట్ సినిమా చేయాల్సి ఉంది. ఈ సినిమాతో పాటు కల్కి 2, సలార్ 2 కూడా పూర్తి చేయాల్సి ఉంది. ఆల్రెడీ ప్రభాస్ మారుతి కాంబోలో వస్తున్న రాజా సాబ్ ని ఫినిష్ చేశాడని తెలుస్తుంది. ఆ సినిమా ఈ ఇయర్ డిసెంబర్ 5న రిలీజ్ ఫిక్స్ చేశారు.ప్రభాస్ ఫౌజీ సినిమాను నెక్స్ట్ ఇయర్ సమ్మర్ లేదా సెకండ్ హాఫ్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాతో ప్రభాస్ స్టామినా ఏంటో మరోసారి పాన్ ఇండియా లెవెల్ లో తెలుస్తుందని అంటున్నారు. ప్రభాస్ సినిమాలు ఒక్కొక్కటి ఒక్కో ట్రెండ్ సెట్టర్ గా ఉండబోతున్నాయి. నెక్స్ట్ రాబోతున్న సినిమాలన్నీ కూడా ఏ ఒక్క రికార్డ్ కూడా మిగల్చకుండా చేసేలా ఉన్నాయి. ఈ ఇయర్ రాజా సాబ్ తో ఫ్యాన్స్ కి ట్రీట్ ఇవ్వనున్న ప్రభాస్ నెక్స్ట్ ఇయర్ ఫౌజీ ఆ తర్వాత స్పిరిట్ ఇలా లైన్ లో బ్లాక్ బస్టర్ ప్లానింగ్ తో వస్తున్నాడు.

# డబ్బుతో నారాయణ మూర్తిని కొనలేం!



విప్లవ చిత్రాల దర్శకుడు, నటుడు, కామ్రేడ్ ఆర్ . నారాయణ మూర్తి ముక్కు సూటి తత్వం గురించి తెలిసిందే. విమర్శ అయినా? ప్రశంస అయినా? స్ట్రెయిట్‌గా ఉంటుంది. తనకు తప్పు అనిపించిందంటే తప్పు అని ఒప్పు అనిపించిందంటే? ఒప్పు అని అంతే ధీటుగా మాట్లాడుతారు. మనసులో ఒకటి పెట్టుకుని బయటకు మరోలా మాట్లాడే తత్వం గల వారు కాదు. తన వ్యక్తిత్వాన్నే తన సినిమా కథలుగా ఎన్నో చిత్రాల్లో ఆవిష్కరించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎంత మంది డైరెక్టర్లు ఎలాంటి సిని మాలు తీసినా? నారాయణమూర్తిలా సినిమా తీయలేరు అన్నది అంతే వాస్తవం. డైరెక్టర్‌గా ఆయనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన సినిమాలుంటాయి. ఇటీవలే కేంద్రం మావోయి స్టులపై కాల్పులకు తెగబడిన నేపథ్యంలో? ప్రశ్నించిన వారిని పొట్టనబెట్టుకుంటారా? అంటూ గళ మెత్తారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గానూ మారాయి. తాజాగా నారాయణ మూర్తి తీసిన యూనివర్సిటీ పేపర్ లీక్- చిత్రాన్ని దర్శకుడు త్రివిక్రమ్ వీక్షించారు. అనంతరం మూర్తిగారిని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. -నారాయణ మూర్తి వన్ మ్యాన్ ఆర్మీ. ఆయన సినిమాల్లో ఆయనే రాజు.. మంత్రి...సైన్యాధిపతి- అన్నారు సినిమాను ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం ఆయనే చేస్తారన్నారు. ప్రతీ సినిమాలోనూ సామాజికంగా ఏదో ప్రయోజనం ఉండేలా సినిమాలు చేయడం ఆయనకే సాధ్య మైందన్నారు. అణిచివేతకు గురైన వారి తరుపున మాట్లాడేందుకు ఉన్న ఓ గొంతు ఆయనది. అది అందరికీ వినబడేలా ఆయన ప్రయత్నిస్తారు. అది కొందరికి నచ్చొచ్చు..నచ్చకపోవచ్చు. కానీ ఇలాంటి వారు మాట్లాడాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రపంచంలో ఏకపక్ష ధోరణి నెలకొంటుందన్నారు. .తాను మాత్రం చాలాసార్లు రాజీ పడ్డాన్నారు. మూర్తి గురించి మరో మాట కూడా విన్నాను. సినిమాలో ఓ పాత్ర కోసం ఆయన్ని అనుకున్నాను. కానీ ఆయన్ని పారితోషికంతో కొనలేమని ఎవరో? అనడంతో నా ఆలోచన విరమించుకున్నారు. టెంపర్ చిత్రంలో పోసాని కృష్ణమురళి పోషించిన కానిస్టేబుల్ పాత్రను పూరి జగన్నాథ్ ముందుగా మూర్తికే ఆఫర్ చేసారు. కానీ ఆ అవకాశాన్ని నారాయణ మూర్తి సున్నితంగా తిరస్కరించారు. అధిక పారితోషికం ఆపర్ చేసినా నో చెప్పిన నటుడాయన. దీంతో ఆ పాత్ర బాధ్యతలు పూరి పోసానికి అప్పగించారు.


# ఆ క్రెడిట్ కార్తీక్ సర్ కే.. వాళ్లు నా మూవీలు చూడలేదేమో: పూజ హెగ్డే



హీరోయిన్ పూజా హెగ్డే గురించి అందరికీ తెలిసిందే. కోలీవుడ్ మూవీ మాస్క్ తో తెరంగేట్రం చేసిన బ్యూటీ.. ఆ తర్వాత ఒక లైలా కోసం సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. తొలి మూడు చిత్రాలతో ఆశించినంత రిజల్ట్ అందుకోకపోయినా.. క్రేజీ మాత్రం సంపాదించుకుంది. కొన్నాళ్లపాటు టాలీవుడ్ లో హవా సాగించింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మూవీతో కుర్రాళ్ల మనసులు దోచుకున్న అమ్మడు.. ఆ తర్వాత టాలీవుడ్ స్టార్ హీరోల సరసన ఛాన్స్ లు సొంతం చేసుకుంది. మహేష్ బాబు, ఎన్టీఆర్, ప్రభాస్ వంటి టాప్ స్టార్ హీరోలతో నటించిన పూజా హెగ్డే.. ఆ తర్వాత వరుస ఫ్లాప్ లు ఆమె ఖాతాలో చేరాయి. దీంతో కెరీర్ ఒక్కసారిగా డౌన్ అయిపోయింది.రీసెంట్ గా తెలుగులో ఒక్క సినిమాలో కూడా కనిపించలేదు. కానీ కోలీవుడ్, బాలీవుడ్ లో బాగానే అవకాశాలు అందుకుంటోంది. విజయ్ జన నాయగన్ మూవీలో ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న ఆమె.. నార్త్ లో హై జవానీతో ఇష్క్ హెూనా హై సినిమాలో యాక్ట్ చేస్తోంది. తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీ మూవీలో స్పెషల్ సాంగ్ మోనికలో సందడి చేయనుంది.


ఆ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొంటోంది అమ్మడు. అందులో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేయగా.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. సినీ ఇండస్ట్రీలో మిమ్మల్ని ఎందుకు గ్లామరస్ జోనర్ లో చూస్తుంటారని అడగ్గా.. పూజా మాట్లాడారు. ఆడియన్స్ కాదని, బాలీవుడ్ లో చాలా మంది మేకర్స్ అలా చూస్తున్నారని తెలిపారు."నార్త్ లో చాలా మంది చిత్ర నిర్మాతలు నన్ను కేవలం గ్లామర్ పాత్రల కోసం టైప్ కాస్ట్ చేస్తున్నారు. వారు దక్షిణ భారతదేశంలో నా సినిమాలు చూడలేదని నేను అనుకుంటున్నాను. నేను ఏ సినిమాలు చేస్తున్నానో వాళ్లకు తెలియదేమో. 2025లో విభిన్నమైన పాత్రలు చేస్తున్నా" అని తెలిపింది పూజ."అయితే నేను కార్తీక్ సుబ్బరాజ్‌కు ఫుల్ క్రెడిట్ ఇస్తాను. ఆయన నన్ను డిఫరెంట్‌గా చూశారు. నేను కూడా రుక్మిణి లాంటి రోల్స్ చేయగలనని ప్రూవ్ చేశారు. సూర్య రెట్రో మూవీలో నేను చేసిన ఆ రోల్ చాలా రేర్. రాధేశ్యామ్ లో నాకు చూసి ఫిక్స్ అయ్యారని తెలిసి షాక్ అయ్యా. ఆయన విజన్ ఉన్న డైరెక్టర్" అంటూ కార్తీక్ సుబ్బరాజ్‌ను కొనియాడారు.

# డబ్బింగ్ సినిమాలకి కూడా రేట్లు పెంచుతారా..ఇప్పుడు ఇండస్ట్రీలో ఇదే చర్చ..!




ఈ మధ్య పెద్ద సినిమాలకి టిక్కెట్ రేట్స్ ఎంతగా పెంచుతున్నారో మనం చూస్తూనే ఉన్నాం. రాజమౌళి దీనికి బీజం వేయగా, అది డబ్బింగ్ సినిమాలకి కూడా కంటిన్యూ అవుతుంది. మరో రెండు రోజులలో వార్2, కూలీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఆ మూవీ టిక్కెట్ ధరలు తెలంగాణ, ఏపీలో కూడా భారీగా పెరగనున్నాయని అంటున్నారు. మల్టిప్లెక్స్ ల్లో కూలి చిత్రానికి గాను ఒక్క టికెట్ కు రూ.350 ధరను నిర్ణయించగా,వార్ 2 చిత్రానికి 413 రూపాయలు ఒక్క టికెట్ ధరగా ఉండటం గమనార్హం. మల్టిప్లెక్స్ ల్లో అత్యధిక రేట్లు ఉన్న కారణంగా సింగిల్ స్క్రీన్ రేట్లు కూడా భారీగానే పెంచారు. రజనీకాంత్ గ్యాంగ్ స్టర్ ఫిల్మ్ కూలి చిత్రానికి రూ.200 ఉండగా, జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ భారీ యాక్షన్ ఫిల్మ్ వార్ 2కు రూ.250 టికెట్ ధరను నిర్ణయించినట్టు తెలుస్తుంది. ఈ వార్త మూవీ లవర్స్ గుండెల్లో బాంబులు పేలుస్తోంది. అయితే కూలీ చిత్రానికి చెన్నైలో తక్కువ రేట్ కే టిక్కెట్ ధరలు ఉండటం గమనార్హం. ఒకే కార్పొరేట్ మల్టీప్లెక్సులోనే రెండు నగరాల్లో వేర్వేరు ధరలు ఉండటం పట్ల సినీ ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాక్టికల్ గా చూస్తే రెండు డబ్బింగ్ సినిమాలే అని చెప్పాలి. జూనియర్ ఎన్టీఆర్, నాగార్జునలు నటించి స్వంతంగా డబ్బింగ్ చెప్పినంత మాత్రాన స్ట్రెయిట్ సినిమాలు కావు కదా అని కొందరు అంటున్నారు. డబ్బింగ్ సినిమాలకి కూడా తెలుగు రాష్ట్రాలలో టిక్కెట్ ధరలు అంత పెంచాల్సిన పని ఏంటని కొందరు మండిపడుతున్నారు. అయితే ఐ నుంచి భారతీయుడు 2 దాకా ఎన్నోసార్లు ఇలా పెంపులు తెచ్చుకుని వసూళ్లు చేసుకున్న దాఖలాలు చాలా ఉన్నాయి.తెలుగు సినిమాలు తమిళనాడు, కేరళలో రిలీజ్ అయినప్పుడు సరిపడా థియేటర్లు ఇవ్వడానికి అక్కడి డిస్ట్రిబ్యూటర్ ఎన్నో కారణాలు చెబుతారు. మన దగ్గర మాత్రం రజని, సూర్య, విక్రమ్ హీరో ఎవరైనా సరే హైకులు ఇవ్వడానికి ముందు ఉంటున్నారని సగటు ప్రేక్షకుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగు సినిమాలకు హైక్స్ అంటే ఓకే కానీ డబ్బింగ్ సినిమాలకి , అది కూడా హై బడ్జెట్ లేని మిడ్ రేంజ్ సినిమాలకి కూడా ఇష్టానుసారంగా హైక్స్ పెంచేయడం ఏంటనే చర్చ జోరుగా నడుస్తుంది. ఓ పక్క కొందరు నిర్మాతలే హైక్స్ వలన జనం థియేటర్స్ కి రావట్లేదు అని గగ్గోలు పెడుతుండగా, మళ్లీ వాళ్లే పెంచుకుంటూ పోతే ఎలా అంటూ కొందరు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కూలీ చిత్రంకి కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే 2.5 లక్షల టికెట్లు బుక్ కాగా, 11 కోట్ల రూపాయల ఇండియా గ్రాస్ వసూలలైనట్టు సమాచారం. ఇక వార్ 2కు 56 వేల టికెట్లు బుక్ కావడంతో 4.5 కోట్ల రూపాయల ఇండియా గ్రాస్ వచ్చిందని ట్రేడ్ నిపుణులు స్పష్టం చేశారు.

# డివోర్స్ వేళ హన్సిక ఎమోషనల్ పోస్ట్ నెట్టింట మరోసారి హాట్ టాపిక్




దేశ ముదురు చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న అందాల ముద్దుగుమ్మ హన్సిక. ఈ అమ్మడు తెలుగులో పలువురు స్టార్ హీరోలతో కలిసి నటించింది. హిందీతో పాటు ఇతర భాషలలోను పలు సినిమాలు చేసింది. మంచి టాలెంట్ ఉన్న హన్సికకి ఇటీవల సినిమా అవకాశాలు తగాయి. అయితే 2022 డిసెంబర్‌లో హన్సిక తన బాయ్ ఫ్రెండ్ సోహైల్‌ని వివాహం చేసుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టింది. హన్సిక స్నేహితురాలితో సొహైల్ కు గతంలో వివాహం అయిన, ఆమెకి విడాకులు ఇచ్చి హన్సికని పెళ్లి చేసుకున్నాడు.కొద్ది రోజులుగా హన్సిక, సొహైల్ కూడా విడిపోతున్నారని ప్రచారం జరుగుతోంది. కొన్నాళ్లుగా వీరు విడివిడిగా ఉంటున్నారని నెట్టింట వార్తలు వస్తున్నాయి. సోహల్‌ది పెద్ద కుటుంబం కాగా, వారితో హన్సిక కలవలేకపోవడం వల్లే మనస్పర్థలు వచ్చాయని, అందుకే నటి ప్రస్తుతం తల్లి దగ్గరే ఉంటోందని టాక్ నడుస్తుంది. మరోవైపు హన్సిక తన సోషల్ మీడియాలో పెళ్లి ఫోటోలు అన్ని డిలీట్ చేయడంతో ఈ ప్రచారం నిజమేనని కొందరు భావిస్తున్నారు. ఇందులో ఎంత నిజముందో తెలియాలంటే హన్సిక లేదా సొహైల్ లేకుంటే వారి కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు స్పందిస్తే కాని క్లారిటీ రాదు.అయితే హన్సిక మోత్వానీ రీసెంట్‌గా 34వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ క్రమంలో ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఒక ఎమోషనల్ మెసేజ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఇందులో ఆమె జీవితంలో వచ్చిన మార్పులు, నేర్చుకున్న పాఠాల గురించి చెప్పడం అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది. 2025 సంవత్సరం నేను అడగకుండానే నాకు ఎన్నో పాఠాలు నేర్పింది.

# క్రీడా బిల్లుకు గ్రీన్ సిగ్నల్




**న్యూఢిల్లీ-నవభూమి:** జాతీయ క్రీడా పరిపాలన బిల్లు (ఎన్ఎస్‌జీబీ)ను లోక్‌సభ సోమవారం ఆమోదించింది. స్వాతంత్ర్యం తర్వాత దేశ క్రీడా రంగంలో తీసుకొచ్చిన ఏకైక అతి పెద్ద సంస్కరణగా ఈ బిల్లును కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవ్య అభివర్ణించారు. బిహార్‌లో ఎన్నికల జాబితాలో సవరణలపై ప్రతిపక్షం వ్యక్తంజేస్తున్న నిరసనల మధ్యే క్రీడా బిల్లును సభ ఆమోదించడం గమనార్హం. అలాగే జాతీయ డోపింగ్ నిరోధక (ఎన్ఏడీ) సవరణ బిల్లుకూ లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'స్వాతంత్ర్యం వచ్చాక క్రీడల్లో చేపట్టిన అతి పెద్ద సంస్కరణ ఈ బిల్లు. క్రీడా సమాఖ్యలలో జవాబుదారీతనం, అథ్లెట్లకు న్యాయం చేకూర్చడంతోపాటు ఉత్తమ పరిపాలనను ఈ బిల్లు అందిస్తుంది' అని విపక్ష సభ్యుల నినాదాల మధ్య మాండవ్య ప్రకటించారు. బిహార్ ఎన్నికల జాబితాలో సవరణలను వ్యతిరేకిస్తూ ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం ముట్టడికి వెళ్లిన నేపథ్యంలో.. లోక్‌సభలో క్రీడా బిల్లు ఆమోదం సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతలెవరూ లేరు. అయితే తర్వాత ఇద్దరు విపక్ష ఎంపీలు బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొంటూ తమ మద్దతు తెలిపారు. నిరసన కార్యక్రమం తర్వాత సభలో ప్రవేశించిన విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. ఈ గందరగోళ పరిస్థితుల మధ్యనే 'వాయిస్ ఓటు'తో క్రీడా బిల్లును సభ ఆమోదించింది. అంతకుముందు..క్రీడలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ దిగ్విజయ్ సింగ్ మాట్లాడుతూ క్రీడా పరిపాలన బిల్లును పార్లమెంటరీ ప్యానెల్‌కు పంపాలని లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాను కోరారు. ఈ బిల్లును ప్యానెల్ కూలంకషంగా పరిశీలించడంతోపాటు చర్చించిన అనంతరమే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని అభిప్రాయపడ్డారు. అయితే దేశ క్రీడా రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతోపాటు 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ప్రయత్నిస్తున్న తరుణంలో

# అడ్డంకులను అధిగమిస్తాం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది భారత్, శ్రీలంకల్లో ప్రతిష్ఠాత్మక మహిళల వన్డే వరల్డ్‌కప్ జరుగబోతోంది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 2 వరకు జరిగే ఈ టోర్నీ 50 రోజుల కౌంట్‌డౌన్‌తో పాటు ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఇందులో ఐసీసీ అధ్యక్షుడు జైషా, సీవోవో సంజోగ్ గుప్తా, బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, మిథాలీ రాజ్‌తో పాటు భారత మహిళల జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్ పాల్గొన్నారు. అయితే 1973 నుంచి జరుగుతున్న ఈ మెగా టోర్నీలో భారత జట్టు విజేతగా నిలువలేకపోయింది. 2005, 2017లో మాత్రం రన్నర్‌పగా నిలిచింది. అందుకే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కప్‌పై ధీమాను వ్యక్తపరుస్తోంది. 'ఈసారి మాత్రం అన్ని అడ్డంకులను అధిగమించి, భారత అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న కప్‌ను సాధిస్తాం. దేశం కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాం. అలాగే యువరాజ్‌ను చూసి నేనెంతో ప్రేరణ పొందుతా' అని హర్మన్ తెలిపింది.

# నేను హైదరాబాదీనే




**హైదరాబాద్-నవభూమి:** తాను హైదరాబాదీనేనని, తనకు నగరంలో ఇల్లు కూడా ఉందని టీమిండియా దిగ్గజ వికెట్‌కీపర్, 1983 వరల్డ్‌కప్ హీరోల్లో ఒకరైన సయ్యద్ కిర్మాణీ తెలిపాడు. క్రికెట్‌లో తన అనుభవం, నైపుణ్యాలను ఉపయోగించుకోవాలని భావిస్తే, తనకు అంతకంటే సంతోషం ఇంకేముంటుందన్న ఆయన.. తెలంగాణ రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు సిద్ధమన్నాడు. 'ఆంధ్రజ్యోతి'తో కిర్మాణీ చెప్పిన మరిన్ని విశేషాలు ఆయన మాటల్లోనే..1983లో మేం వన్డే వరల్డ్‌కప్ గెలుస్తామని కలలో కూడా అనుకోలేదు. ఆ విశ్వకప్ భారత క్రికెట్‌కు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయులకు గౌరవాన్ని తీసుకొచ్చింది. ఆ విజయం దేశంలో క్రికెట్ రూపురేఖలను సమూలంగా మార్చేసింది. అప్పటివరకు క్రికెట్‌ను ఒక ఆటగానే చూసిన భారతీయులు వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత క్రికెట్‌ను ఒక మతంగా ఆరాధించడం ప్రారంభించారు.సరైన హెల్మెట్లు, రక్షక కవచాలు లేకుండానే ప్రపంచంలోని మేటి పేస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. మాల్కం మార్షల్, మైకేల్ హోల్డింగ్, ఆండీ రాబర్ట్స్ బంతులు బుల్లెట్లలా దూసుకొచ్చేవి. వారి బౌలింగ్‌లో ఆడడాన్ని ఆస్వాదించేవాడిని కానీ భయపడే వాడిని కాదు. ఎందుకంటే జీవితంలో దేనికి భయపడినా మనం ఓడిపోయినట్టే. యువ క్రికెటర్లకు కూడా నేనిచ్చే సలహా ఒక్కటే. భయం లేకుండా తెగువతో స్వేచ్ఛగా ఆడితే తప్పకుండా కెరీర్‌లో విజయం సాధిస్తారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**